www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 27-11-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 222 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి తె. 6.24 తదుపరి త్రయోదశి; నక్షత్రం: చిత్త పూర్తి; వర్జ్యం: మ. 1.34-3.22; దుర్ముహూర్తం: ఉ. 11.40-12.24; అమృతఘడియలు: రా. 12.23-2.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.30; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభూతి సరికొత్తగా ఇప్పుడు మన గుడివాడ లో

అద్భుతమైన ప్రారంభోత్సవ ఆఫర్లు



THE ONE STOP SHOP

CMR SHOPPING MALL

The joy of life

నెహ్రూ చౌక్ సెంటర్

గుడివాడ

FOLLOW US ON /cmrshoppingmallindia /cmrshoppingmall

శారీస్

1 పర్ఫుమ్ సిల్క్ శారీ ₹149*	1 ఆరెంజ్ చిఫాన్ శారీ ₹179*	1 బర్ఫీ చిఫాన్ శారీ ₹199*	1 లియో సిల్క్ శారీ ₹229*	1 మోస్ క్రేప్ శారీ ₹249*	1 బొంబాయి కాటన్ శారీ ₹279*	1 ఐస్ లేడీ శారీ ₹279*	1 కాటన్ ప్రింటెడ్ శారీ ₹299*	1 సుచిత్ర శారీ ₹299*	1 బ్రోకేడ్ శారీ ₹333*
1 పటోల సిల్క్ శారీ ₹333*	1 టొటిక్స్ సిల్క్ శారీ ₹349*	1 శివాని సిల్క్ శారీ ₹399*	1 అక్షర పట్టు శారీ ₹444*	1 సనా సిల్క్ శారీ ₹449*	1 లెనిన్ సిల్క్ శారీ ₹499*	1 సాఫ్ట్ బ్రోకేడ్ శారీ ₹499*	2 కేరళ కాటన్ శారీ ₹499*	1 కళ్యాణం సిల్క్ శారీ ₹555*	1 మా ఫ్యాన్సీ శారీ ₹599*
1 సిల్క్ బ్రోకేడ్ శారీ ₹699*	1 సాఫ్ట్ సిల్క్ శారీ ₹799*	2 కంచి కాటన్ శారీ ₹799*	1 బనారస్ పట్టు శారీ ₹899*	1 బనారస్ ఫ్యాన్సీ శారీ ₹899*	1 మంగళగిరి పట్టు శారీ ₹999*	2 అరవు కోట్టై శారీస్ ₹999*	2 వేపరాల హ్యాండ్లూమ్ ₹999*	2 యల్లంపల్లి హ్యాండ్లూమ్ ₹999*	1 టిష్యూ సిల్క్ శారీ ₹1099*
2 అరవు కోట్టై శారీస్ ₹1199*	1 మహదేవ పట్టు శారీ ₹1199*	1 ఫ్యాన్సీ బుటా శారీ ₹1299*	1 శ్రావణ పట్టు శారీ ₹1499*	1 కాంజీవరం పట్టు శారీ ₹1799*	1 సౌభాగ్య పట్టు శారీ ₹1999*	1 మాంగళ్య పట్టు శారీ ₹2199*	1 అక్షయ పట్టు శారీ ₹2399*	1 మహాలక్ష్మి పట్టు శారీ ₹2699*	1 ఐశ్వర్య పట్టు శారీ ₹2999*

ఉమెన్స్ వేర్

1 లేడీస్ లెగ్గింగ్ ₹99*	1 లేడీస్ కుర్తా ₹99*	1 లేడీస్ నైటీ ₹99*	1 లేడీస్ పలాజో ₹99*	1 లేడీస్ లెగ్గింగ్ ₹149*	1 లేడీస్ టీ-షర్ట్స్ ₹199*	1 లేడీస్ నైటీ ₹199*	1 లేడీస్ కుర్తా ₹199*	1 లేడీస్ ప్రింటెడ్ కుర్తా ₹249*	1 స్ట్రెయిట్ కట్ చుడీదార్ ₹299*
1 ఫ్యాషన్ కుర్తా/కుర్తీ ₹299*	1 కాటన్ డ్రెస్ మెటీరియల్ ₹499*	1 రెడీమేడ్ చుడీదార్ ₹499*	1 ఫ్యాన్సీ డ్రెస్ మెటీరియల్ ₹599*	1 ఫ్యాషన్ చుడీదార్ ₹599*	2 లేడీస్ కుర్తా ₹699*	1 ఫ్యాన్సీ గాగ్రా ₹799*	3 డ్రెస్ మెటీరియల్ కాంబో ₹899*	1 పార్టీ వేర్ చుడీదార్ ₹999*	3 లేడీస్ వెస్టర్న్ డ్రెస్ ₹999*

*CONDITIONS APPLY

కిడ్స్ వేర్

2 గర్ల్స్ లెగ్గింగ్స్ ₹249*	2 గర్ల్స్ ప్లాజో ₹249*	2 గర్ల్స్ టీ-షర్ట్స్ ₹249*	2 గర్ల్స్ హోజరీ ఫ్రాక్స్ ₹249*	2 గర్ల్స్ లోయర్స్ ₹349*	2 బాయ్స్ 3/4 ప్యాంట్స్ ₹349*	2 బాయ్స్ టీ-షర్ట్స్ ₹349*	2 బాయ్స్ షర్ట్స్ ₹399*	2 గర్ల్స్ టీ-షర్ట్స్ ₹399*	2 బాయ్స్ షర్ట్స్ ₹449*
2 గర్ల్స్ హోజరీ కేప్రి ₹449*	2 బాయ్స్ టీ-షర్ట్స్ ₹499*	2 బాయ్స్ షర్ట్స్ ₹499*	2 బాయ్స్ జీన్స్ ₹799*	2 బాయ్స్ కాటన్ ప్యాంట్స్ ₹799*	2 బాయ్స్ షర్ట్స్ ₹799*	2 గర్ల్స్ ఫ్యాన్సీ టాప్స్ ₹799*	3 బాయ్స్ జీన్స్ ₹999*	2 గర్ల్స్ ప్లాజో సెట్ ₹1299*	2 బాయ్స్ ఫుల్ సూట్ ₹1399*

మెన్స్ వేర్

1 మెన్స్ టీ-షర్ట్స్ ₹249*	1 ఫ్యాషన్ టీ-షర్ట్స్ ₹299*	1 ఫ్యాషన్ షర్ట్స్ ₹399*	2 క్యాజువల్ షర్ట్స్ ₹499*	1 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹599*
2 మెన్స్ క్యాజువల్ షర్ట్స్ ₹999*	2 మెన్స్ కాటన్ ట్రౌజర్స్ ₹1199*	2 మెన్స్ కాటన్ ట్రౌజర్స్ ₹1299*	2 మెన్స్ జీన్స్ ₹1399*	2 మెన్స్ జీన్స్ ₹1499*

ARROW | U.S. POLO ASSN.
GET ₹1000 OFF On purchase of 7999*
GET ₹2000 OFF On purchase of 12999*

parx
GET ₹1000 OFF On purchase of 6999*
GET ₹2000 OFF On purchase of 12999*

KILLER this is us
GET A BACKPACK AT ₹99* ON SHOPPING OF ₹5999*



COOL COLORS | OXEMBERG | OTTO | WHITE HOUSE | TWILLS
UPTO 40% OFF*

బెడ్ షీట్స్



1+1 జి మిల్స్ బెడ్ షీట్స్ ₹299*	1+1 జి మిల్స్ బెడ్ షీట్స్ ₹399*	1+1 జి మిల్స్ బెడ్ షీట్స్ ₹599*	1+1 జి మిల్స్ బెడ్ షీట్స్ ₹666*	1+1 A/C బ్లాంకెట్ ₹699*



• చీరలు • చుడీదార్స్ • గాగ్రాస్ • ఉమెన్స్ వేర్ • మెన్స్‌వేర్ • కిడ్స్ రెడీమేడ్స్ | ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 27-11-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

ప్రజలకు మెరుగైన జీవితం

మన బాధ్యత

కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు కలిసి పని చేయాలి




పౌరుల క్రియాశీల భాగస్వామ్యంతో రాజ్యాంగ ఆదర్శాలు బలోపేతం

రాజ్యాంగ దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దేశమే ముందు: ప్రధాని మోదీ

2

విజయ్‌పాల్ అరెస్టు



రఘురామ కస్టోడియల్ హింస కేసులో చర్యలు



అరెస్ట్ అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి విజయ్‌పాల్‌ను తాలూకా స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఒంగోలులో ఉదయం నుంచి రాత్రి దాకా విచారణ

చివర్లో స్వయంగా రంగంలోకి ప్రకాశం ఎస్పీ

రఘురామను చంపేందుకు కుట్ర చేశారా?

ఎవరి ఆదేశాల మేరకు ఆయనను హింసించారు?

అరెస్టులో నిబంధనలు ఎందుకు పాటించలేదు?

అనేక కోణాల్లో విజయ్ పాల్‌కు ప్రశ్నలు

విచారణకు సహకరించని రిటైర్డ్ అదనపు ఎస్పీ

అరెస్టు చేస్తున్నట్లు ప్రకటన.. రాణాకు తరలింపు

ఒంగోలు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును కస్టడీలో హింసించిన కేసులో రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిలు నిరాకరించడం, విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో మంగళవారం రాత్రి ఆయనను అరెస్టు చేశారు. దర్యాప్తు అధికారి, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఈ విషయాన్ని ప్రకటించారు. విజయ్‌పాల్‌ను భారీ భద్రత మధ్య ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం గుంటూరుకు తీసుకెళ్లనున్నారు. కస్టోడియల్ టార్చర్‌పై రఘురామ ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీని విచారణాధికారిగా నియమించింది. ఈనెల 13వ తేదీన పోలీసులు విజయ్‌పాల్‌ను ఈ కేసులో

మిగతా 14వ పేజీలో...

తండ్రి అధికారంలో ఉండగా ఐఏఎస్‌లు బలి! తానే అధికారంలోకి వచ్చాక... ఐపీఎస్‌లు బలి! అప్పట్లో శ్రీలక్ష్మి, బీపీ ఆచార్య వంటి సీనియర్ ఐఏఎస్‌లు అక్రమాస్తుల కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు... 'ఎస్ బాస్' అంటూ జగన్ అడ్డగోలు ఆదేశాలను అమలు చేసిన ఐపీఎస్‌లు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలపై సస్పెన్షన్ వేటు పడింది. 'ఐపీఎస్' జస్ట్ మిస్ అయిన రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ ఏకంగా అరెస్టు అయ్యారు. శాంతిభద్రతలను కాపాడుతూ... చట్టం ప్రకారం నడుచుకోవాల్సిన పోలీసు అధికారులకు పట్టిన దుస్థితి ఇది!

పాపాల పోలీసులు!

వైసీపీ హయాంలో అడ్డగోలు చర్యలు.. వేధింపులే లక్ష్యంగా సీఐడీ కేసులు

నాటి సీఐడీ చీఫ్ సునీల్ ఆదేశాలు.. అదనపు ఎస్పీ విజయ్‌పాల్ ద్వారా అమలు

రఘురామపై 'తాడేపల్లి' పెద్దల కసి.. దేశద్రోహం కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్టు

కరుడుగట్టిన నేరస్థుడి తరహాలో తరలింపు.. కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగం



ఐటీలో మేటి

రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి పలు కార్యక్రమాలు

అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐకానిక్ భవనం

2029 నాటికి 5 లక్షల ఐటీ వర్క్ స్టేషన్లు

ఐటీ డెవలపర్లకు కేటగిరీల వారీగా రాయితీలు

జోనల్ హబ్‌లతో ఐఐటీల అనుసంధానం

యువతలో నైపుణ్యాన్ని పెంచే కార్యక్రమాలు

పలు వర్గాల స్టార్టప్‌లకు 25 లక్షల వరకు సబ్సిడీ

కొత్త ఐటీ పాలసీకి సీఎం చంద్రబాబు ఆమోదం

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఉన్నత స్థానంలో నిలిపేలా పలు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. నూతన టెక్నాలజీ ప్రయోజనాలను రాష్ట్రం అందిపుచ్చుకునేందుకు పలు రాయితీలు ప్రకటించారు. ఐటీ రంగానికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, ఐటీ డెవలపర్లకు ఇచ్చే సబ్సిడీలు ఎలా ఉండాలో కూడా స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం కొత్త ఐటీ పాలసీ 2024-29పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఉద్యోగ కల్పన, ఐటీ రంగానికి సదుపాయాలు, రాయితీలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాజధాని అమరావతితో పాటు

మిగతా 13వ పేజీలో...



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు సవిత, దుర్గేష్, గొట్టిపాటి రవి, డోలా తదితరులు

అధికార దుర్వినియోగం

రాజ్యాంగ ఉల్లంఘనే

వారిని శిక్షించకపోతే సమాజానికే ఇబ్బంది

గత ఐదేళ్లలో ప్రాథమిక హక్కులను కాలరాశారు: సీఎం

మా ప్రభుత్వం రాకతో ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవం

రాజ్యాంగాన్ని కాలరాయాలని చూస్తే సరిచేసే శక్తి ఓటర్లకే ఉంది

వందేళ్ల వేడుక నాటికి తెలుగు వారిదే అగ్రస్థానం

రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

స్మార్ట్ వర్క్ చేయండి

సాయంత్రం 6 తర్వాత ఆఫీస్‌లో ఉండొద్దు

సచివాలయ ఉద్యోగులతో చంద్రబాబు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'అధికార దుర్వినియోగం రాజ్యాంగ ఉల్లంఘనే. వారిని శిక్షించకపోతే సమాజానికే ఇబ్బంది. గత ఐదేళ్లు రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. ప్రాథమిక హక్కులను కాలరాశారు. అరాచక శక్తులు అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే... ప్రజలు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ద్వారా బుద్ధి చెబుతారు. మా ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవం వచ్చింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతి సచివాలయంలో మంగళవారం రాజ్యాంగ వజ్రోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత, బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. 'సాంఘిక, ఆర్థిక, రాజకీయ,

మిగతా 13వ పేజీలో...



ప్రమాణం చేయగానే..

వాటి పని పడతా!

కెనడా, మెక్సికోలపై 25% సుంకం విధిస్తా.. చైనా మీద 10%

ఈ దేశాల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వలసలు, డ్రగ్స్, నేరస్థులు

తీరు మార్చుకునే దాకా సుంకం పోటు తప్పదు: డొనాల్డ్ ట్రంప్

భారత్‌కు వాణిజ్యపరంగా లబ్ధి!.. చైనాకు దీటుగా ఎదిగే చాన్స్

2

దేవేంద్ర ఫడణవీసే

మహా సీఎం!



అధికారిక ప్రకటనకు మరో 3 రోజులు?

ముఖ్యమంత్రి పదవికి శిందే రాజీనామా

ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలన్న గవర్నర్

శిందేకు కేంద్ర మంత్రి పదవి ఆఫర్!



9

పుష్ప 2కు అల్లు అర్జున్ పారితోషికం 300 కోట్లు!

గెలిస్తే ఓకే కానీ.. ఓడితే..



ట్యాంపరింగా?

మీకింత తెలివైన ఆలోచనలు ఎలా వస్తాయి?

కేఏ పాల్‌పై సుప్రీం వ్యాఖ్యలు.. ఈవీఎంల ట్యాంపరింగ్ పిటిషన్ కొట్టివేత

ఈవీఎంలు మాకొద్దు.. బ్యాలెట్లే కావాలి: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

2

ఫెంగల్ తుఫాన్?

నేడు రూపు మారనున్న తీవ్ర వాయుగుండం!

నేటి నుంచి ఒకటో తేదీ వరకు భారీ వర్షాలు

9

నేడు మెగా డీఎస్సీ సిలబస్ విడుదల

12

సినీ గీత రచయిత

కులశేఖర్ కన్నుమూత



9

రోడ్డు మీద కుప్పకూలిన కులశేఖర్

గుర్తు తెలియని వ్యక్తిగా గాంధీలో చేర్చిన పోలీసులు.. గుర్తుపట్టిన ఓ నర్సు

సినీ గేయ రచయితగా అద్భుత విజయాలు చూసిన కులశేఖర్

2013 తరువాత తలకిందులైన జీవితం

మానసిక సమస్యలు, కుంగుబాటు, జైలు జీవితం, కుటుంబానికీ దూరం..



14

చెవిరెడ్డిపై పోక్సో కేసు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా

త్వరలోనే అరెస్టు చేసే అవకాశం

మైనర్‌పై అత్యాచారమంటూ దుష్ప్రచారం చేశారని బాలిక తండ్రి ఫిర్యాదు

మాజీ ఎమ్మెల్యేను ఏ-2గా చేర్చిన పోలీసులు

రోజా, ఎంపీ గురుమూర్తి, భూమన, అభినయ్‌రెడ్డిపైనా ఎఫ్ఐఆర్‌కు చాన్స్?

మిట్టల్ ఉక్కుకు ఓకే!

నక్కపల్లి వద్ద పట్టాలెక్కనున్న ఆర్సెలర్-నిప్పన్ ప్లాంట్

1,47,162 కోట్ల పెట్టుబడి.. 2 దశల్లో ప్రాజెక్టు

2029 జనవరి నాటికి మొదటి దశ

2033కల్లా రెండో దశ పూర్తి

61 వేల మందికి ఉపాధి అవకాశాలు

ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్‌ల కోసం 6,756 ఎకరాల భూమికి అభ్యర్థన

బల్క్‌డ్రగ్ పార్క్ పరిధిలోని 700 ఎకరాల బదలాయింపునకు ప్రభుత్వ అంగీకారం

మిగిలిన భూముల సేకరణకు ఏపీఐఐసీకి అనుమతి

కొత్త ప్లాంట్‌కు నూతన పారిశ్రామిక పాలసీ కింద ప్రోత్సాహకాలు, సౌకర్యాలు



అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సిగలో మరో కలికితురాయి. విశాఖ నగరానికి సమీపాన అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా కలిసి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద భారీ పెట్టుబడితో తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక అభివృద్ధి విధానం (4.0) ప్రకారం ఈ భారీ ప్రాజెక్టుకు అనుకూలమైన ప్రోత్సాహకాలు, నిర్దిష్ట సౌకర్యాలు కల్పించడంతోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో.. అనుకున్న సమయానికి దీనిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ

మిగతా 12వ పేజీలో...

పిల్లలకు సొంత వైద్యం



ఇష్టారీతిన యాంటీబయాటిక్స్ ఇస్తున్న తల్లిదండ్రులు

ఫలితంగా చిన్నారుల్లో ప్రభావం చూపని మందులు

చిన్న చిన్న జబ్బులూ తగ్గక ఆస్పత్రులకు పరుగులు

60% ఈ తరహా కేసులే..


వేరే ఔషధాలు వాడాల్సిన దుస్థితి

మితిమీరిన యాంటీబయాటిక్స్‌తో ముప్పే: వైద్యులు

ఆ చిన్నారి వయసు నాలుగేళ్లు. జలుబు, దగ్గు వచ్చింది. ఇంటి పక్కనే ఉన్న ఔషధ దుకాణానికి వెళ్లి మందులు తెచ్చి వాడారు. 2 రోజుల్లో తగ్గింది. తర్వాత మరోసారి జ్వరం, జలుబు వచ్చింది. ఈ సారి యాంటీబయాటిక్స్ వాడినా తగ్గలేదు. దీంతో డాక్టర్ వద్దకు వెళ్లారు. పరిస్థితి గమనించి ఆ చిన్నారికి వేరే మందులు ఇవ్వాల్సి వచ్చింది.

మరో పాపకు వైరల్ జ్వరం వస్తే పిల్లల వైద్యుడికి చూపించి, మందులు వాడడంతో తగ్గింది. ఆర్నెల్ల తర్వాత మళ్లీ జ్వరం వస్తే.. గతంలో డాక్టర్ రాసిచ్చిన ఆ చీటీతోనే మందులను తెచ్చి వాడారు.కానీ, జ్వరం తగ్గలేదు. మళ్లీ వైద్యుడి దగ్గరకు పరుగులు పెట్టారు.

చిన్నారులకు ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడడం వల్ల ఎదురవుతున్న దుష్పరిణామాలపై ప్రత్యేక కథనం...14లో



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వారాహి డిక్లరేషన్, వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో ఎంపీలు బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

జల్‌జీవన్ మిషన్‌కు నిధులివ్వండి

సురక్షిత తాగునీటికి సహకరించండి

ఏఐబీపీ ప్రాజెక్టుల గడువు పెంచండి

రీయింబర్స్‌మెంట్ కాదు.. రాష్ట్రానికి ముందస్తు నిధులు ఇచ్చేలా చూడండి

కరువు జిల్లాల్లో ఉపాధి నిధులు పెంచాలి

కొత్త పనులు చేపట్టేందుకు చాన్సివ్వండి

'పిఠాపురం'లో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

పర్యాటక ప్రాజెక్టులకు ఊతమివ్వండి

కేంద్ర మంత్రులకు పవన్ వినతులు

ఢిల్లీలో డిప్యూటీ సీఎం సుడిగాలి పర్యటన

అమరావతి/న్యూఢిల్లీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలను వారితో ప్రస్తావించి.. ఆయా సమస్యల పరిష్కారానికి సహకరించాలని విన్నవించారు. నిధులు, పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి, ఉపాధి హామీ పనులు, రాష్ట్రంలో 'జాతీయ పర్యాటక యూనివర్సిటీ' ఏర్పాటు సహా అనేక అంశాలను ప్రస్తావించారు. తొలుత కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. 2019-2024 మధ్య అందించిన కనెక్షన్లలో కొళాయిల సామర్థ్యం, నీటి నాణ్యత అంశంలో సమస్యలు గుర్తించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రకారం 29.79 లక్షల

మిగతా 12వ పేజీలో...

ఏపీలో 3 రాజ్యసభ స్థానాలకు

20న ఉప ఎన్నిక

మోపిదేవి, బీద, కృష్ణయ్య రాజీనామాలతో 3 సీట్లు ఖాళీ.. ఇవన్నీ కూటమి ఖాతాలోకే

రెండు టీడీపీకి.. ఒకటి బీజేపీకి!!

2

ఏపీలో 3 రాజ్యసభ స్థానాలకు 20న ఉప ఎన్నిక

- మోపిదేవి, బీద, కృష్ణయ్య రాజీనామాలతో ఏపీలో 3 సీట్లు ఖాళీ
- ఇవన్నీ కూటమి ఖాతాలోకే.. రెండు టీడీపీకి.. ఒకటి బీజేపీకి!!

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో మూడు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎంపీల రాజీనామాలతో ఖాళీ అయిన ఆరు స్థానాల ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. ఉప ఎన్నికలకు వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11న వాటిని పరిశీలిస్తారు. ఉపసంహరించుకోవడానికి 13వ తేదీ వరకు గడువు ఉంటుంది. పోటీ అనివార్యమైతే ఆయా స్థానాలకు వచ్చే నెల 20న పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు పోలైన ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ఆ పార్టీ ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. పశ్చిమబెంగాల్, ఒడిశా, హరియాణా రాష్ట్రాల్లో తలో స్థానంలో ఉప ఎన్నిక జరుగనుంది. పశ్చిమ బెంగాల్లో కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ రాజీనామా చేశారు. బీజేడీ ఎంపీ సుజీత్‌కుమార్ రాజీనామాతో ఒడిశాలో ఒక స్థానం ఖాళీ అయింది. హరియాణా అసెంబ్లీకి ఎన్నికైన బీజేపీ ఎంపీ క్రిషన్‌లాల్ పన్వర్ రాజ్యసభ సభ్యత్వం వదులుకున్నారు. ఆంధ్ర అసెంబ్లీలో టీడీపీ కూటమికి సంపూర్ణ మెజారిటీ ఉన్న నేపథ్యంలో మూడు స్థానాలూ దాని ఖాతాలో పడనున్నాయి.

రాజ్యసభ ఎంపికలపై కూటమి ఒప్పందం!

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఉప ఎన్నిక జరిగే మూడు రాజ్యసభ సీట్లలో రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి దక్కనున్నాయి. వైసీపీకి, రాజ్యసభకు రాజీనామా చేసిన వారిలో మోపిదేవికి 2026 జూన్ వరకు, బీద మస్తాన్‌రావు, కృష్ణయ్యలకు 2028 జూన్ వరకూ పదవీ కాలం ఉంది. కానీ ఈ ముగ్గురూ తమ సభ్యత్వాలకు ముందే రాజీనామా చేశారు. మోపిదేవి, బీద టీడీపీలో చేరగా.. కృష్ణయ్య బీజేపీలో చేరతానని ప్రకటించారు. ఇప్పుడు భర్తీ కాబోతున్న సీట్లు కూడా ఇదే తరహాలో రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి ఇచ్చేలా కూటమి పార్టీల్లో అంతర్గత ఒప్పందం కుదిరినట్లు సమాచారం. వీరిలో మస్తాన్‌రావును టీడీపీ తిరిగి రాజ్యసభకు పంపనుంది. మోపిదేవి స్థానంలో మరొకరికి అవకాశం ఇవ్వనుంది. ఈ సీటు కోసం మాజీ ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, గల్లా జయదేవ్, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి (కడప), కాకినాడ జిల్లాకు చెందిన పార్టీ నేత సానా సతీశ్ తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కృష్ణయ్య స్థానంలో బీజేపీ ఒక కేంద్ర మంత్రిని నిలుపనున్నట్లు సమాచారం. దీనికి బదులుగా తనకు బీసీ కమిషన్ జాతీయ చైర్మన్ పదవి కావాలని కృష్ణయ్య కోరినట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీలో వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలే ఉండడంతో ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగానే ఎన్నిక కానున్నారు.

29న సీడబ్ల్యూసీ భేటీ.. మహా వైఫల్యంపై సమీక్ష!

న్యూఢిల్లీ, నవంబరు 26 : కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) శుక్రవారం(29వ తేదీ) సమావేశం కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైఫల్యంపై సమీక్షించనున్నారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ఉపఎన్నికల్లో పార్టీ ప్రభావం చూపకపోవడంపై కూడా చర్చించనున్నారు. వీటితోపాటు ఢిల్లీ, బిహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయాలనే అంశంపై కూడా చర్చించనున్నారు. అంతేకాక, మహారాష్ట్రలో ఇండియా కూటమి వైఫల్యానికి ఈవీఎంలే కారణమనే ఆరోపణల నేపథ్యంలో.. ఈవీఎం యంత్రాల వినియోగంపై కూడా సీడబ్ల్యూసీలో చర్చించే అవకాశముందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ముస్లింలకు ఓటు హక్కు లేకుండా చేయాలి!

- ఒక్కలిగ స్వామీజీ చంద్రశేఖర వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఓటు హక్కు లేకుండా చేయాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థానం మఠాధిపతి చంద్రశేఖర స్వామీజీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రైతుల భూములకు వక్ఫ్ బోర్డు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ భారతీయ కిసాన్ సంఘం కర్ణాటక విభాగం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో మంగళవారం ఏర్పాటు చేసిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశంలో వక్ఫ్ బోర్డును లేకుండా చేస్తే భారతీయులంతా ప్రశాంతంగా ఉండడం సాధ్యమన్నారు. ఒకరి భూమిని మరొకరు లాక్కోవడం ధర్మం కాదన్నారు. ప్రభుత్వం పతనమైనా ఫర్వాలేదుగానీ వక్ఫ్‌బోర్డు రద్దు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇస్కాన్ నేత కృష్ణదాస్‌కు బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ/ఢాకా, నవంబరు 26: దేశ ద్రోహం ఆరోపణలపై అరెస్టయిన బంగ్లాదేశ్ ఇస్కాన్ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారి (కృష్ణ దాస్ ప్రభు)కు మంగళవారం స్థానిక కోర్టు బెయిల్ నిరాకరించింది. దీనిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులు, ఇతర మైనారిటీలను రక్షించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కృష్ణదాస్‌కు ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ అండగా నిలిచారు. బాధితుల పక్షాన నిలబడిన వారిని లక్ష్యంగా చేసుకోవడం ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. అంతకుముందు కృష్ణదాస్ ప్రభుకు చట్టోగ్రాంలోని మేజిస్ట్రేటు కోర్టు బెయిల్ నిరాకరించింది. పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ జరగాల్సి ఉన్న దృష్ట్యా ఆయనను జైలులోనే ఉంచాలని ఆదేశించింది.

అదానీపై కేసు ఉండకపోవచ్చు: రవి బాత్రా

న్యూయార్క్, నవంబరు 26: గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన 'లంచం' కేసు నిలబడకపోవచ్చని ప్రముఖ భారతీయ అమెరికన్ న్యాయవాది రవి బాత్రా అన్నారు. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు దాదాపు రూ.2029 కోట్ల లంచాలు ఇవ్వజూపారంటూ అదానీపై అమెరికా ప్రాసిక్యూటర్లు, ఎస్ఈసీ నేరారోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయనపై చేసిన ఆరోపణలు 'అయోగ్యమైన లేదా లోపభూయిష్టమైనవి'గా తేలితే ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేసును ఉపసంహరించుకునే అవకాశం ఉందని రవి బాత్రా అన్నారు. ఇక ఈ లంచం కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న గౌతమ్ అదానీ, సాగర్ అదానీ తదితరులు అమెరికాలో నివసించడం లేదని గుర్తుచేశారు. 'అమెరికా చట్టాలను ఇతర దేశాల్లో ఎలా అమలు చేయాలన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమైంది' అని బాత్రా పేర్కొన్నారు.

వచ్చే ఏడాది మొదట్లో ముంబైలో హలాల్ కార్నివాల్

ముంబై, నవంబరు 26: డేటింగ్ అంటేనే అమ్మాయి, అబ్బాయి ఏకాంతంగా గడిపే సమయం! సన్నిహితంగా ఉంటూ ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు ఓ అవకాశం! మరి.. తాను ఇష్టపడే వ్యక్తితో అమ్మాయి డేటింగ్‌కు వెళ్లాలంటే ఆమె తల్లో, తండ్రో లేదంటే సోదరుడో తోడుగా ఉండటం గురించి తెలుసా? ఇది హలాల్ ముస్లిం డేటింగ్! వచ్చే ఫిబ్రవరి 21-23 మధ్య ముంబైలోని అంధేరీలో 'హలాల్ కార్నివాల్' నిర్వహించనున్నారు.

ప్రైవేటు విద్యుదుత్పత్తి సామర్థ్యం పెంపునకు ఓకే!

- ఎకోరెన్‌కు అదనంగా 277 మెగావాట్లు
- గ్రీన్‌కోకు 500 మెగావాట్లు.. అస్త్రా గ్రీన్‌కు మరో 186 ఎకరాలు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధనోత్పత్తి సంస్థలు అదనపు సామర్థ్యాలు పెంచుకోవడానికి ఇంధన శాఖ ఆమోదం తెలిపింది. ఎకోరెన్ ఎనర్జీ సంస్థ అనంతపురం జిల్లా రాళ్ల అనంతపురంలో 250 మెగావాట్లు, కర్నూలు జిల్లా బేతంచర్లలో 118.80 మెగావాట్లు, అనంతపురం జిల్లా కురుబరహళ్లిలో 150 మెగావాట్లు, కర్నూలు జిల్లా చిన్నకొలుమలపల్లిలో 251.20 మెగావాట్లు, మెట్టుపల్లి ఆర్ఎఫ్‌లో 100 మెగావాట్లు, జలదుర్గం ఆర్ఎఫ్‌లో 130 మెగావాట్లు.. మొత్తం 1,000 మెగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఇదివరకే ఆమోదించింది. అయితే ఆయా ప్రాంతాల్లో తమకు కేటాయించిన భూముల్లోనే మరో 277 మెగావాట్లు అదనంగా ఉత్పత్తి చేసేందుకు అనుమతి కోరుతూ ఆ సంస్థ దరఖాస్తు చేసింది. దీనిని ఆమోదిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ జయానంద్ మంగళవారం ఉత్తర్వు జారీచేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రీన్‌కో సోలార్‌కు 800 మెగావాట్ల నుంచి 1,300 మెగావాట్లకు సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆమోదం తెలిపారు. వీటికితోడు కడప జిల్లా వీరబల్లి మండలంలో 1,800 మెగావాట్ల సామర్థ్యంతో వీరబల్లి ఆఫ్‌షోర్ లూప్ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు స్థాపన కోసం ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్‌కు అదనంగా 186 ఎకరాలు కేటాయించేందుకు అంగీకరించారు.

దేశమే ముందు!

ఆ భావనే రాజ్యాంగ స్ఫూర్తిని సజీవంగా ఉంచుతుంది: మోదీ

- సుప్రీం కోర్టులో ఘనంగా రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకలు
- దేశ పరివర్తనలో రాజ్యాంగం దోహదం: సీజేఐ జస్టిస్ ఖన్నా



సుప్రీంకోర్టులో రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకల్లో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 26: 'దేశమే ముందు' అనే భావన మన రాజ్యాంగ స్ఫూర్తిని శతాబ్దాల తరబడి సజీవంగా ఉంచుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మంగళవారం సుప్రీంకోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. పౌరులందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగానికి, రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులకూ గౌరవంగా తలవంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్గదర్శక జ్యోతిగా ప్రధాని అభివర్ణించారు. దేశ ప్రతి అవసరాన్ని, ఆకాంక్షను రాజ్యాంగం నెరవేర్చిందన్నారు. ముంబై ఉగ్రదాడి(26/11)లో ప్రాణాలు కోల్పోయిన వారికీ ఈ సందర్భంగా ప్రధాని నివాళులర్పించారు. బీజేపీ పాలనలో ఉగ్రవాదంపై పోరులో భారత నిబద్ధతను మోదీ తెలియజేశారు. 'భారత భద్రతను సవాలు చేస్తున్న ఏ ఉగ్రవాద సంస్థ అయినా తగిన మూల్యం చెల్లించుకుంటుందనే దేశ దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తున్నాను' అన్నారు. జమ్మూకశ్మీర్‌లోనూ ఇప్పుడు రాజ్యాంగం పూర్తిగా అమలవుతోందని, తొలిసారిగా అక్కడ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మోదీ చెప్పారు. ఎమర్జెన్సీ సహా గత 75 ఏళ్లలో అనేక సవాళ్లను రాజ్యాంగం ఎదుర్కొందని వివరించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. రాజ్యాంగం ఒరిజినల్ కాపీలో సీతారాముల చిత్రాలున్నాయని, ఆ చిత్రాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని, అవి మనకు మానవీయ విలువలను గుర్తుచేస్తుంటాయని మోదీ చెప్పారు. ఆ విలువలే నేటి భారత విధానాలు, నిర్ణయాలకు పునాది అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ భారతదేశం బలమైన ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందడంలో రాజ్యాంగం దోహదపడిందని చెప్పారు. దేశ విభజన అనంతర భయానక పరిస్థితులు, నిరక్షరాస్యత, పేదరికం నుంచి పరివర్తనాత్మక ప్రయాణంతో నేడు ఆత్మనిర్భరత కలిగిన దేశంగా భారత్ మారిందన్నారు. అనంతరం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబ్బల్ తదితరులు ప్రసంగించారు.

మోదీ.. రాజ్యాంగం చదవలేదు!

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ.. రాజ్యాంగాన్ని చదవలేదని కచ్చితంగా చెప్పగలనని, ఒకవేళ చదివి ఉంటే రోజూ ఇలా ప్రవర్తించేవారు కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'హింసను ప్రేరేపించాలని.. ప్రజలను చంపాలని.. అబద్ధాలు చెప్పి ప్రభుత్వాన్ని నడిపించాలని రాజ్యాంగంలో ఎక్కడైనా రాశారా..?' అని రాహుల్ ప్రశ్నించారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని.. ఇది సత్యం, అహింసతో ముడిపడిన మహోన్నత గ్రంథమని చెప్పారు. కాగా, పార్లమెంటు లో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాహుల్‌గాంధీ అవమానించారని బీజేపీ ఆరోపించింది. 'రాహుల్ ఎంత అహంకారి అంటే.. రాష్ట్రపతిని చూసి కనీసం నమస్కరించలేదు. ఆమె గిరిజన వర్గానికి చెందడం.. అందునా మహిళ కావడం.. తాను మాత్రం యువరాజునని అనుకోవడం వల్లే ఇలా చేశారా? ఎంత చౌకబారు మనస్తత్వం' అని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ ధ్వజమెత్తారు. మంగళవారం ఆ వేడుకల తాలూకు రెండు వీడియో క్లిప్పింగ్‌లను ఆయన 'ఎక్స్'లో పోస్టుచేశారు.



ప్రజలకు మెరుగైన జీవితం.. మన బాధ్యత

రాజ్యాంగ దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, నవంబరు 26: రాజ్యాంగ స్ఫూర్తితో సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు కలిసి పనిచేయడం కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల బాధ్యత అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఈ మూడు వ్యవస్థలతోపాటు పౌరులందరి క్రియాశీల భాగస్వామ్యంతో రాజ్యాంగ ఆదర్శాలు బలోపేతమవుతాయన్నారు. గత కొన్నేళ్లుగా పార్లమెంటు చేసిన అనేక చట్టాల్లో ప్రజల ఆకాంక్షలు ప్రస్ఫుటమయ్యాయని, సమాజంలోని అన్ని వర్గాలు.. ప్రత్యేకించి బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కూడా అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. పౌరులంతా తమ భావాల్లో రాజ్యాంగ ఆదర్శాలను కలిగి ఉండాలని, ప్రాథమిక విధులను పాటించాలని, 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణం లక్ష్యం దిశగా అంకితభావంతో ముందుకు కదలాలని ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ దేశం కంటే తమ మతవిశ్వాసాలకే రాజకీయ పార్టీలు అధిక ప్రాధాన్యం ఇస్తే మన స్వాతంత్ర్యం రెండోసారి ప్రమాదంలో పడుతుందని అంబేడ్కర్ చెప్పినట్లు గుర్తుచేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ రాజ్యాంగ అసెంబ్లీ నిర్దేశించిన సంప్రదాయం మేరకు నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చలను పార్లమెంటు సభ్యులు కొనసాగించాలని కోరారు. 'దేశమే ముందు' అనే స్ఫూర్తిని పెంపొందించేలా ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు.

రాజ్యాంగ వజ్రోత్సవం



ఎనిమిది షెడ్యూళ్లు.. 22 అధ్యాయాలు.. 395 అధికరణలతో రూపొందించిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజు.. 1949, నవంబరు 26! ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ప్రఖ్యాతిగాంచిన మన రాజ్యాంగం ఆమోదం పొంది.. 75 సంవత్సరాలైన సందర్భంగా రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలు..

- 1934లో తొలిసారి మానవేంద్రనాథ్ రాయ్ రాజ్యాంగ సభ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. 1935 నుంచి అది కాంగ్రెస్ అధికారిక డిమాండ్‌గా మారింది.
- భారత రాజ్యాంగ రచనకు పట్టిన సమయం.. రెండు సంవత్సరాల పదకొండు నెలల పద్దెనిమిది రోజులు.
- రాజ్యాంగ రచన పూర్తైన తర్వాత.. దాన్ని మిగతా దేశాల రాజ్యాంగాల్లాగా ప్రచురించలేదు. క్యాలిగ్రఫీలో మాస్టర్‌గా పేరొందిన ప్రేమ్ బిహారీ నారాయణ్ రాయ్‌జాదా హిందీ, ఇంగ్లిష్ భాషల్లో చేతితో రాశారు. ఆ రాజ్యాంగ తొలి ప్రతులను పార్లమెంటు హౌస్‌లోని లైబ్రరీలో హీలియం పెట్టెల్లో భద్రపరిచారు.
- ప్రస్తుతం మన రాజ్యాంగంలో 25 అధ్యాయాలు, 448 అధికరణలు, 12 షెడ్యూళ్లు ఉన్నాయి.
- రాజ్యాంగం అమల్లోకి వచ్చిన దాదాపు ఏడాదిన్నర తర్వాత.. 1951 జూన్ 18న తొలి సవరణ జరిగింది. చివరిదైన 106వ సవరణ.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించింది. దీన్ని గత ఏడాది డిసెంబరులో ఆమోదించారు.
- రాజ్యాంగ రూపకల్పనలో.. దాక్షాయణి అనే దళిత మహిళ, తెలుగింటి కోడలు సరోజినీనాయుడు సహా 15 మంది మహిళలు రాజ్యాంగ సభ సభ్యులుగా కీలకపాత్ర పోషించారు.

106

ఏడున్నర దశాబ్దాల కాలంలో జరిగిన రాజ్యాంగ సవరణల సంఖ్య.

1,46,000

ప్రపంచంలోనే అతి పెద్దదైన మన రాజ్యాంగంలో ఉన్న పదాల సంఖ్య.. దాదాపుగా 1,46,000

రూ.64 లక్షలు

రాజ్యాంగ రచనకు అయిన ఖర్చు.. ఆరోజుల్లోనే అక్షరాలా అరవై నాలుగు లక్షల రూపాయలు!!

ఫడణవీసే కొత్త సీఎం!

- ప్రకటనకు మరో 3 రోజులు?
- సీఎం పదవికి శిందే రాజీనామా
- ఆపద్ధర్మ సీఎంగా కొనసాగింపు



న్యూఢిల్లీ, ముంబై, నవంబరు26: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ శిందే రాజీనామా చేశారు. తన రాజీనామాను గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు సమర్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని శిందేకు గవర్నర్ సూచించారు. మహారాష్ట్ర కొత్త సీఎంగా దేవేంద్ర ఫడణవీస్‌ను బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసే అవకాశం ఉంది. హోం మంత్రిత్వ శాఖ కూడా ఆయన పరిధిలోనే ఉంటుందని తెలిసింది. రెండున్నరేళ్ల ఫార్ములా ఉండదని, ఐదేళ్లు ఫడణవీస్ సీఎంగా కొనసాగుతారని పార్టీ వర్గాల సమాచారం. ఈ విషయంలో పూర్తి స్థాయి స్పష్టత రానప్పటికీ అధికారిక ప్రకటనకు మరో రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫడణవీస్‌ను సీఎం చేస్తే ఏక్‌నాథ్ శిందేను డిప్యూటీ సీఎం చేస్తారని ప్రచారంలో ఉంది. దీనికి తోడు కీలకమైన పట్టణాభివృద్ధి శాఖ కూడా ఇస్తారని తెలిసింది. అయితే ఆయన డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించకపోతే కేంద్ర మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. శిందే కేంద్ర మంత్రి పదవికి ఒప్పుకున్నా డిప్యూటీ సీఎం పదవి శివసేనకు ఇస్తామని బీజేపీ అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు తెలిసింది. శివసేన నుంచి ఉదయ్ సామంత్, శంభురాజే దేశాయ్, దీపక్ కెసార్కర్‌లలో ఒకరిని డిప్యూటీ సీఎంగా ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. శిందే డిప్యూటీ సీఎం పదవిని లేదా కేంద్ర మంత్రి పదవిని తీసుకోవాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే సలహా ఇచ్చారు. మరోవైపు, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా కొనసాగుతారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఆర్థిక శాఖ సహా కీలకమైన పది శాఖలు ఎన్సీపీకి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

మోదీకి సొరేన్ ఆహ్వానం

ఝార్ఖండ్ ఆపద్ధర్మ సీఎం హేమంత్ సొరేన్ మంగళవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. గురువారం రాంచీలో జరగనున్న 'అబువ సర్కార్ (మన ప్రభుత్వం) ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట సతీమణి కల్పన సొరేన్ కూడా ఉన్నారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, వామపక్షాలు, ఆర్జేడీతో ఏర్పడిన కూటమి ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఈ కూటమి అధికారాన్ని చేపట్టనుంది. ఇండియా కూటమి సొరేన్‌ను నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన మళ్లీ సీఎంగా ప్రమాణం చేయనున్నారు.

గెలిస్తే ఓకే... లేకుంటే ట్యాంపరింగా?

- కేఏ పాల్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు
- ఈవీఎంల ట్యాంపరింగ్‌పై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 26: 'మీకు పిల్స్ వేయడం అంటే ఆసక్తి ఎక్కువ. ఇలాంటి తెలివైన ఆలోచనలు మీకెలా వస్తాయి?' అంటూ కేఏ పాల్‌ను ఉద్దేశించి సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. మీరు పనిచేసేది వేరే రంగం కదా.. ఎందుకు రాజకీయ క్షేత్రంలోకి వస్తున్నారు? అంటూ ప్రశ్నించింది. ఎన్నికల్లో మీరు గెలిస్తే ఈవీఎంలు సక్రమంగా పనిచేసినట్లు. అదే మీరు ఓడిపోతే ఈవీఎంలు ట్యాంపర్ అయినట్టా? ఇదేం తీరంటూ మండిపడింది. ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరిగేలా చూడాలంటూ కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలే ధర్మాసనం కొట్టివేసింది. ఈవీఎంలను ట్యాంపర్ చేయవచ్చని టెక్ దిగ్గజం మస్క్ కూడా చెప్పారని, అలాగే, ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ కూడా ఈవీఎంలు ట్యాంపరింగ్‌పై ఆరోపణలు చేశారని విచారణ సందర్భంగా కేఏ పాల్ వాదించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఓడిపోయినప్పుడు ఈవీఎంలు ట్యాంపర్ అయ్యాయని చంద్రబాబు, జగన్ చెబుతారు. గెలిచినపుడు ఏమీ మాట్లాడరు. ఇవన్నీ వాదించడానికి ఇది తగిన స్థలం కాదు అంటూ వ్యాఖ్యానించింది. చాలా దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ వినియోగిస్తున్నారని పాల్ వాదిస్తే.. మిగిలిన ప్రపంచానికి భిన్నంగా ఉండాలని మీరెందుకు కోరుకోరు అంటూ ధర్మాసనం ప్రశ్నించింది.

ఆర్మీలో మహిళా అధికారులకు అహం

- వారు చెప్పిందే వినాలనే ధోరణి ఎక్కువ
- ఉన్నతాధికారికి లెఫ్టినెంట్ జనరల్ లేఖ

న్యూఢిల్లీ, నవంబరు 26: ఆర్మీలో కమాండింగ్ అధికారులుగా పనిచేస్తున్న 8 మంది మహిళా కల్నల్‌లకు అహం ఎక్కువ అని.. తమ మాటే వినాలనే ధోరణిని ప్రదర్శిస్తారని, ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోరంటూ ఓ లెఫ్టినెంట్ జనరల్ తన ఉన్నతాధికారులకు రాసిన లేఖ ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఓ అధికారి తన కింద ఉండే యూనిట్ల గురించి కాకుండా.. ప్రత్యేకించి 'మహిళా కమాండింగ్ అధికారులు' అంటూ నివేదికనివ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఆర్మీలో మహిళలకు కమాండింగ్ అధికారి హోదా ఇచ్చేవారు కాదు. దీనిపై 2020లోనే సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. లింగవివక్ష తగదని హితవుపలికింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఏకంగా 108 మంది మహిళాసిబ్బందికి కల్నల్‌గా పదోన్నతి కల్పించాలని ఆదేశించింది. కల్నల్‌గా పదోన్నతి పొందిన మహిళాసిబ్బందిలో ఎనిమిది మంది 17 మౌంటైన్ స్ట్రైక్ కార్ప్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. గతనెల ఈ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌పురి తన ఉన్నతాధికారి– ఈస్టర్న్ కమాండ్‌కు చెందిన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ రామ్‌చందర్ తివారీకి ఓ లేఖ రాశారు. మహిళా కల్నల్‌ల మధ్య నియంత్రణలేని పిచ్చిపిచ్చి ఈగో సమస్యలు ఉన్నాయని తెలిపారు. "మహిళా కల్నల్‌ల తీరుతో.. వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలపై దుష్ప్రభావాలు కనిపించే ప్రమాదాలున్నాయి" అని ఆ లేఖలో వివరించారు. దీంతో, ఆర్మీలో లింగ వివక్షపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

ప్రమాణం చేయగానే.. వాటి పని పడతా!


కెనడా, మెక్సికోలపై 25% సుంకం విధిస్తా.. చైనా మీద 10%

- ట్రంప్ హెచ్చరిక.. జనవరి 20న ఆదేశాలు జారీ చేస్తానని వెల్లడి



వాషింగ్టన్, నవంబరు 26: కెనడా, మెక్సికోల నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే అన్ని రకాల ఉత్పత్తులపైనా 25% సుంకం విధిస్తామని, చైనా ఉత్పత్తులపై 10% విధిస్తామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ మంగళవారం ప్రకటించారు. జనవరి 20న తాను అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన వెంటనే తీసుకునే మొట్టమొదటి చర్యల్లో ఇదొకటని, ఈ మేరకు ఆ రోజున కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. 'ఓపెన్ బోర్డర్' విధానం కారణంగా కెనడా, మెక్సికోల నుంచి వేలాదిమంది జనం అమెరికాలోకి వస్తున్నారని, వారు తమ వెంట డ్రగ్స్‌ను తీసుకొస్తున్నారని, వారిలో అనేక మంది నేరస్థులు ఉంటున్నారని ట్రంప్ పేర్కొన్నారు. 'వారిని నియంత్రించి అమెరికాలోకి రాకుండా ఆయా దేశాల ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అప్పటి వరకూ ఆ దేశాలు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. దీంట్లో భాగంగానే, వాటి ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తాం' అని చెప్పారు. ఇక చైనా నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున డ్రగ్స్ వస్తున్నాయని, వాటిలో ఫెంటనిల్ ముఖ్యమైనదని.. మెక్సికో ద్వారా ఈ డ్రగ్స్ అమెరికాలోకి వస్తున్నాయని చెప్పారు. తన తొలి పర్యాయంలో.. ఈ సమస్యను పరిష్కరించాలని చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. చైనా ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ అవి ఆచరణ రూపం దాల్చలేదన్నారు. అందువల్లే, ఆ దేశ ఉత్పత్తులపై 10%అదనపు సుంకం విధిస్తామన్నారు. 2022లో అమెరికా 53,600 కోట్ల డాలర్ల విలువైన (రూ.45,17,530 కోట్లు) ఉత్పత్తులను చైనా నుంచి దిగుమతి చేసుకుంది. ఇవి ఆ ఏడాది అమెరికా దిగుమతుల్లో 16 శాతం. ఇప్పుడు, చైనా మీద ట్రంప్ 10 శాతం అదనపు సుంకం విధించటం వల్ల.. అది భారత్‌కు లబ్ధి కలిగించే పరిణామం అవుతుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ అనే మేధోసంస్థ డైరెక్టర్ నీలాంజన్ ఘోష్ మాట్లాడుతూ, అధిక సుంకాల వల్ల నష్టపోయే పలు కార్పొరేట్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను, ఆఫీసులను భారత్, వియత్నాం, ఇండొనేషియా, దక్షిణ కొరియా వంటి దేశాలకు తరలించే అవకాశం ఉందని తెలిపారు. జనాభాలో అధికశాతం యువత ఉన్న భారత్‌కు మిగిలిన దేశాలకన్నా ఎక్కువ అనుకూలత ఉందని, దీనిని భారత్ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈవీఎంలు మాకొద్దు.. బ్యాలెట్లే కావాలి: ఖర్గే



న్యూఢిల్లీ, నవంబరు 26: ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లతోనే పోలింగ్ జరపాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలకు భిన్నంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి ఘన విజయం సాధించడం.. కాంగ్రెస్ కేవలం 16 స్థానాలకే పరిమితమైన నేపథ్యంలో ఆయనతో పాటు ఆ పార్టీ నేతలంతా ఇదే డిమాండ్ అందుకున్నారు. మంగళవారమిక్కడ ఆ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే ప్రసంగించారు. రాజ్యాంగ రచన ఆషామాషీగా జరుగలేదని.. దాని రూపకల్పనకు కాంగ్రెస్ ఎంతో శ్రమించిందని తెలిపారు. అంబేడ్కర్ ఈ విషయంలో కీలక భూమిక పోషించారని చెప్పారు. ప్రధాని మోదీ పవిత్ర రాజ్యాంగ గ్రంథానికి నమస్కరిస్తూనే దానిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. 'ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించారు' అని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా లేదన్నారు. మిత్రపక్షాలపై ఆధారపడి నడుస్తోందన్నారు. 'ఇది మైనారిటీ ప్రభుత్వం. టీడీపీ అధినేత, ఆంధ్ర సీఎం చంద్రబాబు కాలు.. బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ కాలు, ఈ రెండు కాళ్ల ఆసరాతో మోదీ నడుస్తున్నారు. ఎవరైనా ఇందులో ఒక కాలిని లాగేస్తే ఈ ప్రభుత్వం కుప్పకూలుతుంది' అని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్న రాహుల్ డిమాండ్‌ను ఖర్గే సమర్థించారు. కులగణనకు మోదీ భయపడుతున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ 'విభజన' నినాదాలు చేస్తోందని.. ప్రజలను చీల్చాలన్న దురుద్దేశం ఆ పార్టీకే ఉందని ధ్వజమెత్తారు. దేశంలో నిజంగా ఐక్యత కోరుకుంటే విద్వేష వ్యాప్తిని బీజేపీ ఆపాలని స్పష్టం చేశారు.

గిరిపుత్రులు.. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కొండలపై, అడవుల్లో జీవనం సాగిస్తుంటారు. వారి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మృగ్యం. ఇక వైద్య సదుపాయాల గురించి అయితే చెప్పనవసరం లేదు. అత్యవసరంగా వైద్యం అవసరమైతే.. నానా కష్టాలు పడి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని మరీ కొండలు, వాగులు, వంకలు దాటుకొని రావాల్సిన పరిస్థితి. ఇక గర్భిణుల విషయంలోనైతే 'డోలీ' మోతలు అనేవి సర్వసాధారణంగా కనిపిస్తుంటాయి. గిరిజనుల వైద్య కష్టాలకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం నిశ్చయించింది. డోలీ మోతలు ఉండకూడదని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ క్రమంలో మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గిరిజనులకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు 'గిరి ఆరోగ్య కేంద్రం' పేరిట కంటైనర్ ఆస్పత్రిని రూపకల్పన చేశారు. తొలుతగా సాలూరు మండలం కరడవలసలో ప్రారంభించారు.

గిరి శిఖరాన ఆస్పత్రి

మన్యం జిల్లాలోని కరడవలసలో తొలి కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటు

- గిరిజనుల వైద్య కష్టాలకు చెక్
- వారి చెంతకే పలు వైద్య సేవలు
- కూటమి ప్రభుత్వ వినూత్న నిర్ణయం
- 'డోలీ మోత'లు ఉండకూడదన్న సీఎం ఆదేశాలతో అధికారుల చర్యలు
- మరికొన్ని చోట్ల ఏర్పాటుకు సిద్ధం!


కరడవలసలో ఏర్పాటు చేసిన 'గిరి ఆరోగ్య కేంద్రం'

సాలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరి శిఖరాన ఉండే గిరిజనులు ఏ అనారోగ్యం వచ్చినా కొండ దిగాల్సిందే! ఇక గర్భిణులకు ఆకస్మికంగా పురిటి నొప్పులు వస్తే.. డోలిపై వేసుకొని, కొండ దిగి మైదాన ప్రాంతంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సిందే! గత ప్రభుత్వంలో వైద్య సేవలు కొండపైకి వరకూ రాకపోవడంతో గిరిజనులు వైద్యం కోసం కిందకు దిగాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డోలీ మోతలకు స్వస్తి పలకాలని సీఎం చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు స్పష్టంచేశారు. డోలీ మోతలు ఉండకూడదనే ఆదేశాలతో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గిరి శిఖర గ్రామాల గిరిజనులకు అందుబాటులో వైద్య సేవలు తెచ్చేందుకు 'గిరి ఆరోగ్య కేంద్రం' పేరిట ఒక కంటైనర్ ఆస్పత్రిని రూపకల్పన చేశారు. మన్యం జిల్లాలో ఈ కంటైనర్ ఆస్పత్రుల ఏర్పాటుకు వైద్య శాఖతో చర్చించారు. 15 చోట్ల వీటి ఏర్పాటుకు సమీక్షించారు. తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏవోబీలో సాలూరు మండలం కరడవలస పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. మంత్రి సంధ్యారాణి చేతులు మీదుగా సోమవారం(ఈనెల 25న) ప్రారంభించారు.

మరో నాలుగు చోట్ల ఏర్పాటు!

కరడవలస కంటైనర్ ఆస్పత్రి సమీప గిరిజన గ్రామాలకు చెందిన దాదాపు 2,000 మందికి అందుబాటులో ఉంటుంది. ఈ కేంద్రం పనితీరు పరిశీలించి జిల్లాలో మరో నాలుగు చోట్ల గిరి శిఖర గ్రామాల్లో కంటైనర్ ఆస్పత్రులను ఏర్పాటు చేయనున్నారు.

ఏ వైద్య సేవలు.. ఎలా అందిస్తారంటే?

కరడవలస గిరి ఆరోగ్య కేంద్రంలో వారానికి రెండు రోజులు తోణాం పీహెచ్‌సీ డాక్టర్ వచ్చి వైద్య సేవలు అందిస్తారు. మిగిలిన రోజుల్లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్), హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశా, సీహెచ్‌డబ్ల్యూ సేవలందిస్తారు. ఈ ఆస్పత్రిలో డాక్టర్ రూం, రోగులకు వైద్యం అందించేందుకు నాలుగు బెడ్‌లతో మరో రూం, టీవీ, బాల్కనీ ఉన్నాయి. ఈ ఆస్పత్రిలో మలేరియా, డెంగ్యూ, మధుమేహం, రక్తశాతం, హెపటైటిస్, హెచ్ఐవీ, నీటి తనిఖీ, క్షయ, హెచ్‌సీవీ, ఐవోడీన్, యూరిన్, హెచ్‌సీజీ, వీఐఏ, నేత్ర వంటి 14 రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు. టీకాలు కూడా వేస్తారు. దాదాపు 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. గర్భిణులకు వైద్య పరీక్షలు చేయనున్నారు. వారానికి రెండుసార్లు వైద్యాధికారి ఓపీ సేవలు అందించనున్నారు. నాలుగు బుధవారాల్లో 104 మొబైల్ మెడికల్ యూనిట్ వచ్చి సేవలందిస్తుంది. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వారానికి మూడు సార్లు ఇక్కడ ఓపీ సేవలు అందిస్తారు.


రోగులకు వైద్యం కోసం ఏర్పాటు చేసిన గది, బెడ్‌లు

ఇక ఆ కష్టాలు ఉండవు

గిరిజనులు ఇకపై వైద్యం కోసం డోలీ మోతలతో కొండ దిగాల్సిన అవసరం లేదు. మంత్రగాళ్లను ఆశ్రయించాల్సిన పనిలేదు. అందుబాటులో వైద్యం ఉండడం వారి ఆరోగ్యానికి రక్షగా ఉంటుంది.

- సీదరపు అప్పారావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

ఎంతో ప్రయోజనకరం

గిరి ఆరోగ్య కేంద్రం వల్ల గిరిజనులకు ఎంతో ప్రయోజనం. చిన్న అనారోగ్య సమస్యలకు మైదాన ప్రాంతానికి రావాల్సిన అవసరం తప్పుతుంది. గర్భిణులకు వివిధ పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తారు. పెద్ద ఆరోగ్య సమస్యలైతే మైదాన ప్రాంత ఆస్పత్రులకు రెఫర్ చేస్తాం.

- అక్కాన అజయ్, తోణాం పీహెచ్‌సీ వైద్యుడు


రోగులకు వైద్య పరీక్షలు చేసే గది

అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 2.10 గంటల సమయంలో ఓ వ్యక్తి హుండీలో చోరీకి పాల్పడ్డాడు. కానుకలు వేస్తున్నట్టు నటించి రూ.13,870 దొంగిలించి పారిపోయిన తమిళనాడుకు వేణువనలింగం అనే వ్యక్తిని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా గుర్తించి తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు.

తిరుమలలో మఠాల అద్దెల నియంత్రణపై ఉమ్మడి కమిటీ

తిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మఠాల నిర్వహణపై ఆరోపణలు పెరగడంతో, వీటిపై నియంత్రణ చర్యలకు టీటీడీ శ్రీకారం చుట్టింది. తిరుమలలో 34 మఠాలు ఉన్నాయి. వీటిలో విచ్చలవిడిగా అద్దెలు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో నియంత్రణకు తొమ్మిదిమంది సభ్యులతో ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రెవిన్యూ డీఈవో, హెల్త్ ఆఫీసర్, విజిలెన్స్ వింగ్, ఇంజనీరింగ్ అధికారులతో పాటు విఖానస ఆశ్రమం, మౌనస్వామి మఠం, వాసవి భవన్, రాఘవేంద్రస్వామి మఠం, అహోబిలం మఠం నుంచి ఒక్కో ప్రతినిధి ఉంటారు.

ద్వారకాతిరుమలలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

ద్వారకాతిరుమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే ఈ దుశ్చర్య చోటుచేసుకుంది. ద్వారకాతిరుమల పంచాయతీ పార్కులోకి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేయాలంటూ దళిత నేత మద్దాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘటనా స్థలం వద్ద ఆందోళన చేసి, తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.



జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం

సింహాచలం నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు


కోట్లకు పడగలెత్తిన సింహాచలం

- జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఇంట్లో ఏసీబీ సోదాలు
- పదుల సంఖ్యలో ఇళ్ల స్థలాలు.. విలువ రూ.25 కోట్లపైనే!
- అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలింపు

విశాఖపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) జోన్-2 కమిషనర్ పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండడంతో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. సింహాచలం గతంలో జీవీఎంసీ పరిధిలోని పలు జోన్లలో కమిషనర్‌గా పనిచేశారు. ఎన్నికల ముందు వేరొక జిల్లాకు బదిలీపై వెళ్లారు. రెండు నెలల కిందట తిరిగి జీవీఎంసీకి బదిలీపై వచ్చి జోన్-2 కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే సమాచారంతో విశాఖ ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం దాడులు చేశారు. మధురవాడ మిథిలాపురి కాలనీలోని ఆయన నివాసం, జోన్-2 కార్యాలయం, ఆయన స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలోని తల్లిదండ్రుల ఇల్లు, కింతలిలోని అత్తవారి ఇల్లు, కొత్తపేటలోని వియ్యంకుడి నివాసంతోపాటు హైదరాబాద్‌లోని కుమార్తె ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం పేరుతో మధురవాడలో 270, పరదేశిపాలెంలో 400, కాపులుప్పాడలో 200, మేనల్లుడి పేరుతో కాపులుప్పాడలో 750 గజాల స్థలాలు, మద్దిలపాలెంలో అపార్టుమెంట్‌లో ఒక ఫ్లాట్, విజయవాడలో ఇంటి స్థలం, శ్రీకాకుళం జిల్లాలో 13 ఇళ్ల స్థలాలు, శ్రీకాకుళం జిల్లా కింతలిలో 4.6 ఎకరాల భూమి, ఒక మారుతి బ్రెజ్జా కారు, 500 గ్రాముల బంగారం, ఆరు బ్యాంకు అకౌంట్లలో రూ.ఐదు లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. వీటి డాక్యుమెంట్ విలువ రూ.రెండు కోట్లు కాగా, మార్కెట్ విలువ రూ.25 కోట్లకుపైగా ఉంటుందని ఏసీబీ అధికారుల అంచనా. దీంతో సింహాచలాన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, డీఎస్పీలు టీవీఎస్ నాగేశ్వరరావు, రమ్య తెలిపారు.

విశాఖ ఐఐఎంకు 4 జాతీయ అవార్డులు

- రెండు విభాగాల్లో ప్రథమ స్థానం.. మరో రెండింటిలో రెండవ స్థానం



విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) నాలుగు కేటగిరీల్లో జాతీయ స్థాయి అవార్డులను దక్కించుకుంది. ప్రతిష్ఠాత్మకమైన పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) అందించే అవార్డులకు ఐదు విభాగాలకు ఐఐఎం దరఖాస్తు చేయగా, రెండు కేటగిరీల్లో ప్రథమ స్థానంలో, మరో రెండు కేటగిరీల్లో రెండో స్థానంలో నిలిచింది. కాఫీ టేబుల్ బుక్ కేటగిరీలో ఐఐఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న ఐఐఎంవీ ఫీల్డ్ తొలిస్థానాన్ని దక్కించుకుంది. అలాగే డిఫెన్స్ సెక్టార్ కేటగిరీలో ఐఐఎంవీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ప్రథమ స్థానం దక్కించుకుంది. అలాగే, మహిళా అభివృద్ధి కేటగిరీలో ఉత్తమ సామాజిక సేవ కింద అమలు చేసిన నారీమణి ప్రోగ్రామ్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. అలాగే, నైపుణ్య శిక్షణలో ఐఐఎంవీలో అమలు చేస్తున్న భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దడం అనే కార్యక్రమం రెండో స్థానాన్ని దక్కించుకుంది. అవార్డులు దక్కడం పట్ల ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇవి ఫ్యాకల్టీ అంకితభావానికి నిదర్శనమన్నారు. అక్రిడేషన్‌కు, ర్యాంకింగ్స్‌కు ఈ అవార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించారు. తమ పనితీరును గుర్తించినందుకు పీఆర్ఎస్ఐకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న పీఆర్ఎస్ఐ జాతీయ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులను అందుకోనున్నారు.

నెయ్యి వైష్ణవిది.. సరఫరా చేసింది ఏఆర్ డెయిరీ!

- టోల్‌గేట్ల సీసీ కెమెరా ఫుటేజీలు సేకరించిన సిట్
- ట్యాంకర్ డ్రైవర్లనూ విచారించే అవకాశం
- సీబీఐ డైరెక్టర్‌తో సిట్ సిబ్బంది వీడియో కాన్ఫరెన్సు
- దర్యాప్తు పురోగతిపై సమీక్షించిన సీబీఐ డైరెక్టర్
- ఐజీ త్రిపాఠీకి నివేదిక అందజేయనున్న అధికారులు

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని సరఫరా చేసేందుకు టీటీడీతో ఏఆర్ డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఒప్పందానికి విరుద్ధంగా వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి సేకరించి.. తన ట్యాంకర్ల ద్వారా టీటీడీకి సరఫరా చేసినట్టు సుప్రీంకోర్టు నియమించిన సిట్ బృందం నిర్ధారణకు వచ్చింది. విచారణలో సేకరించిన సమాచారాన్ని అందించేందుకు మంగళవారం సిట్ అధికారులు సీబీఐ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. దర్యాప్తు నివేదికను సిట్ కీలక అధికారైన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి సిట్ సిబ్బంది పంపింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ సంస్థ నెయ్యి సరఫరాపై ఈ ఏడాది ప్రారంభంలో టీటీడీతో ఒప్పందం కుదుర్చుకుంది. దానికనుగుణంగా ఏఆర్ డెయిరీనే టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలి. అయితే ఏఆర్ డెయిరీ తన ట్యాంకర్లను వైష్ణవి డెయిరీకి పంపి, అక్కడ నెయ్యి నింపుకుని టీటీడీకి సరఫరా చేసినట్టు ఆధారాలు లభించాయి. ఏఆర్ డెయిరీ నుంచి సేకరించిన రికార్డులు, దిండిగల్ నుంచి ట్యాంకర్ల రాకపోకలను పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ ట్యాంకర్లకు జీపీఆర్ఎస్ అమర్చారా.. లేదా? అన్నదానిపైనా దర్యాప్తు బృందం దృష్టి సారించింది. ట్యాంకర్లు రాకపోకలు సాగించిన మార్గాల్లోని టోల్‌గేట్ల వద్ద సీసీ కెమెరాల ఫుటేజీలను సిట్ అధికారులు సేకరించారు. ఆ మార్గంలోని చెక్‌పోస్టుల నుంచీ ఆధారాలు తీసుకున్నారు. వాటి ఆధారంగా ట్యాంకర్ల నంబర్లు, వాటిని నడిపిన డ్రైవర్లను గుర్తించారు. దీనిపై డ్రైవర్లను కూడా విచారించాలని సిట్ అధికారులు భావిస్తున్నారు.

చెన్నై ల్యాబ్ క్వాలిటీ అనలిస్టులను ప్రశ్నించే అవకాశం

ఏఆర్ డెయిరీ టీటీడీకి సరఫరా చేసిన నెయ్యి నాణ్యతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్ జారీ చేసిన చెన్నైలోని ఎస్ఎంఎస్ ల్యాబ్ నిర్వాహకులను కూడా సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. నెయ్యి నాణ్యతను నిర్ధారించిన క్వాలిటీ అనలిస్టులను కూడా ప్రశ్నిస్తారు. అయితే వారిని తిరుపతి పిలిపించి విచారిస్తారా లేక సిట్ అధికారులే చెన్నై వెళతారా అన్నది తెలియరాలేదు.

సీబీఐ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సు

తిరుపతి అలిపిరి సమీపంలోని సిట్ కార్యాలయం నుంచీ విచారణ అధికారులు ఢిల్లీలోని సీబీఐ డైరెక్టర్‌తో మంగళవారం వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకూ జరిగిన ఈ సమావేశంలో ఇప్పటివరకూ విచారణ జరిపిన తీరు, సేకరించిన సమాచారం, గుర్తించిన అంశాలు, నిర్ధారించిన ఉల్లంఘనలు వంటివన్నీ విచారణ అధికారులు డైరెక్టర్‌కు నివేదించినట్టు తెలిసింది. తదుపరి విచారణలో తెలుసుకోవల్సిన విషయాలు, సేకరించాల్సిన సమాచారం గురించి విచారణ అధికారులకు డైరెక్టర్ దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. సమావేశం అనంతరం దర్యాప్తు పురోగతిపై రూపొందించిన నివేదికను ఏపీ పోలీసు తరపున కీలక అధికారిగా ఉన్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి అందజేసేందుకు డీఎస్పీ స్థాయి అధికారి విజయవాడ వెళ్లినట్టు తెలిసింది.

సిట్ కార్యాలయం వద్ద భద్రత

తిరుపతిలోని అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్సు ఆవరణలో ఏర్పాటైన సిట్ కార్యాలయానికి ప్రభుత్వం భద్రత కల్పించింది. కార్యాలయంలో అవసరమైన సదుపాయాలన్నీ మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో ఏర్పాటయ్యాయి. విచారణ అధికారులు మంగళవారం పూర్తిగా కార్యాలయంలోనే గడిపారు. కార్యాలయం సమీపానికి ఎవరినీ అనుమతించడం లేదు. కార్యాలయానికి భద్రతగా పోలీసు బలగాలను నియమించారు.

పత్తి కొనుగోళ్లు ఆపొద్దు

- సీసీఐ సీఎండీతో కేంద్ర మంత్రి పెమ్మసాని


కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌తో సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా

గుంటూరు సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి కొనుగోళ్లు ఆగకూడదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టంచేశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాను మంగళవారం ఢిల్లీలో పెమ్మసాని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలక్కుండా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరపాలని, తేమ శాతంలోనూ న్యాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యలపై 'కాటన్ యాలీ' యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ యాప్ ద్వారా పత్తి సేకరణ, ఉత్పత్తి, ఆధార్ లింక్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం ద్వారా రైతులకు నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

సీసీఐ మేనేజర్‌పై బదిలీ వేటు

గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీసీఐ గుంటూరు మేనేజర్ అమర్నాథ్ రెడ్డిపై బదిలీ వేటు పడింది. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల విషయంలో ఆయన నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో నూతన మేనేజర్‌గా రాజేందర్ షాను నియమించారు. ఈ ఏడాది జూలైలోనే అమర్నాథ్ రెడ్డి గుంటూరు సీసీఐ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు మిల్లుల ఎంపికతో పాటు, జిన్నింగ్ ధరల నిర్ణయం, కొనుగోలు కేంద్రాల ప్రారంభం వంటి నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలను 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు వెలుగులోకి తెచ్చింది.

టీడీపీలో ప్రతి కార్యకర్తకూ గౌరవం

- హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ మంజులారెడ్డి


మంజులా రెడ్డి

విజయవాడ, రెంటచింతల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తారనేందుకు తానే ఉదాహరణ అని చేర్రెడ్డి మంజులారెడ్డి చెప్పారు. హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమితులైన మంజులారెడ్డి.. మంగళవారం విజయవాడ శిల్పారామంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం దీక్ష, పట్టుదలతో పని చేసిన తనకు ఈ పదవిని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇచ్చారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల అరాచకాలను పురుషులే తట్టుకోలేకపోయారు. అయితే ఓ మహిళ పోలింగ్ రోజున వైసీపీ మూకల గొడ్డలి దాడితో రక్తం కారుతున్నా అక్రమాలను అడ్డుకుని వీర వనితగా వార్తల్లోకెక్కారు. ఆమే పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన చేర్రెడ్డి మంజులరెడ్డి. పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా కూర్చొనేందుకు వెళ్లకుండా ఆమెను అడ్డుకునేందుకు వైసీపీ వర్గీయులు రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో గాయపరిచారు. అయినా ఆమె వెనక్కి తగ్గకుండా రక్తపు గాయాలతోనే బూత్‌లో కూర్చొని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నారు. పోలింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. ఆ తెగువ పట్టుదలే మంజులారెడ్డికి పదవి రావడానికి దోహద పడిందని అంటున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సంభాల్ హింస

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్‌లో ఆదివారం జరిగిన హింస అవాంఛనీయమైనది. స్థానిక కోర్టు ఉత్తర్వుల మేరకు జరుగుతున్న షాహీ జామా మసీదు సర్వేను అడ్డుకొనేందుకు కొందరు ప్రయత్నించడంతో అల్లర్లు జరిగాయి. మృతులసంఖ్య ప్రస్తుతం ఐదుకు చేరడంతో పాటు, పరిస్థితులు కుదుటపడలేదు. సర్వేను ప్రతిఘటిస్తూ పెద్ద గుంపుగా వచ్చిన కొందరు రాళ్ళు రువ్వడంతో ఆరంభమైన ఈ అల్లర్లను నియంత్రించడానికి పోలీసులు బాష్పగోళాలు, ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించవలసివచ్చింది. రెండున్నరవేలమందిమీద పోలీసులు ఏడు ఎఫ్‌ఐఆర్‌లను నమోదుచేశారు. సమాజ్‌వాదీపార్టీకి చెందిన ఒక ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు ఈ హింసను ప్రోత్సహించారంటూ వారిమీదా కేసులు పెట్టడంతో బీజేపీ, ఎస్పీ మధ్య రాజకీయ యుద్ధం జోరుగా సాగుతోంది.

దశాబ్దాలుగా మతసామరస్యానికి పుట్టినిల్లులాగా ఉన్న ఈ ప్రాంతం ఈ ఘటనతో ఒక్కసారిగా వేడెక్కిపోయిందని, ఉభయమతాలవారి మధ్య అవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మృతులు నలుగురూ పోలీసుల కాల్పుల్లో మరణించలేదని, వారిని ఎవరో అత్యంత సమీపంనుంచి నాటు తుపాకులతో కాల్చిచంపారని పోలీసు ఉన్నతాధికారుల వాదన. ఆందోళన చేస్తున్నవారి మీద మరోమతానికి చెందిన ప్రత్యర్థులు కాల్పులు జరిపివుంటారన్న వాదన కూడా తెరమీదకు వస్తున్నది. విడియో క్లిప్పుల విశ్లేషణతో మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయన్నది అటుంచితే, ప్రార్థనాస్థలాల చుట్టూ వివాదాలు రేగుతున్నంతకాలం ఇటువంటి ఘర్షణలకు అవకాశం ఉంటుందన్నది నిజం. పైగా ఒకమారు సర్వే జరిగిన తరువాత, స్థానిక న్యాయస్థానం రీ సర్వేకు ఆదేశించడం ఇక్కడ ఇంకొంత అనుమానాన్ని పెంచింది. మంగళవారం సర్వేకు అనుమతించినప్పటినుంచీ ఈ ప్రాంతం ఉద్రిక్తంగానే ఉంది.

దేశంలో తలెత్తుతున్న మందిర్–మస్జిద్ వివాదాల్లో ఇది మరొకటి. షాహీ జమామసీదు ఉన్నచోటనే హరిహర ఆలయం ఉన్నదంటూ, జ్ఞానవాపి కేసులో హిందువుల తరఫున వాదించిన న్యాయవాది స్థానిక కోర్టులో పిటిషన్ వేసి, సర్వేకు అనుకూలమైన ఉత్తర్వులు పొందారు. మొఘల్ చక్రవర్తి బాబర్ 16వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని కూల్చి మసీదు కట్టాడని ఆయన వాదన. 1904నాటి పురాతన కట్టడాల పరిరక్షణచట్టం వర్తించే ఈ ప్రదేశంలో ఒక సివిల్‌కోర్టు ఇలా సర్వేకు ఆదేశించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మసీదు కమిటీ 1991 నాటి చట్టాన్ని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ ఈ సర్వేను నిలువరించేందుకు ఏవో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.

అయోధ్య వివాదం పతాకస్థాయిలో ఉన్నప్పుడు, 1992లో మసీదు కూల్చివేతకు ముందుగానే, పి.వి.నరసింహారావు ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో చేసిన చట్టం ఇది. కేవలం అయోధ్యను, అప్పటికే అది న్యాయవివాదంలోనూ ఉన్నందున, దానిని మినహాయించి, దేశంలోని మిగతా ప్రార్థనాస్థలాలన్నింటికీ 1947 ఆగస్టు 15 నాటి స్థితిని వర్తింపచేసేట్టుగా ఈ చట్టం తయారైంది. ఎవరూ ఆ ప్రార్థనాస్థలాల స్థితిగతులను మార్చకూడదు, తదనుగుణమైన చర్యలు తీసుకోకూడదు అంటూ ఈ చట్టం విస్పష్టంగా చెప్పింది. భవిష్యత్తులో అయోధ్య తరహా వివాదం ఎలా పుడుతుంది, పెరుగుతుందన్న అవగాహనతో, అటువంటి వివాదాలకు తావు ఇవ్వనిరీతిలో ఇది రూపొందింది. కానీ, ఎంతో ముందుచూపుతో రూపొందిన ఈ చట్టాన్ని కేంద్రమూ, సుప్రీంకోర్టు కలగలసి నిర్వీర్యం చేశాయి. 2019నాటి అయోధ్య తీర్పులో ఈ చట్టం గురించి సుప్రీంకోర్టు గొప్పగా వ్యాఖ్యానించింది. అయోధ్య వివాదం ముగిసింది కనుక, భవిష్యత్తులో ఇటువంటివి తలెత్తకూడదని, సామాజిక అశాంతి రేగకూడదని కాంక్షించింది. ఆ ధర్మాసనంలో మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఒకరు. కానీ, ఆయనే 2022మేనెలలో జ్ఞానవాపి వివాదంలో ఏఎస్‌ఐ సర్వేకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటూ, ఎదుటిపక్షంవారు సదరు కట్టడం స్వరూపాన్ని మార్చమని అడగడం లేదని, దాని మూలాలు తెలుసుకోవాలని మాత్రమే కోరుతున్నారంటూ ఏదో నిర్వచనం ఇచ్చారు. ఈ మినహాయింపు దిగువకోర్టులకు మంచి ఉత్తేజాన్ని ఇచ్చి, అవి ధైర్యంగా 1991నాటి చట్టం స్ఫూర్తిని వమ్ముచేయడానికి వీలుకల్పించిన మాట నిజం. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేవరకూ, దిగువకోర్టులను సుప్రీంకోర్టు నియంత్రించనిపక్షంలో సంభాల్ తరహా ఘర్షణలు దేశం వరుసగా చవిచూడాల్సివస్తుంది.

మార్చురీ వ్యవస్థ మెరుగుపడాలి...!

న్యాయ ప్రక్రియలకు సహాయపడటానికి వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించే వైద్యశాఖను న్యాయ వైద్యశాస్త్రం అంటారు (forensic or legal medicine). ఇందులో భాగంగా మరణానంతర పరీక్షలు, గాయాల విశ్లేషణ, మానభంగాల బాధితుల నుంచి సాక్ష్యాలు సేకరించడం, విశ్లేషించడం వంటివి చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ విభాగాన్ని సమూల ప్రక్షాళన చేసేందుకు, హైకోర్టు క్రిమినల్ అప్పీల్ నెం. 326 ఆఫ్ 2017లో వెల్లడించిన ఆదేశాలను అనుసరించి, ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించింది (జీవో: 129, 16–10–2024). హైకోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో శవపరీక్షల నిర్వహణలో పాటించాల్సిన శాస్త్రబద్ధమైన ప్రమాణాలపైనా, తదనంతరం తయారు చేసే నివేదికల నిబద్ధతపైనా విస్తృత చర్చ జరిపారు.

ఆధునిక సమాజంలో ప్రజల అసహజ మరణాలకు గల కారణాలను తెలుసుకోవడం, దోషులను శిక్షించడం, నేరాలను నివారించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ ప్రక్రియలో పోలీసులూ, కోర్టులతో పాటు ఫోరెన్సిక్ వైద్యుల పాత్ర చెప్పుకోదగ్గది. మన రాష్ట్రంలో బోధనాసుపత్రులతో పాటు నిర్దేశిత జిల్లా, తాలూకా ఆసుపత్రులలో శవపరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితులలో చాలా చోట్ల ఫోరెన్సిక్ వైద్యులు అందుబాటులో ఉండడంచేత నాణ్యతా ప్రమాణాలతో శవపరీక్షలు నిర్వహించడానికి అవకాశం కలిగింది. హైకోర్టు ఆశించిన విధంగా న్యాయ వైద్యశాస్త్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడానికి నియమ నిబంధనావళి రూపొందించడం ఈ విశేషజ్ఞుల కమిటీకి పెద్ద కష్టమైన పని కాకపోయినప్పటికీ దానిని ఆచరణలో పెట్టాలంటే మన శవాగారాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

గతంతో పోల్చుకుంటే కొంత మేర మార్చురీల అభివృద్ధి జరిగింది. కానీ రాష్ట్రంలో చాల చోట్ల శవాలను భద్రపరిచే శీతల వ్యవస్థ (Cold storage) అవసరాలకు సరిపోయేలా లేదు. కోల్డ్ స్టోరేజీలను కూడా సరిగా నిర్వహించటం లేదు. మన మార్చురీలలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు, ముఖ్యంగా ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. శవ పరీక్షలు చేయడానికి కావల్సిన ఆధునిక పనిముట్లు చాల చోట్ల అందుబాటులో లేవు. ప్రపంచం అంతా ఎలక్ట్రిక్ రంపాలతో పుర్రెలను తొలచి మెదడును పరీక్షిస్తుంటే, మనం మాత్రం పాత పద్ధతిలో ఇంకా సుత్తి, శానం వాడుతుండడం బాధాకరం. శవపరీక్షలు చేసే వైద్యులకి అవసరమైన రక్షణ తొడుగులను, అదనపు పరీక్షలు నిర్వహించడానికి కావల్సిన సరంజామాను సమకూర్చుకోవడం అనునిత్యం ఒక యుద్ధంలా మారింది. కొన్ని అసహజ మరణాలని పరిశోధించడానికి బాడీ శాంపిల్స్‌ని దూరంగా ఉన్న ప్రయోగశాలలకు పంపాలి. అప్పటి దాకా ఆ నమూనాలని కాపాడేందుకు డీప్ ఫ్రీజర్లు, ప్రత్యేక సంరక్షణ ద్రవ్యాలు అవసరం అవుతాయి. ఈ మౌలిక సదుపాయాల కల్పన పని నాణ్యతను ఎంతో పెంచుతుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలలు విషపదార్థాల వల్ల మరణించినవారి శవపరీక్షలలో సరైన ఫలితాలను అందించలేకపోతున్నాయి. అలాగే అనేక విషాలను గుర్తించడంలో అసమర్థంగా ఉన్నాయి. కాలం చెల్లిన విశ్లేషణాత్మక విషశాస్త్ర పద్ధతులు (analytical toxicology) ఉపయోగించడమే దీనికి ముఖ్య కారణం. ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలల మధ్య, న్యాయ వైద్య విభాగం మధ్య సరిగ్గా సమన్వయం లేకపోవడం వల్ల కొన్ని కేసులలో న్యాయ విచారణ విఫలం అవుతున్నది. ఇంక శవపరీక్ష నివేదికల ప్రమాణాల విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన MedLEaPR సాఫ్ట్‌వేర్ మన రాష్ట్రంలో కూడా వినియోగిస్తే చాల ఉపయోగకరంగా ఉంటుంది. అవినీతిని నిరోధిస్తూ కొంత పారదర్శకతను సుస్థిరం చేసే అవకాశం ఉంది. హైకోర్ట్ చెప్పిన విధంగా మరణానికి కారణమైన ముఖ్య గాయాలను ఫొటోగ్రాఫ్ లేదా వీడియోగ్రాఫ్ చేసి ఇంటర్‌నెట్‌లో భద్రపరచడం సంవత్సరాల పాటు జరిగే న్యాయ ప్రక్రియను బలోపేతం చేస్తుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలను ఆంధ్రప్రదేశ్ న్యాయ వైద్య వ్యవస్థలో తీసుకురావాలన్న న్యాయమూర్తుల ఉన్నత ఆలోచనకు జోహార్లు. అయితే, ఆ మొత్తం ప్రక్రియ జరగడానికి మన మార్చురీలలో, న్యాయ వైద్య ప్రయోగశాలల్లో, పోలీస్ వ్యవస్థలో, అలాగే వృత్తి పట్ల మన అంకిత భావంలో పెను మార్పులు అవసరం.




– కట్టంరెడ్డి అనంత రూపేష్‌రెడ్డి
ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నం

'మహా' ఫలితాల మతలబు ఏమిటి?

ప్రజల సమస్యలు, సానుభూతి పవనాలు, తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత, భావోద్వేగపరమైన అంశాలు ఆధారంగా ఎన్నికల్లో విజయం సాధించడం భారతదేశంలో సర్వసాధారణం. 1998లో ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు విపరీతంగా పెరిగినందుకు బీజేపీ ప్రభుత్వం పరాజయం పాలయింది. 'పేదలు ఉల్లిగడ్డలు ఎప్పుడూ తినరు.. కేవలం పై వర్గాలే ఉల్లిగడ్డలు తింటాయి' అని వ్యాఖ్యానించి ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నందుకు బీజేపీ అధిష్ఠానం సాహెబ్‌సింగ్ వర్మతో రాజీనామా చేయించి సుష్మా స్వరాజ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. తొలి కేబినెట్ సమావేశంలోనే ఉల్లిగడ్డల ధరలను తగ్గించేందుకు సుష్మా స్వరాజ్ నిర్ణయం తీసుకున్నారు. కాని అప్పటికే బీజేపీ సర్కార్ పట్ల ప్రజా వ్యతిరేకత ప్రబలడంతో ఓటమిపాలై షీలా దీక్షిత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2013లో షీలాదీక్షిత్ సర్కార్ ఓడిపోవడానికి కూడా ఉల్లిగడ్డల ధరల పెరుగుదల ఒక కారణమవడం విశేషం.

అధిక ధరలు, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, కుంభకోణాలు, అత్యాచారాలు విద్యుత్ ఛార్జీల పెరుగుదల వంటివి అనేక సందర్భాల్లో దేశంలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి వాటి వల్ల ప్రభుత్వాలు ఓడిపోయాయని ఎవరైనా చెప్పగలరా? దేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వల్ల ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. తెలుగుదేశం, బిజూ జనతాదళ్ లాంటి పార్టీలు అలా అధికారంలోకి వచ్చినవే. జాతీయ స్థాయిలో ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ మరణం కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించాయి. యూపీఏ హయాంలో కుంభకోణాలు, అవినీతి వల్ల 2014లో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభంజనం వీచిందనడంలో సందేహం లేదు. మతపరమైన భావోద్వేగాలను బీజేపీ ఎన్నికలకు ఉపయోగించుకోవడం కూడా ఎవరూ కాదనలేని విషయం. కర్ణాటకలో యడ్యూరప్ప హయాంలో అవినీతి, అక్రమాలు, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలన, వ్యవహారశైలి పట్ల వ్యతిరేకత, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అరాచక పాలన కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించిన విషయం అందరికీ తెలుసు.

స్థూలంగా చూస్తే రాజకీయ పార్టీల తలరాతలు ప్రజా వ్యతిరేక, ప్రజా అనుకూల తరంగాల ఆధారంగా నిర్ధారితమవుతాయి. కొన్నిసార్లు అంతర్గతంగా ప్రజా వ్యతిరేకత చాప క్రింద నీరులాగా ప్రవేశిస్తుంది. కాని ఇది కూడా కనిపెట్టలేనిది కాదు. స్థానికంగా పర్యటించినప్పుడు, ప్రజలతో మాట్లాడినప్పుడు అర్థం అవుతుంది. 'నేను మా ఊళ్లో అడుగుపెట్టినప్పుడు నన్నెప్పుడూ బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. ఆమె నాకు ఏమీ చెప్పలేదు కాని నాకు ఓడిపోతానన్న విషయం మాత్రం అర్థమైంది' అని దివంగత కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. అందువల్ల నేతలు తమ గెలుపోటముల గురించి లీలగానైనా అంచనా వేయగలరనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం వీస్తుందని కొన్ని సంస్థలు తేల్చినా అది 240 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసిన వారు కూడా లేకపోలేదు. ప్రజలకు ఒక పార్టీ పట్ల మోజు తగ్గినా, ప్రతిపక్ష పార్టీ పట్ల కూడా సానుకూలత లేనప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడతాయని 2024లోనే కాదు, అంతకు ముందు కూడా రుజువైంది. ప్రభంజనం ఉన్నదా లేదా, పైకి కనపడని ప్రజా వ్యతిరేకత ఉన్నదా లాంటి అంశాలు ఎన్నికల ప్రచార సమయంలోనూ, పోలింగ్ రోజు, పోలింగ్ శాతంలోనూ కూడా వ్యక్తమవుతాయి. అదే సమయంలో పూర్తి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల స్థాయి వ్యూహ రచన, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను తమ వైపునకు తిప్పుకోవడం, భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టడం వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారు అవుతాయని చెప్పడానికి వీల్లేదు. అలా చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ అధికార పార్టీలు పరాజయం చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, శిందే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీని తిరస్కరించిన ప్రజలు కేవలం అయిదు నెలల్లోనే ఎలా మారిపోయారు? సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయని మోదీ ప్రచారం ఇప్పుడు పనిచేసేంత అద్భుత మార్పు ఏమి వచ్చింది? రైతుల ఆత్మహత్యలు, సోయాబీన్ ధరలు పడిపోవడం, నిరుద్యోగం, ఓబీసీల నిరసన ఇత్యాది సమస్యలు ఎందుకు ప్రభావం చూపలేదు? మన ప్రజాస్వామ్యం భవిష్యత్తు పట్ల ఆందోళన ప్రకటిస్తున్నవారు ఎన్నికల ఫలితాల గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజలను చైతన్యపరచవలసిన అవసరం ఉన్నది.

నృత్యం చేయలేని నర్తకి నాట్యవేదికను నిందించినట్లు సాధారణంగా ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలను మేనేజ్ చేశారనో, రిగ్గింగ్ జరిగిందనో నిందలు వేస్తాయి. అయితే కొన్ని ఫలితాలు అనూహ్యంగా వచ్చినప్పుడు అందుకు కారణాల గురించి లోతుగా చర్చించడం అనావశ్యకం మాత్రం కాదు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇలాంటి చర్చలకే దారి తీస్తున్నాయి. ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు ఒకప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు హరియాణా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ప్రభావితం చేయగలిగిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. పదేళ్ల ప్రజా వ్యతిరేకత, భారీ ఎత్తున నిరుద్యోగం, కనీస మద్దతు ధర వంటి రైతాంగ సమస్యలు, పట్టణ ఓటర్ల అసంతృప్తి, మహిళా మల్లయోధుల నిరసనలు, పూర్తి చేయని ఎన్నో హామీల వల్ల పదేళ్ల తర్వాత హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఇండియా టుడేతో పాటు పలు పత్రికలు, సర్వే సంస్థలు కూడా అంచనా వేశాయి. కాని ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హరియాణా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. కాని ఈ ఆరోపణలపై అంతగా చర్చ జరగలేదు. ఇవి మచ్చలేని ఎన్నికలు అని ఎన్నికల కమిషన్ అభివర్ణించింది.

తాజాగా మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు అనేక మందిని మరింత ఆశ్చర్యపరిచాయి. మహారాష్ట్రలో బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇంత భారీ ఎత్తున విజయం సాధిస్తాయని ఎవరూ ఊహించలేదు. ముఖాముఖి ఎన్నికల్లో బీజేపీని కాంగ్రెస్ గట్టిగా ఢీకొనలేకపోతోందని హరియాణా ఎన్నికల తర్వాత విమర్శలు వచ్చినప్పటికీ 1962 తర్వాత మొదటిసారి కనీవినీ ఎరగని రీతిలో ఘోరపరాజయం చెందుతుందని, 101 సీట్లకు పోటీ చేసి కేవలం 15 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని ఎవరూ అంచనా వేయలేదు. అయిదునెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లకు గాను 13 సీట్లు దక్కించుకుని ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ ఇంత ఘోరంగా ఓడిపోతుందని ఎవరు ఊహించగలరు? ఇదే షాక్‌కు శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే కుమారుడు ఉద్ధవ్‌ఠాక్రే శివసేన కూడా గురయ్యారు. పోటీ చేసిన 95 సీట్లలో 20 సీట్లు మాత్రమే దక్కుతాయని, తన పార్టీని చీల్చిన ఏక్‌నాథ్ శిందే వర్గం చేతుల్లోనే 36 సీట్లలో ఓడిపోతామని ఆయన కలలో కూడా ఊహించి ఉండరు. ఇక శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పరిస్థితి దయనీయంగా మారింది. తన గురువు వసంత దాదా పాటిల్‌పై తిరుగుబాటు చేసి 38 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయిన శరద్ పవార్ రాజీవ్ మరణానంతరం ప్రధానమంత్రి పదవి ఆశించి భంగపడ్డారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పవార్ ఎంవీఏ కూటమి నేర్పాటు చేసి బీజేపీ పన్నిన అన్ని ఎత్తుగడలనూ భగ్నం చేశారు. అలాంటి పవార్ 83 ఏళ్ల వయస్సులో చివరకు మోదీ, అమిత్ షా వ్యూహరచనకు చిత్తు అయిపోయారు. లోక్‌సభలో 10 సీట్లకు 8 సీట్లు గెలుచుకున్న పవార్ పార్టీ ఇప్పుడు 86 సీట్లకు పోటీ చేసి కేవలం 10 సీట్లు గెలుచుకుంది. ఆయన ఆధిపత్యం అత్యంత బలంగా ఉన్న చక్కెర బెల్టులో కూడా అత్యధిక సీట్లు కోల్పోయారు. ఇప్పుడు ఆయన పార్టీ దేశంలో అనేక అంతరించిన పార్టీల జాబితాలో చేరే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

విచిత్రమేమంటే అయిదు సంస్థలు కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందని అంచనా వేస్తే బీజేపీ నేతృత్వంలోని మహాయుతి అధికారంలోకి వచ్చినా 160 సీట్లు దాటకపోవచ్చునని మరో అయిదు సంస్థలు అంచనాలు వేశాయి. బీజేపీ కూటమి 180 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసిన ఒకే ఒక ఎగ్జిట్‌పోల్ ఏజెన్సీ చేసిన అంచనాలను కూడా అధిగమించి బీజేపీ కూటమి 230 సీట్లు సాధించింది. ఎమ్మెల్యేలను తరలించేందుకు అధికార కూటమి అనేక ఛార్టర్డ్ విమానాలను సిద్ధం చేసినట్లు, మరోవైపు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే పరస్పరం సంప్రదించుకున్నట్లు, విమానాశ్రయం వద్ద ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌ను బుక్ చేసినట్లు కూడా వార్తలు రావడంతో ఏ పార్టీ కూడా ఈ స్థాయిలో మహాయుతి గెలుపును ఊహించలేదని అర్థమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీని తిరస్కరించిన ప్రజలు కేవలం అయిదు నెలల్లోనే ఎలా మారిపోయారు? సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయని మోదీ ప్రచారం ఇప్పుడు పనిచేసేంత అద్భుత మార్పు ఏమి వచ్చింది?

'నాకు చాలా తికమకగా ఉన్నది. ఈ అయిదు నెలల్లో ఏం మార్పు వచ్చిందో అర్థం కావడం లేదు. లడ్కీ బహిన్ యోజనా పథకం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసిందంటే నేను నమ్మలేను. ఇలాంటి పథకాలు గతంలో ఎన్నడూ ఎన్నికల ఫలితాలను మార్చిన సందర్భాలు లేవు. మార్కెట్లు మాత్రం సంతోషంగా ఉన్నాయి' అని ప్రముఖ రాజకీయ ఆర్థిక విశ్లేషకుడు స్వామినాథన్ అంకిలేశ్వర్ అయ్యర్ అన్నారు. రైతుల ఆత్మహత్యలు, సోయాబీన్ ధరలు పడిపోవడం, నిరుద్యోగం, ఓబీసీల నిరసన వంటి అనేక సమస్యలు మాత్రం ఎందుకు ప్రభావం చూపలేదో అని అయోమయం ప్రకటిస్తున్నవారు కూడా ఉన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం పట్ల ఆందోళన ప్రకటిస్తున్న వారు ఎన్నికల ఫలితాల గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజాచైతన్యం కల్పించాల్సిన అవసరం ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

యడవల్లి భూములు దళితులకే దక్కాలి!

గత ఐదేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై విశృంఖలంగా జరిగిన దాడులు, అత్యాచారాలు, అక్రమాలు మనకి తెలిసినవే. ఎన్ని రకాలుగా, ఎంత పాశవికంగా దళితులను, వారి హక్కులను, ఆశలను కాలరాశారో, అణచివేసారో యావత్ దేశం మూగసాక్షిగా గమనించింది. ఇవి మనకు పైకి కనపడిన దాడులైతే– పేపర్లకెక్కకుండా, టీవీల్లో కనపడకుండా కూడా ఎన్నో అన్యాయాలను దళితులు ఎదుర్కొన్నారు. ఇందులో ముఖ్యమైనది దళితుల భూముల ఆక్రమణ.

ఇప్పుడు రాష్ట్రం మొత్తాన్ని తీవ్రంగా కలచివేస్తున్న అంశం యడవల్లిలో వైసీపీ చేతుల్లో దళితుల భూముల దురాక్రమణ పర్వం. ఇది వందల కోట్లలో జరిగిన ఒక తీవ్ర నేరం, దళితులను నిస్సిగ్గుగా లూటీ చేసి, వారి భూములను ప్రభుత్వమే బలవంతంగా లాక్కున్న రాక్షసపర్వం. గ్రానైట్ మీద కన్నేసిన వైసీపీ నేతలు రాజ్యబలంతో, ధనబలంతో పెచ్చుమీరి చేసిన ఈ కుట్రను కూటమి సర్కారు భగ్నం చేసింది. ఆ భూములు తిరిగి దళితులకు అప్పగించాలని అన్ని వర్గాల నుండీ నేడు ఒత్తిడి పెరుగుతోంది.

వైసీపీ ప్రభుత్వం 416 ఎకరాల ఈ గ్రానైట్ భూములను స్వాధీనం చేసుకోవడానికి నాడు నిర్ణయించుకుంది. బదులుగా దళిత రైతులకు దయాదాక్షిణ్యంగా రూ.8లక్షలు చెల్లించేందుకు నిర్ణయించింది. కానీ ఈ భూముల్లో రూ.7600కోట్ల రూపాయల విలువ ఉన్న గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయని అంచనా. దాదాపు 120 దళిత రైతుల కుటుంబాలు యజమానులు ఉన్న ఈ భూములకు దారుణమైన రేటు కట్టి, బిచ్చగాళ్లకు ఎంగిలి మెతుకులు వేసినట్టు నాటి ప్రభుత్వం రూ.35కోట్లు విదిలిద్దామని దుష్టరచన చేసింది. ఆ విధంగా నిస్సహాయ దళితులను లొంగదీసుకుని బలవంతంగా గ్రానైట్ భూములను స్వాధీనపరచుకొన్నది. ఈ సామాజిక నేరానికి కర్త కర్మ క్రియ విడదల రజని, సజ్జల రామకృష్ణారెడ్డి, వై.ఎస్. జగన్‌రెడ్డి.



యడవల్లి దళితుల భూమి దురాక్రమణ వందల కోట్లలో జరిగిన ఒక తీవ్ర నేరం, దళితులను నిస్సిగ్గుగా లూటీ చేసి, వారి భూములను ప్రభుత్వమే బలవంతంగా లాక్కున్న రాక్షసపర్వం. గ్రానైట్ మీద కన్నేసిన వైసీపీ నేతలు రాజ్యబలంతో, ధనబలంతో పెచ్చుమీరి చేసిన ఈ కుట్రను కూటమి సర్కారు భగ్నం చేసింది.

ఈ అంశం చారిత్రక నేపథ్యంలోకి వెళితే– గుంటూరు జిల్లా, చిలకలూరిపేట, యడవల్లి గ్రామంలోని 416 ఎకరాల భూములను 1975లో ప్రభుత్వమే దళిత కుటుంబాలకు ఇచ్చింది. అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ కత్తి చంద్రయ్య ఈ భూములను దళిత రైతుల సొసైటీ పేరుతో కేటాయించారు. ఇక్కడ కేవలం భూమి ఇవ్వడమే కాకుండా, వారికి సాగు చేయడానికి అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని, సహకారాన్ని కూడా అందించారు. ఈ విధంగా దళిత రైతులు, తమ జీవనాధారంగా చేసుకుని తరతరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నారు.

2011లో కథ ఒక సరికొత్త మలుపు తిరిగింది. ఆ సంవత్సరం భూగర్భ శాఖ చేసిన సర్వేలో ఈ భూముల్లో నాణ్యమైన బ్లాక్ గ్రానైట్ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ గ్రానైట్ నిక్షేపాల విలువ దాదాపు రూ.7600 కోట్లు అని అంచనా వేసారు. వీటి విలువ గమనించిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, అనతికాలంలోనే వీటి మీద కన్నువేసి, దోచుకునే పథకాలు రచించారు. ఎందరో తమకు ఈ భూములు కేటాయించాలని గనుల శాఖకు, బ్యాంకులకు ఫిర్యాదు చేసారు. ముఖ్యంగా, ఈ భూములను కబ్జా చేయడానికి రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు, సొసైటీ అధికారులపై భారీ ఒత్తిడి పెట్టారు. దీనిని అంగీకరించకుండా దళిత రైతులు నిరసన తెలియజేశారు.

భూములను కేటాయించాలని కోరుతూ గనుల శాఖ వారికి దరఖాస్తులు పెట్టి 78 మంది బ్యాంక్ డి.డి.లు కూడా కట్టారు. అప్పటి నుంచి దళిత రైతులను ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలని ప్రయత్నాలు మొదలయ్యాయి. రాజకీయ నాయకుల ద్వారా సొసైటీ, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ కుట్రలను ఆలస్యంగా గ్రహించిన దళిత రైతుల సొసైటీ తమ భూములను నిలబెట్టుకోవడానికి ఆందోళన కార్యక్రమాలు ప్రారంభించారు.

దళిత రైతుల భూమి కబ్జాలను నడిపించింది యడవల్లి గ్రామసర్పంచ్ కుమారుడు. ఇతను గ్రానైట్ భూములు కాజేయాలనే వాళ్ళతో జతకట్టి దళిత రైతులను ఈ భూముల నుండి వెళ్ళగొట్టాలనే పథకానికి ప్రధాన కుట్రదారుడు. దళితులను బెదిరించి ఈ భూముల్లో కొంత భాగాన్ని చట్టవిరుద్ధంగా ఆక్రమించాడు. ఈ భూములను కొనుగోలు చేసినట్లు చూపించి పట్టాదారు పాసు పుస్తకాలు పుట్టించాడు. రెవెన్యూ అధికార్లను లోబరుచుకుని, సొసైటీ అధికారులపై ఒత్తిడి తెచ్చి దళితుల సొసైటీని రద్దుచేయించడం, దళితులను బెదిరించడం, డబ్బుతో ప్రలోభ పెట్టడం ఇతని రోజువారీ కార్యక్రమంగా మారింది. స్థానిక నాయకుడిగా చెలామణీ అవుతూ తన పలుకుబడిని ఉపయోగించి దళితులను ఈ భూముల నుండి వెళ్ళగొట్టడానికి అధికారులను, పోలీసులను ప్రయోగిస్తూ తన ఆక్రమణలో ఉన్న భూముల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా క్వారియింగ్ చేసుకొన్నాడు, ఇప్పటికీ చేస్తున్నాడు. అతను ఆక్రమించిన దాదాపు 50 ఎకరాల దళిత రైతుల భూముల నుంచి రూ.200కోట్ల గ్రానైట్‌ను అక్రమంగా వెలికితీసి ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా అమ్ముకొన్నాడు.

ఇక 2019లో వైసీపీ సర్కారు కొలువుదీరాక దళితులు ఈ భూముల సమస్య జగన్ మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లారు. దళిత రైతుల సొసైటీ భూముల్లోని 223 ఎకరాల గ్రానైట్ భూమిని ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎమ్‌డీసీ)కు ఉచితంగా ఇస్తున్నట్లు ప్రభుత్వం 370 జీవో విడుదల చేసింది. మిగతా భూమి విషయం జీవోలో లేకపోయినా ఏపీఎమ్‌డీసీకే అప్పగించినట్లు రెవెన్యూ అధికార్లు చెబుతున్నారు. ఏపీఎమ్‌డీసీ వాళ్ళ దళిత రైతులకు నష్టపరిహారంగా కాకుండా దయాదాక్షిణ్యంగా ఎకరానికి రూ.8లక్షల చొప్పున రూ.35 కోట్లు ఇచ్చారు. ఈ డబ్బు తీసుకోకుంటే మీకు అవి కూడా దక్కవని బెదిరించారు. ఇక్కడే అసలైన కుట్ర దాగి ఉంది. ఇదే ప్రాంతంలో జగనన్న ఇళ్ళ నిర్మాణానికి అగ్రకులాల వద్ద ఎకరానికి రూ.25 లక్షలు చెల్లించిన వైసీపీ ప్రభుత్వం దళిత రైతుల గ్రానైట్ భూములకు రూ.8లక్షలు రేటు నిర్ణయించింది. నా ఎస్సీలూ, నా ఎస్టీలూ అని మైకుల్లో అంటూనే జగన్ మోహన్‌రెడ్డి సర్కారు ఇంత అన్యాయానికి తెరలేపింది. వైసీపీ సర్కారులో గడచిన ఐదేళ్లలో దళితుల మానప్రాణాలకు పట్టపగలు రక్షణ లేకుండా పోయింది. ఇదే నియంతృత్వ ధోరణితో యాభై ఏళ్ళుగా సాగుచేసుకొంటున్న భూములపై దళిత రైతులకు ఎలాంటి హక్కు లేదని వైసీపీ ప్రభుత్వం ఒక చట్ట వ్యతిరేక నిర్ణయాన్ని తీసుకొన్నది. వ్యక్తిగత పట్టాలు లేనంత మాత్రాన సొసైటీ భూమిపై ఉన్న హక్కును దళిత రైతులు ఎలా కోల్పోతారు? వైసీపీ ప్రభుత్వం చట్టాన్నీ ధర్మాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా, అసైన్మెంట్ చట్టాన్ని మార్చి మరీ వారికి తీవ్ర ద్రోహం తలపెట్టింది. దళిత రైతులు కనీసం తన భూములను పొందే హక్కును పునరుద్ధరించడానికి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

ప్రభుత్వం చేసిన ఈ అన్యాయాన్ని రైతులు తీవ్రంగా నిరసిస్తూ వచ్చారు. ఆ నిరసన ఒక ఆయుధమై ఓటు రూపంలో వైసీపీ కుర్చీని కూల్చింది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నో ఆక్రమణలను, అన్యాయాలను తవ్వుతున్నది, విచారణలు చేపట్టి అన్నింటా న్యాయం చేస్తామని గట్టిగా చెపుతున్నది. మరి అదే విధంగా యడవల్లి భూముల విషయంలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ బతుకున్న బడుగు ఎస్సీ బిడ్డల భూములను తిరిగి వారికి ఇప్పించే ప్రక్రియ మొదలుపెట్టాలని రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు, నేతలు, పార్టీలకతీతంగా దళిత నాయకులు కోరుతున్నారు.

మొట్టమొదటిగా దళిత రైతుల హక్కులను పునరుద్ధరించడం, వారి ఆస్తులను రక్షించడం, దళిత సామాజిక హక్కులను నెరవేర్చడమే ఈ ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. అలాగే వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 370ని రద్దు చేసి, యడవల్లి దళిత రైతుల భూములను తిరిగి వారికే ఇవ్వాలి. ఈ ఘోరమైన ఆస్తి ఆక్రమణపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి. విచారణ చేసి బాధితులకి నష్టపరిహారం ఇవ్వాలి. అలాగే ఇందులో అక్రమాలకు పాల్పడినవారు ఎంతవారైనా న్యాయస్థానాలలో నిలబెట్టి కఠినమైన శిక్షలు పడేలా చేయాలి. ప్రభుత్వ రంగంలో బాధ్యత వహిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి, వారికి సస్పెన్షన్ విధించాలి. దళితులకు న్యాయం, వారి హక్కులకు రక్షణ అనేది విక్రమార్కుడు బేతాళుడి కథలా ఎప్పటికప్పుడు తిరిగి చెట్టెక్కుతున్నది. ఈ పాత కథ ఇక మారాలి. దళితులందరూ కలసికట్టుగా ఓటు వేసి భారీ స్థాయిలో గెలిపించుకున్న కూటమి ప్రభుత్వం ఇకపై చట్టాలను, చర్యలను కట్టుదిట్టం చేసి, దళితులకు మరింత పటిష్టమైన రక్షణ కలిగే విధంగా ప్రక్రియలు చేపట్టాలి. అన్నిటికంటే ముందుగా యడవల్లి ఎస్సీ బిడ్డలకు న్యాయం జరగాలి.

■ **డా. జె. పూర్ణచంద్రరావు**
రిటైర్డ్ డీజీపీ, బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ మాజీ కోఆర్డినేటర్

ఈ ముసుగుల ముచ్చట ఎన్నాళ్లు?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల ప్రక్రియ మొదలైంది. శేషన్ ఎన్నికల కమిషనర్ అయినప్పటి నుంచి ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగిన విగ్రహాలపై ముసుగులు వేయడం ఆనవాయితీగా మారింది. ఎన్నికల నియమావళి పేరుతో ప్రత్యేకంగా టీములు వేసి, విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఈ ముసుగులు వేయడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అన్నది ప్రశ్నార్థకం. అనవసరమైన ఖర్చు, శ్రమ తప్ప. సాధారణ ఎన్నికల్లో ఓటర్లకు మద్యం, డబ్బు, తాయిలాలు పంచడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణం అయ్యింది. ప్రలోభాలను అడ్డుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందన్నది జగమెరిగిన సత్యం. చదువు లేని ఓటర్లు విగ్రహాలు చూసి ప్రభావితమయ్యి వోట్లు వేస్తారనుకుందాం. మరి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లంతా బాగా చదువుకున్నవారే. మరి వారు కూడా విగ్రహాలు చూసి ప్రభావితమై ఓట్లు వేస్తారా? స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా 98 శాతం కనీసం ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నవారు ఉంటారు. మరి అలాంటప్పుడు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కూడా విగ్రహాలకు ముసుగులు వేయడం అంటే పట్టభద్రులకు కూడా అవగాహన లేనట్టేనా? దీనివల్ల ఏ విధమైన ప్రయోజనం లేదని, అటువంటి నిబంధనలను తొలగించమని కనీసం క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనివల్ల ఎన్నికల సిబ్బందికి శ్రమ, ప్రభుత్వాలకు ఖర్చు తగ్గుతుంది.

– మారిశెట్టి జితేంద్ర, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

తెనాలి సాహితీ కెరటం

తెనాలి అందించిన ఎందరో సాహిత్య, కళారంగ ప్రముఖుల్లో ప్రధానమైనవారు, అన్ని సాహిత్య ప్రక్రియల్లోను సవ్యసాచి బొల్లిముంత శివరామకృష్ణ. ప్రముఖ రచయిత, విమర్శకుడు, బొల్లిముంత శివరామకృష్ణ మేనల్లుడు డాక్టర్ చందు సుబ్బారావు అన్నట్లు శివరామకృష్ణ పండితుడు కాదు, మహాకవి కాదు, మహోపాధ్యాయుడు కాదు. అలా ఎవరైనా అంటే ఆయన విరగబడి నవ్వగలడు. 'మహానుభావుణ్ణయ్యే తీరిక, ఓపిక లేవురా సుబ్బారావు' అని కొక్కిరించగలడు. యవ్వన దశలో ఎప్పుడో బొల్లిముంత గారి గురించి విన్నప్పటికి నాకు ప్రత్యక్ష పరిచయం 1984లో నేను విశాలాంధ్రలో నా ఉద్యోగ జీవితం ప్రారంభించినప్పటి నుంచే బొల్లిముంత తెనాలి తాలూకా కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శిగా వున్నప్పుడు నా మేనమామలు గోలి హనుమంతరావు, గోలి దామోదరరావు కూచిపూడిలో కమ్యూనిస్ట్ కార్యకర్తలూ, నాయకులు. వీరికి బొల్లిముంత తోటి గాఢమైన కామ్రేడరీ అనుబంధం ఉండేది. వారి మధ్య ఆ అనుబంధమే మంగళగిరిలో 1987లో జరిగిన నా వివాహానికి ముఖ్య అతిథిగా బొల్లిముంతను రప్పించింది.



ప్రముఖ రచయత కొడవటిగంటి కుటుంబరావు రాసిన 'పిల్లి' అనే కథానికపై బొల్లిముంత చేసిన విమర్శ 'కొడవటిగంటి తిరోగమన యాత్ర' అప్పట్లో ఒక సంచలనం. పిల్లి మ్యావ్ అన్నంత మాత్రాన అది 'మావో' అన్నట్లు కాదని, పిల్లి విప్లవానికి ప్రతీక కాదని బొల్లిముంత తేల్చి చెప్పారు. బొల్లిముంత శివరామకృష్ణ (నవంబరు 27, 1920 – జూన్ 7, 2005) గుంటూరు జిల్లా చదలవాడలో జన్మించి స్వయం కృషితో సంస్కృతాన్నీ, సంగీతాన్నీ అభ్యసించారు. ఈ ఒరవడి ఆయన కుమారుడు బొల్లిముంత కృష్ణ తెనాలి పట్టణ సీపీఐ కార్యదర్శిగా, ఉపాధ్యాయునిగా, హార్మోనిస్టుగా, నృత్య నాటికల దర్శకునిగా ఎదగటానికి కారణం అయింది. కృష్ణా జిల్లా చల్లపల్లి జమీందారు రాజాకి వ్యతిరేకంగా నిర్వహించిన భూమి పోరాటంలో శివరామకృష్ణ పాల్గొన్నారు. తెలంగాణ పోరాట నేపథ్యంలో ఆయన రచించిన మృత్యుంజయులు నవల ఆయనను చిరంజీవిని చేసింది. కమ్యూనిస్టులపైన నిర్బంధకాండ, మరోవైపు సోషలిస్టు శిబిరంతో స్నేహ సంబంధాలు అమలు చేసిన నాటి ప్రధాని నెహ్రూ వైఖరిని విమర్శిస్తూ 'మొదళ్ళు నరికి చివుళ్ళకు నీరు పోస్తానంటాడు' అనే వ్యాసం చాలా సంచలనం రేపింది. సాహిత్యం రాజకీయ నాయకుల మెరమెచ్చులకు అతీతమైందనీ, ఎవరు మెచ్చుకున్నా తప్పు తప్పే గానీ ఒప్పు కాదని బొల్లిముంత చెప్పేవారు. 38 హిట్ సినిమాలకు రచన అందించి సినీ రంగంలో తన ప్రత్యేక ముద్ర చాటారు. ఆంధ్రుల అందాల నటుడు శోభన్‌బాబు బొల్లిముంత శివరామకృష్ణ గారి రచనా పటిమకు 'మనుషులు మారాలి, కల్యాణ మండపం, కాలం మారింది, శారద, ఖైదీ బాబాయ్ చిత్రాలు కలకాలం చెక్కుటద్దాలే. ఈ ఐదు చిత్రాల్లో నేనే కథానాయకుణ్ణి కాగలగడం నా అదృష్టం' అన్నాడు.

ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలో ఓల్గా తరంగాలు కవితా పుస్తకానికి సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు పొందిన శ్రీకాంత్‌తో కలసి బొల్లిముంత అందరూ బతకాలి నాటకం రాశారు. దీన్ని రక్తకన్నీరు నాగభూషణం వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. భూపోరాటాల్లో పాల్గొన్నారు. జైలు శిక్షలు అనుభవించారు. అజ్ఞాతవాస జీవితం గడిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆదేశం మేరకు 1967లో బందరు పార్లమెంటు నియోజకవర్గానికి పోటీచేసి ఓటమిపాలయ్యారు. అభ్యుదయ సాహితోద్యమంలో, ప్రజా సాంస్కృతికోద్యమాల్లో క్రియాశీలంగా వున్న బొల్లిముంత భీమవరంలో 1988 అక్టోబర్ 8, 9 తేదీలలో జరిగిన అరసం రాష్ట్ర 10వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎంపికై గుంటూరులో 1992 నవంబర్ 14, 15 తేదీలలో జరిగిన 11వ మహాసభ వరకూ కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులుగా కూడా సేవలందించారు. కమ్యూనిస్ట్ ఉద్యమానికీ, తెలుగు సాహితీ రంగానికి బహుముఖీన సేవలు అందించిన బొల్లిముంత శివరామకృష్ణ సేవలు మరువలేనివి.

– కాగితాల రాజశేఖర్
(నేడు బొల్లిముంత శివరామకృష్ణ జయంతి)

రేషన్ మాఫియా విజిలెన్స్ అధికారుల అండదండలతో బరితెగిస్తోంది. ఏకంగా గన్నీ బ్యాగులతోనే రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలించేస్తోంది. ఎక్కడైనా పట్టుబడితే అసలు అవి రేషన్ బియ్యమే కాదని కోర్టులకెళ్లి వాదిస్తోంది. ఆ తర్వాత బ్యాంకు గ్యారంటీలు కట్టి ఆ బియ్యం మళ్లీ దర్జాగా స్వాధీనం చేసుకుని అనుకున్న చోట అమ్ముకుని సొమ్ము చేసుకుంటోంది.

గన్నీలతో ఎత్తేస్తున్నారు!



రేషన్ మాఫియా బరి తెగింపు

విజిలెన్స్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా వ్యాపారం

పట్టుకుంటే.. రేషన్ బియ్యం కాదని కోర్టుకెళుతున్నారు

బ్యాంకు గ్యారంటీలు కట్టి ఆ బియ్యం మళ్లీ స్వాధీనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంటింటికీ నిత్యావసరాల పంపిణీ రోజున ఎండీయూ ఆపరేటర్లు నిర్ణీత పరిమాణం కంటే తక్కువగా బియ్యం బస్తాలను డీలర్ల దగ్గర నుంచి తీసుకువెళుతున్నారు. నిత్యావసరాల పంపిణీలో ఎండీయూ ఆపరేటర్లకు కార్డుదారులు ఎంతమంది బియ్యం అమ్ముతుంటారన్నది అవగాహన ఉంది. దీంతో ముందస్తుగా ఆ పరిమాణం మేరకు డిపోలలోనే బియ్యం గన్నీ బ్యాగులను ఉంచేస్తున్నారు. లూజుగా పెట్టుకున్న బియ్యాన్ని కాటాలో తూచి కార్డుదారులకు ఇచ్చినట్టుగా ఈ పోస్‌లో నమోదు చేస్తున్నారు. డీలర్ల దగ్గర ఉంచిన గన్నీ బ్యాగులు నేరుగా అక్రమ బియ్యం వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. గతంలో పేదల బియ్యం లూజుగా వెళ్లేవి. ప్లాస్టిక్ సంచులలో, పాలిథీన్ సంచులలోనో వెళ్లేవి. సివిల్ సప్లయిస్ అధికారులు, పోలీసుల దాడులలో పట్టుబడినపుడు వీటిలోనే కనిపించేవి. ఇప్పుడలా కాదు. ఏకంగా సీలు తీయని గన్నీ బ్యాగులే నేరుగా రవాణా అవుతున్నాయి. ఇటీవల కాలంలో నగర పరిధిలోనూ, జిల్లా పరిధిలోనూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నపుడు గన్నీ బ్యాగులే దొరికాయి. రేషన్ మాఫియా ఎంతగా బరి తెగించి రెచ్చిపోతుందన్నదానికి ఇవే నిదర్శనాలు.

గన్నీ బ్యాగుల్లో యథేచ్ఛగా సరఫరా

నగరంలో సర్కిల్ - 3లో శివ ప్రసాద్ అనే అక్రమ బియ్యం వ్యాపారిని పటమట పోలీసులు రెండు సార్లు పట్టుకున్న సందర్భంలో కూడా గన్నీ బ్యాగులే దొరికాయి. అక్టోబరులో సర్కిల్ - 1 కు చెందిన ఓ బడా రేషన్ మాఫియా డాన్‌కు చెందిన బియ్యం బస్తాలు దొరికినపుడు కూడా గన్నీ బ్యాగులతో ఉన్న బస్తాలే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిటాల రేషన్ మిల్లులో తనిఖీల సందర్భంలో గన్నీ బ్యాగులతో కూడిన అక్రమ బియ్యమే దొరికింది. ఆ రోజున మంత్రి రావటంతో ఆయన కన్నుగప్పి ట్యాగ్‌లను తొలగించి కాల్చివేశారు. ఈ వ్యవహారం మంత్రి దృష్టికి రాలేదు. ట్యాగ్‌ల ద్వారా అవి ఏ మిల్లు నుంచి వచ్చాయో తెలిసిపోతుంది. ట్యాగ్‌లను కాల్చివేయటం వల్ల నిజాన్ని కప్పిపెట్టారు.

సర్కిల్ - 1 డాన్‌కే బియ్యం విక్రయం

విజయవాడలోని రేషన్ డీలర్లంతా కూడా నగరంలోని సర్కిల్-1 డాన్‌కే బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ఎందుకంటే మిగతా 6లో..

భూముల సబ్ డివిజన్ సంగతి తేల్చండి!



రిజిస్ట్రేషన్ చార్జీలు సవరించేలోపు జరిగితేనే మేలు

కొత్త సంవత్సరంలో భూములు ధరలు పెంచేటపుడు ఇబ్బందులు

ఎల్‌పీఎం నంబర్ల ద్వారా వేర్వేరు చోట్ల ఉన్న భూములన్నింటికి ఒకే విలువ

ఉమ్మడి జిల్లాలో సగం మండలాలలోనే రీ సర్వే పూర్తి

- ఎల్‌పీఎం నంబర్లతో రిజిస్ట్రేషన్ అధికారులకు తలనొప్పి
- డిసెంబరు మాసాంతానికే సబ్ డివిజన్లు చేయించకపోతే సమస్యలే..

రీసర్వేలో ఎల్‌పీఎం నంబర్లు కేటాయించటం వల్ల కొత్త సంవత్సరం ప్రారంభంలో భూముల ధరల పెంపు సందర్భంగా అనేక ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఎల్‌పీఎం నంబర్ల కారణంగా ఆ నంబర్ పరిధిలోని వేర్వేరు లొకేషన్లలో ఉన్న భూములన్నింటికీ ఒకే ధర వర్తించే ప్రమాదం పొంచి ఉంది. దీని నుంచి బయటపడాలంటే సబ్ డివిజన్స్ నూరు శాతం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అది కూడా డిసెంబరు నెలాఖరు నాటికి చేయగలిగితేనే కొత్త సంవత్సరంలో భూముల ధరల పెంపునకు సంబంధించిన కసరత్తు శాస్త్రీయంగా చేయటానికి అవకాశం ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో రీ సర్వే సగం మండలాల్లోనే జరిగింది. మిగిలిన సగం మండలాల్లో అసలు రీ సర్వేనే జరగలేదు. రీసర్వేను కొనసాగించాలా ? పాత సర్వే నంబర్లను కొనసాగించాలా అన్న మీమాంస ప్రభుత్వ స్థాయిలో నడుస్తోంది. ప్రస్తుతం ఎల్‌పీఎం నంబర్లను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఎల్‌పీఎం నంబర్ విధానం వల్ల ఆటోమ్యుటేషన్ జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో రీ సర్వే జరగకపోవటం వల్ల చాలా గందరగోళంగా ఉంది. కొన్ని చోట్ల ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన, మరికొన్ని చోట్ల సర్వే నంబర్ల ప్రాతిపదికన భూముల ధరలను సవరించాల్సి ఉంటుంది. ఎల్‌పీఎం నంబర్ల ప్రాతిపదికన చూస్తే సబ్ రిజిస్ట్రార్లకు భౌతికంగా అవి ఎక్కడ ఉన్నాయన్నది తెలియదు. సర్వే నంబర్లలో అయితే తెలుస్తుంది.

ఎల్‌పీఎం నంబర్లలో సమస్య ఏవిటంటే..

రామారావు అనే వ్యక్తికి ఒక ఎల్‌పీఎం నంబర్‌లో ఆయనకు చెందిన వివిధ చోట్ల ఉన్న భూములన్నీ ఉంటాయి. ఒక భూమి జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. మరో భూమి చాలా దూరంగా ఉంటుంది. ఎల్‌పీఎం నంబర్ ప్రాతిపదికగా భూముల ధరలను నిర్ణయిస్తే .. జాతీయ రహదారి పక్కన ఉన్న భూమితో పాటు దూరంగా మరో విలువ కలిగిన చోట కూడా ఒకే భూమి ధరకు సిఫార్సు చేసే పరిస్థితి పొంచి ఉంది. ఎల్‌పీఎం నంబర్లలో ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే.. వేర్వేరు చోట్ల ఉన్న భూములను సబ్ డివిజన్ చేయాల్సి ఉంటుంది. సబ్ డివిజన్లు అనేవి ముందుగా రెవెన్యూ శాఖ పరిధిలో జరగాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో సబ్ డివిజన్లకు సంబంధించిన కార్యక్రమాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సబ్ డివిజన్ చేయడంలో తీవ్ర జాప్యం

సబ్ డివిజన్లు చేయించుకుందామనుకునే వారికి ప్రస్తుతం చుక్కలు కనిపిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయాల పరిధిలో సబ్ డివిజన్లు చేయటానికి రెవెన్యూ సిబ్బంది నానా ఇబ్బందులు పెడుతున్నారు. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. లంచాల కోసం జాప్యం చేయటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి భూముల అమ్మకాలు, కొనుగోళ్ల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. రామారావు అనే వ్యక్తి తన 10 ఎకరాల్లో ఐదెకరాల భూమిని అమ్మాలంటే ముందుగా రెవెన్యూ శాఖలో సబ్ డివిజన్ చేయించుకోవాలి. సబ్ డివిజన్ అయితే కానీ రిజిస్ట్రేషన్ జరగదు. ఈ లోపు కొనుగోలుదారుడి దగ్గర అడ్వాన్స్ తీసుకున్నా.. సబ్ డివిజన్‌కు నెల రోజుల సమయం పడుతున్నందున అమ్మకందారుడు అమ్మ లేకపోతున్నాడు. దీంతో సకాలంలో అతని అవసరాలకు డబ్బు అందటం లేదు. దీంతో పాటు కొనుగోలుదారుడు కూడా నెల రోజుల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ కారణంగా సదరు పార్టీ ఆసక్తి చూపడంలేదు. దీంతో అమ్మకం, కొనుగోళ్లు ఆగిపోతున్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా నిలిచిపోతోంది. ఇలాంటి సమస్యలు ఉన్నందున.. కొత్త సంవత్సరంలో భూముల ధరలు నిర్దేశించే లోపే సమస్యల పరిష్కారానికి సబ్ డివిజన్స్ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎల్‌పీఎం నంబర్లు ఉన్న ప్రతి భూమికి సంబంధించి సబ్ డివిజన్ చేయించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియను ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మేలు జరుగుతుంది. లేనిపక్షంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే.

పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి

- కస్టడీలోని స్నేహితులకు గంజాయి ఇస్తుంటే అడ్డుకున్నారని..
- కోర్టు ఆవరణలో ఘటన.. నివ్వెరపోయిన న్యాయవాదులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులకు గంజాయి ప్యాకెట్లు ఇస్తుంటే అడ్డుకున్నారని పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి చేసిన ఘటన మచిలీపట్నంలో మంగళవారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... నగరంలోని పోతేపల్లి, ఎన్టీఆర్ కాలనీ, రాజుపేట, ఉల్లింగిపాలెం, చిలకలపూడి, నవీన్‌మిట్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న వర్ధన్‌కుమార్, జగదీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్నారు. అయితే వీరితో పాటు గంజాయి విక్రయించే గుడివాడకు చెందిన కిరణ్, ఆర్‌పేటకు చెందిన బాకీచరణ్ కోర్టుకు వెళ్తున్న నిందితులకు గంజాయి పొట్లాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీన్ని పోలీసులు అడ్డుకుని వారించారు. దీంతో గంజాయి మత్తులో ఉన్న కిరణ్, బాకీ చరణ్ ముగ్గురు పోలీసులపై దాడికి దిగారు. సమాచారం అందుకున్న చిలకలపూడి సీఐ నబి వెంటనే సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని కిరణ్, బాకీ చరణ్‌లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు. కోర్టు ఆవరణలో పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి చేయడం చూసిన న్యాయవాదులు, కక్షిదారులు ముక్కున వేలేసుకున్నారు.

విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు పునరుద్ధరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వరదల కారణంగా పలు చోట్ల ముంపునకు గురైన విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పునరుద్ధరణ పనులను కాంట్రాక్టు సంస్థ మేఘా చేపట్టింది. బుడమేరు వరద కారణంగా గొల్లపూడి నుంచి సూరంపల్లి వరకు విజయవాడ వెస్ట్ బైపాస్ వరదలో చిక్కుకుంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు భారీగా నష్టం జరగలేదు.. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి కాంట్రాక్టు సంస్థ మేఘా ముందుగానే ఇన్సూరెన్స్ చేయించటం వల్ల చిన్నపాటి డ్యామేజీలకు ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చాయి. దీంతో దెబ్బతిన్న ప్రాంతాలలో కాంట్రాక్టు సంస్థ పునరుద్ధరణ పనులు చేపడుతోంది.

నకిలీ అఘోరాలు, సన్యాసులు, పీఠాధిపతులపై కేసులు పెట్టాలి

గోవిందానంద సరస్వతీ స్వామీజీ
రాష్ట్రంలో 5 రోజుల పాటు సంచార యాత్ర
గన్నవరంలో మీడియాతో మాట్లాడిన స్వామీజీ
8లో



పోలీస్ లాక్!




ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలో 33 వేల రిక్వెస్టుల నమోదు

వాచ్ రిక్వెస్ట్ పెడితే చాలు ఇంటిపై వారం రోజుల పాటు నిరంతర నిఘా

కమిషనరేట్‌కు 100 సీసీ కెమెరాలు

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చెక్ పెట్టారు. దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 33వేల మంది ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో రిజిస్టర్ అయ్యారు. ఇంటి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఒక రోజు ముందుగా పోలీసులకు వాచ్ రిక్వెస్ట్ పెడితే చాలు వారం రోజుల పాటు ఆ ఇంటిపై నిరంతర నిఘా కొనసాగుతోంది. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రత్యేక కథనం. 8

42 మందిపై రౌడీ షీట్!



కమిషనరేట్‌లో కొత్తగా తెరిచేందుకు రంగం సిద్ధం

పూర్తికావచ్చిన పోలీసుల ప్రణాళిక

ఎక్కువ మంది గంజాయి కేసుల్లో నిందితులే..

పోలీసు కమిషనరేట్ రికార్డుల్లోకి కొత్త రౌడీ షీటర్లు ఎక్కబోతున్నారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 42 మందిపై రౌడీషీట్లు తెరవడానికి పోలీసు అధికారులు రంగం సిద్ధం చేశారు. వాళ్లంతా గంజాయి కేసుల్లో ఇరుక్కున్న వారే కావడం గమనార్హం. వరుసగా గంజాయి కేసుల్లో చిక్కిన వారిపై షీట్లు తెరవాలని అధికారులు నిర్ణయించారు. గంజాయితో రెండుకు మించి కేసుల్లో ఉన్న నిందితులపై రౌడీషీట్ తెరవడానికి ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఈ నిందితుల జాబితాను సిద్ధం చేశారు. త్వరలో వారి మెడలో రౌడీషీట్ బోర్డులు వేలాడబోతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) నగరంలో అసాంఘిక, నేర కార్యకలాపాల్లో పాల్గొన్న వారిని రౌడీ, కేడీ, సస్పెక్ట్ షీటర్లుగా విభజించారు. ఈ మూడు కేటగిరిల్లో మొత్తం 400 మంది వరకు షీటర్లు ఉన్నారు. వారిలో తీవ్రమైన నేరచరిత్ర ఉన్న వారిని నగరం నుంచి బహిష్కరిస్తున్నారు. కొంతమంది జైళ్లలో ఉన్నారు. ఇంకొంతమంది పొరుగు జిల్లాల్లో ఉంటున్నారు. నగరంలో ఉన్న రౌడీషీటర్లు పగలంతా ఏదో ఒక పని చేసుకుంటున్నట్టు కనిపిస్తున్నా చీకటి వ్యవహారాలు మాత్రం చక్కబెడుతున్నారని పోలీసులు గుర్తించారు. ప్రతి ఆదివారం ఈ షీటర్లందరికి టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా కొంతమంది షీటర్ల కాలు కుదురుగా ఉండడం లేదు. ఇలాంటి వారికి బీట్ నిఘా ఒక్కటే సరిపోదని అధికారులు భావిస్తున్నారు. రాత్రిపూట బీట్ నిర్వహించే పోలీసులు వారి పరిధిలోని షీటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారు. వారు ఇంట్లో ఉన్నారా మిగతా 6లో..

అన్నదాతకు తుఫాన్ ముప్పు


తోట్లవల్లూరు మండలంలో ఆరబెట్టిన ధాన్యం

రానున్న 4 రోజులపాటు కోస్తాతీరంలో భారీ వర్షాలు

పొలాల్లోని ధాన్యం కాపాడుకునేందుకు రైతుల తంటాలు

- ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో ఉంచడంలేదని ఫిర్యాదు

కంకిపాడు మండలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, గన్నవరం, తోట్లవల్లూరు, మొవ్వ, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గుడ్లవల్లేరు తదితర మండలాల్లో వరికోతలు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు వరికోతలను వాయిదా వేయాలని రైతులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను అలానే ఉంచితే, వర్షం కురిస్తే పైరు నేలవాలిపోతుందని, దీంతో మరింతగా నష్టపోతామనే భయంతో రైతులు ఉన్నారు. అందుబాటులో ఉన్న యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేస్తున్నారు తుపాను హెచ్చరికల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో వరికోతలను రైతులు నిలిపివేశారు. కోతపూర్తయిన అనంతరం, పొలంలో ఉన్న ధాన్యంను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో రైతులు ఉన్నారు. గత వారంరోజుల వ్యవధిలోనే 25 వేల హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. యంత్రాల ద్వారా వరికోతలు కోయించి ధాన్యం రహదారులపైకి, ఖాళీ జాగాల్లోకి తరలించి రాశులుగా పోసి పరదాలు, టార్పాలిన్‌లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రహదారులకు, డొంక రోడ్లకు దూరంగా ఉన్న పొలాల్లోని కొంతధాన్యం పొలాల్లోనే ఉంది. రైతుసేవాకేంద్రాలకు వెళితే సంచులు, వాహనాలు అందుబాటులో లేవని చెబుతున్నారని, మధ్యవర్తులకు ధాన్యం తక్కువ ధరకే విక్రయిస్తామని చెబితే మొవ్వ మండలంలో అప్పటికప్పుడు సంచులు, వాహనాలు సిద్ధంగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు.

భారీవర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బుధవారం నాటికి తుపాన్‌గా మారుతుందని, దీని ప్రభావంతో కోస్తాతీరం వెంబడి పలు ప్రాంతాల్లో ఏడు సెంటీమీటర్ల వరకు వర్షం కురవనుంది. 28, 29, 30 తేదీల్లో 12 సెంటీమీటర్లు, డిసెంబరు 1వ తేదీన ఒకమోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని కూడా హెచ్చరించింది.

మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలన

కంకిపాడు మండలం కోలవెన్ను, దావులూరు తదితర గ్రామాల్లో మంగళవారం పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలులో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు, ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాలు అందుబాటులో ఉండటం లేదని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. మధ్యవర్తులు బస్తా ధాన్యం రూ.1,350 నుంచి 1400లకే కొనుగోలు చేస్తున్నారని, ఈ ధరకు ధాన్యం విక్రయిస్తే తమకు బస్తాకు రూ. 325 నుంచి 350 వరకు నష్టం వస్తోందని వివరించారు. రైతులకు మిగిలే నగదు ఈ రూపంలో వదులుకోవాల్సి వస్తోందని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. వర్షం కారణంగా వరికోతలు ఆలస్యంగా కోస్తే బియ్యంలో నూకశాతం పెరుగుతుందని, ఈ తరహా ధాన్యం భవిష్యత్తులోనూ మద్దతు ధరకే కొనుగోలు చేయాలని యుగంధర్ అనే రైతు విజ్ఞప్తి చేశారు.

48 గంటల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొంటాం : మంత్రి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 48 గంటల వ్యవధిలో జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాశాఖ అధికారులను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 4.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 24 గంటలు, 48 గంటల వ్యవధిలోనే రైతులకు ధాన్యం నగదును జమచేస్తున్నట్లు వివరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తెలియజేసేందుకు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయంలో 82476 93551 నంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జేసీ గీతాంజలిశర్మ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తుందని పేర్కొన్నారు.

కేడీసీసీబీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం

కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు ప్రదానం

మచిలీపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సహకార రంగంలో అత్యుత్తమ సేవలు అందించిందుకుగాను కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్(కేడీసీసీబీ) భారతదేశంలో రెండోస్థానంలో నిలిచింది. ఐసీఏ ప్రపంచ సహకార రంగాల సదస్సు-2024 కార్యక్రమంలో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ అవార్డును ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్రహోంశాఖ, సహకార శాఖల మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా కేడీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, కృష్ణాజిల్లా జేసీ గీతాంజలిశర్మ, కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్ అందుకున్నారు.


అమిత్‌షా నుంచి అవార్డును అందుకుంటున్న జేసీ గీతాంజలిశర్మ, కేడీసీసీబీ సీఈవో శ్యామ్ మనోహర్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దస్త్రాల పరిష్కారంలో అలసత్వం వద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దస్త్రాల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శక సేవలందించడంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఫైళ్ల పరిష్కారంలో ఇబ్బందులు వుంటే తన దృష్టికి తీసుకురావాలని, తన పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని, ఒకవేళ ఏమైనా అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వుంటే వెంటనే ఆ పనిచేయనున్నట్లు వివరించారు. ఈ విషయంలో సమిష్టి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కీలక జిల్లా అని వివిధ రాష్ట్రస్థాయి కార్యక్రమాలు ఇక్కడ జరుగుతుంటాయని, వీటిని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములవుతూనే మరోవైపు రోజువారీ అధికారిక విధుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.


కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

జిల్లా అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో ప్రజలకు పారదర్శకమైన సేవలందించి జిల్లాను అభివృద్ధిలో నిలిపేందుకు కృషి చేద్దామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గసభ్యులు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో నేతలు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, బీవీ రమణ, నాగేంద్రరావు, సీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైతుల సమస్యలు వింటున్న తహసీల్దారు శివయ్య

విమానాశ్రయ విస్తరణలో రైతులకు ప్లాట్లు

గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ విస్తరణలో 12 సెంట్లలోపు భూమి మిగిలిపోయిన రైతులకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కేవీ శివయ్య మాట్లాడుతూ, 7.90 ఎకరాల్లో 12 సెంట్లలోపు భూమి మిగిలిన రైతులు 103 మంది ఉన్నారని, 12సెంట్లు పైన ఉంటే ప్లాట్లు కేటాయిస్తారని, తక్కువ ఉంటే ఇద్దరు కలిసి రాసుకుని ప్లాట్లు పొందాలని చెప్పారు. జీవో నెంబర్ 190 ప్రకారం ఆప్షన్స్ ఉన్నాయని, వాటిల్లో ఏదో ఒకటి ఉంచుకుని లబ్ధి పొందాలని సూచించారు. టీడీఆర్ బాండ్స్ ఇవ్వడానికి సీఆర్‌డీఏ ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఇద్దరు ముగ్గురు కలిసి పొందిన ప్లాట్లను వద్దనుకుంటే సీఆర్‌డీఏ అధికారులు వేలం వేస్తారని వచ్చిన నగదును ఆయా రైతులు పంచుకోవచ్చన్నారు. 70 మంది రైతులు వచ్చారని వారిలో కొందరు అంగీకార పత్రాలను ఇస్తామని చెప్పారని కొందరు కొత్త జీవో ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. సీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ డిప్యూటీ తహసీల్దారు శ్రీహరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ. 2 లక్షల చెక్కును అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అమరావతి అభివృద్ధికి రూ. 2 లక్షలు

కంకిపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతి అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు ఏపీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు సాయం అందించేందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ముందుకు రావడం జరిగిందని తెలియజేశారు. అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎంకు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోనపురెడ్డి సుధాకర్ రాజు, నక్క వెంకటరత్నం, పెద్దాపురం శ్రీను, శ్రీరాములు అదోని, కృష్ణా జిల్లా అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ప్రిన్సిపాల్ వెంకటరమణ

ఆటల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం(డిసెంబరు 3) పురస్కరించుకొని మంగళవారం ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో ఆదిత్య బధిర విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ తెలిపారు. పరుగులో బి.మణికంఠ, క్యారమ్స్‌లో నిత్యానందకుమార్ ప్రథమ స్థానం, ఎ.అఖిల, బి.కుసుమ, ఎ.ఏసుబాబు ద్వితీయస్థానం, డిస్కత్రోలో బి.హర్షిణి, ఎ.నరసింగ తృతీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

» భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకత ఉందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. చిలకలపూడి


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బాలాజీ, డీఆర్వో చంద్రశేఖర్ తదితరులు

మునిసిపల్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి డీఈవో పీవీజీ రామారావు, డీవైఈవో శేఖర్‌సింగ్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావుతో పాటు సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఉష, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, కార్యదర్శి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. విన్‌వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్సీఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్సీఎం ఫాదర్ ఎస్.డేవిడ్ రాజు, అరవిందకుమార్, మత్తే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఠికలోని ప్రతి అక్షరం రాజ్యాంగ విశిష్టతను చాటిచెప్పేదే

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమున్నత భారత రాజ్యాంగం చూపిన బాటలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వతంత్ర్య భారతావని అత్యుత్తమ ప్రజాస్వామ్య వ్యవస్థతో సగర్వంగా నిలిపిన రాజ్యాంగాన్ని 1949, నవంబరు 26న ఆమోదించుకోవడం జరిగిందని, దేశ చరిత్రలో అపూర్వమైన ఈ ఘట్టానికి గుర్తుగా ఏటా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని వేడుకగా జరుపుకొంటున్నామని వివరించారు. రాజ్యాంగ పీఠికలోని ప్రతి అక్షరం రాజ్యాంగ విశిష్టతను చాటిచెబుతోందని, ఈ పీఠకలో పొందుపరిచిన లక్ష్యాలు, ఆశయాలు, ఆదర్శాలను తెలుసుకోవడం ద్వారా మనం ఎంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థలో వున్నామనేది స్పష్టమవుతుందన్నారు. బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల బాటలో యువత నడుస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మేమేం పాపం చేశాం!

» రెండు దశాబ్దాలుగా నో ప్రమోషన్స్

» ఆర్టీసీలో అకౌంట్స్ ఉద్యోగుల వెతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పనిచేసే అక్కౌంట్స్ ఉద్యోగులను ఆర్టీసీ యాజమాన్యం చిన్నచూపు చూస్తోంది. అందరితో పాటు పనిచేసే అక్కౌంట్స్ సిబ్బందికి పదోన్నతులు లేకుండా చేయటం వారికి తీరని అన్యాయం చేయటమే అవుతోంది. అన్ని విభాగాల్లో ప్రమోషన్లు కల్పిస్తున్నా.. అక్కౌంట్స్ విభాగంలో కల్పించ కపోవటం వారిని తీవ్రంగా బాధిస్తోంది. డిపో మేనేజర్లకు ఆరేళ్లలో పదోన్నతులు వస్తుంటే అక్కౌంట్స్ అధికారులకు మాత్రం 19 సంవత్సరాలు దాటినా పదోన్నతులు వరించటం లేదు. రెండు దశాబ్దాలకు పైగా పదోన్నతులకు నోచని అక్కౌంట్స్ విభాగం అధికారులు దురదృష్టవంతులే. ఆర్టీసీ అక్కౌంట్స్ విభాగంలో సిబ్బంది కుదింపులో భాగంగా నాటి ఎండీ సురేంద్రబాబు కొన్ని సంస్కరణలు చేపట్టారు. ఈ సంస్కరణల ఫలితంగా అక్కౌంట్స్ అధికారులు గణనీయంగా తగ్గిపోయారు. ప్రస్తుతం డిప్యూటీ సీఏవో అధికారులు ఐదుగురు, అక్కౌంట్స్ ఆఫీసర్స్ ఏడుగురు కలిపి 12మంది ఉన్నారు. అక్కౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న వారంతా ఎంతో కష్టపడి సీఏ చదివి వచ్చిన వారే. ఆర్టీసీలో అక్కౌంట్స్ విభాగంలో పనిచేయాలంటే సీఏ, సీఎంఏ వంటి విద్యార్హతలు ఉండాలి. తమ బాధను అర్థం చేసుకోవాలని తమకు కూడా ప్రమోషన్లు కల్పించాలని ఎప్పటి నుంచో యాజమాన్యానికి మొరపెట్టుకుంటున్నా వినటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆర్టీసీలో ఇన్‌చార్జిల పేరుతో అనధికారికంగా పదోన్నతులు కల్పించారు. అక్కౌంట్స్ విభాగాన్ని మాత్రం పక్కన పెట్టేశారు. తాము చేసుకున్న పాపమేమిటని వీరు ప్రశ్నిస్తున్నారు. అక్కౌంట్స్ సిబ్బంది ఎక్కువగా ఉన్నారనుకుంటే.. కార్గో విభాగంలో వారి సేవలను వినియోగించుకోవచ్చు. కార్గో విభాగంలో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటం వల్ల అస్తవ్యస్తంగా తయారౌతోంది. ఈ దిశగా యాజమాన్యం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దేవస్థానం చెరువు సర్వే

మోపిదేవి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధీనంలో ఉన్న కోనేరు చెరువు, కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన నరేష్‌కు చెందిన స్థలానికి వివాదం ఏర్పడిన నేపథ్యంలో సర్వే మంగళవారం నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే బి.లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం సర్వే చేపట్టారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించటం జరుగుతుందని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే తెలిపారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సర్వేయర్ ఎం.రామకృష్ణ ఉన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపకల్పన

కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను సాఫీగా, విజయవంతంగా పూర్తిచేయాలంటే ఓటర్ల జాబితా దోషరహితంగా వుండాలని, ఈ నేపథ్యంలో జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ఎం.ఎం.నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎం.ఎం.నాయక్, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2025పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, స్వచ్ఛీకరణపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా రూపొందించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొంటూ పనిచేయాలని సూచించారు. ఈనెల 28వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు వుందని, వీటిని డిసెంబరు 24లోగా పరిష్కరించి జనవరి 6న తుది జాబితా ప్రచురించాల్సి వుంటుందన్నారు. అర్హులైన వారిని కొత్తగా ఓటరుగా నమోదు చేసుకొనేలా ప్రోత్సహించాలని, ముఖ్యంగా 18-19 వయస్సు వారిపై దృష్టిసారించి, నమోదుకు కృషి చేయాలన్నారు. ఇందుకు కళాశాలల్లోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను క్రియాశీలం చేయాలన్నారు. అదేవిధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పక్షాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర ఫారాలపైనా అవగాహన పెంపొందించాలన్నారు. జనాభాలో ఓటర్ల నిష్పత్తి, స్త్రీ-పురుష ఓటర్ల లింగ నిష్పత్తి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లాజికల్, డెమోగ్రాఫికల్ దోషాలు వుంటే చక్కదిద్దాలన్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియకు సంబంధించి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ర్యాండమ్‌గా సూపర్ చెక్ చేయాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం ఎస్ఎస్ఆర్-2025కు సంబంధించిన అంశాలను వివరించారు. 2024, అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 17,04,611 మంది ఓటర్లు వున్నారని తెలిపారు. ఈపీ రేషియో 703గా, జెండర్ రేషియో 1052గా వుందన్నారు. నవంబరు 9, 10 తేదీలతో పాటు నవంబరు 23, 24 తేదీల్లోను క్లెయిమ్‌లు, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. దరఖాస్తులను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిష్కరించి తుది జాబితా ప్రచురణకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. తిరువూరు ఈఆర్వో కె.మాధురి, విజయవాడ తూర్పు ఈఆర్వో కె.చైతన్య, నందిగామ ఈఆర్వో కె.బాలకృష్ణ, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు నాయక్


యువసంగం కోసం యూపీకి పయనమైన విద్యార్థులు

యువసంగం కోసం యూపీకి ఏపీ విద్యార్థులు

పెనమలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువసంగం-2024లో భాగంగా ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి ఎంపికైన 42 మంది విద్యార్థుల బృందం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి ఉత్తర ప్రదేశ్‌కు వెళుతూ కానూరు కామయ్యతోపు వరకు బస్సు యాత్ర నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లక్ష్యానికి అనుగుణంగా యువతలో సాంస్కృతిక ఐక్యత, సహకారాన్ని ప్రోత్సహించడం, రాష్ట్రాల మధ్య జాతీయ ఐక్యత, అవగాహన భావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుందని డైరెక్టర్ రమేష్ శ్రీకొండ తెలిపారు. కార్యక్రమం ఏపీ, యూపీల మధ్య సాంస్కృతిక మార్పిడిని సులభతరం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, డీన్ వెంకట కృష్ణకుమార్ సాధు, భగవత్ జయేష్‌కుమార్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

» కాసరబాదలో గ్రామస్థుల ఆందోళన

చందర్లపాడు, నవంబరు 26 : అధిక లోడుతో వెళ్తున్న టిప్పరు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కాలుకి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో కాసరబాద గ్రామంలో మంగళవారం జరిగింది. రీచ్ నుంచి ఇసుక నింపుకున్న టిప్పర్ పొక్కునూరు మీదగా నందిగామకు బయల్దేరి కాసరబాదలోని హనుమాన్ విగ్రహం సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో మోపెడ్ నడుపుతున్న నంద్యాల రామిరెడ్డి ఎడమకాలు నుజ్జు అయింది.

రైతులు, గ్రామస్థుల ఆందోళన

ఇసుక టిప్పరు ఢీకొని గ్రామస్థుడికి తీవ్రగాయాలు కావటంతో రైతులు ఆగ్రహం కట్టలు తెంచుకుని ఆందోళనకు దిగారు. టిప్పర్‌ను రోడ్డుపై నిలిపివేసి క్షతగాత్రుడికి న్యాయం చేయాలని బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోని అధికారులు వచ్చి సమాధానం ఇచ్చేవరకు ఆందోళన విరవించేది లేదని భీష్మించారు. రైతులు ఆందోళనతో రీచ్‌లో పొక్లెయిన్లు, టిప్పర్లను తప్పించడంతోపాటు సిబ్బంది పత్తా లేకుండా పోయారు.


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు, గ్రామస్థులు, నెత్తురోడుతున్న కాలుతో రైతు

పెన్షనర్ల కమ్యుటేషన్ పోర్షన్ రికవరీ నిలుపుదల అభినందనీయం

» సీఎంకు బొప్పరాజు కృతజ్ఞతలు

వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమ్యుటేషన్ రికవరీని 15 సంవత్సరాలకు బదులు 11 సంవత్సరాల 3 నెలల వరకు మాత్రమే చేయాలని ప్రభుత్వం ఆదేశించటం పట్ల అమరావతి జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి. శాస్త్రి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి వివి మురళీకృష్ణ నాయుడు, అమరావతి జేఏసీ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే రికవరీ చేసిన అదనపు మొత్తాలను తిరిగి చెల్లించాలని కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు అయిందని నాయకులు తెలిపారు. ఇతర రాష్ట్రాలలో రికవరీ నిలుపుదల చేశారని, ఇప్పుడు మన రాష్ట్రంలో కూడా రికవరీ చేయకూడదంటూ ఉత్తర్వులు రావటం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

42 మందిపై రౌడీ షీట్!

(5వ పేజీ తరువాయి)

లేదా అని చూస్తారు. ఇంట్లో ఉంటే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

రౌడీషీటర్ల డేటా అప్‌డేట్

తాజాగా రౌడీషీటర్ల డేటాను అప్‌డేట్ చేస్తున్నారు. షీటర్లు ఉపయోగిస్తున్న అన్ని ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. వాటితోపాటు ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు, బ్యాంక్ ఖాతా నంబర్లతో చిరునామాకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను తీసుకుంటున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారు ఇళ్లు మారినప్పుడల్లా చిరునామాను కచ్చితంగా టాస్క్‌ఫోర్స్‌కు, స్థానిక పోలీసు స్టేషన్‌కు ఇవ్వాలి. ఒకవేళ ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినా అక్కడ చిరునామాను ఇక్కడ కచ్చితంగా ఇచ్చితీరాలి. పగలంతా ఇళ్లల్లోనో, పనుల్లోనో ఉండి నగరం నిద్రపోతున్న వేళల్లో చక్కర్లు కొట్టేవారితోపాటు బహిష్కరణలో ఉండి రహస్యంగా నగరంలో అడుగుపెడుతున్న వారి కాళ్లకు ఈ బీట్ విధానం ద్వారా బంధాలు వేస్తున్నారు.

ఫేసియల్ రికగ్నైజేషన్ సీసీ కెమెరాలతో గుర్తింపు

విజయవాడలో మొత్తం 800 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇందులో కొన్ని చోట్ల ఫేసియల్ రికగ్నైజేషన్ సీసీ కెమెరాలు ఉన్నాయి. అర్ధరాత్రి నగరంలో తిరుగుతున్న రౌడీషీటర్లు గానీ, నగర బహిష్కరణలో ఉండి విజయవాడలో వచ్చిన వారిని ఈ ఫేసియల్ రికగ్నైజేషన్ కెమెరాలు గుర్తించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. షీటర్ల ముఖం కెమెరాకు చిక్కగానే ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న స్ర్కీన్లపై అలర్ట్ మేసేజ్ కనిపిస్తుంది. రౌడీషీటర్ ఫొటో, అతడి పేరు వస్తుంది. అతడు ఏ మార్గం నుంచి ఏ మార్గంలోకి వెళ్తున్నాడో చూపిస్తుంది. ఈవిధంగా షీటర్లను సాంకేతికంగా కట్టడి చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

మంగళగిరి ఆలయానికి మహర్దశ

» శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి ప్రణాళికలు

» ప్రత్యేకంగా దృష్టిపెట్టిన మంత్రి లోకేశ్

» కమిటీ ఏర్పాటు.. నెలాఖరుకు నివేదిక

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహావిష్ణువు అష్టమహా క్షేత్రాల్లో ఒకటైన మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి పరిధిలో ఉన్న ప్రముఖ ఆలయాల్లో ఈ రెండు ఆలయాలే ప్రధానం. దీంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలు రచిస్తోంది. లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అహోబిలం, అంతర్వేది తర్వాత మంగళగిరి ఆలయానికి విశేష ప్రాముఖ్యత ఉంది. రోజూ నాలుగైదు వేల మంది భక్తులు దర్శనాలకు వస్తున్నారు. దర్శనాలు ఆలస్యం కావడంతో పాటు కొండపై రద్దీ పెరిగిపోతుంటుంది. మరోవైపు కొండపైన భక్తులు వేచి ఉండేందుకు తగినంత వసతి సదుపాయంలేదు. కొండపైకి వెళ్లేందుకు, కిందకి వచ్చేందుకు ఒకే ఘాట్ రోడ్ ఉండగా, ఇప్పటికే కొంత ఘాట్ రోడ్డును స్థానికులు అక్రమించుకోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతోంది. దీంతో, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ రెండు ఆలయాలనూ అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో ఆయన చర్చలు జరిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి 10 నుంచి 20 వేల మంది భక్తులు వచ్చినా నిమిషాల వ్యవధిలో దర్శనమయ్యేలా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతోపాటు, కొండ కింద భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేక కాంప్లెక్స్‌తో పాటు అవసరమైతే, ఆలయ పరిధిలో గదులు కూడా నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, కొండపైన ఉన్న పానకాల నరసింహస్వామి ఆలయంలో కూడా పదివేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయంలో మార్పులు చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. కొండపైనా భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు.

నిపుణుల కమిటీ ఏర్పాటు

ఆలయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు దేవదాయ శాఖ ప్రత్యేకంగా నిపుణుల కమిటీని నియమించింది. ఆలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది? ప్రస్తుతం ఎలాంటి అసౌకర్యాలున్నాయి? భవిష్యత్తులో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఏం చేయాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. కమిటీలో దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్, దేవదాయశాఖ స్థపతి, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవోలు ఉన్నారు. ఈ కమిటీ ఈ నెలాఖరు నాటికి దేవదాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంది. కమిటీ నివేదిక ఆధారంగా ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

గన్నీలతో ఎత్తేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఆ డాన్ తన చేతుల్లో ఒకవైపు సివిల్ సప్లయిస్ అధికారులు, మరో వైపు విజిలెన్స్ అధికారులు ఉన్నారు. తనను కాదని మరొకరికి విక్రయిస్తే ఆ షాపులపైనే తనిఖీలు జరుగుతాయి. వారి అక్రమ బియ్యంపైనే రైడింగ్‌లు జరుగుతాయి. దీంతో డీలర్లంతా ఏకంగా గన్నీ బ్యాగులతోనే ఆ అక్రమ బియ్యం వ్యాపారికి అందించేస్తున్నారు. విజిలెన్స్ అధికారుల అండదండలతో గన్నీ బ్యాగులతో ఉన్న బియ్యం బస్తాలు మిల్లులకు, ముంబాయికి తరలిపోతున్నాయి. గన్నీ బ్యాగులతో కూడిన బియ్యం బస్తాలు మంగళగిరి, పెదవడ్లపూడి, గుంటూరు బైపాస్‌లోని రేషన్ మిల్లులకు పెద్ద ఎత్తున వెళుతున్నాయి. ఈ విషయం విజిలెన్స్ అధికారులకు కూడా తెలుసు. కానీ అక్రమ బియ్యం వ్యాపారులతో ఉన్న సంబంధాల కారణంగా పట్టించుకోవటం లేదు.

రేషన్ మాఫియా తెలివితేటలు

తనిఖీలలో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసే సందర్భంలో అధికారులు ఆ బియ్యం ఎవరి నుంచి సేకరించారు అని లోతుగా విచారిస్తే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో పాటు బియ్యం అమ్ముకున్న కార్డుదారులు కూడా బయటకువస్తారు. పట్టుకున్న బియ్యం రేషన్ బియ్యమే అన్న దానికి ఆధారాలు లభిస్తాయి. కానీ అక్రమ బియ్యం పట్టుకున్న సందర్భాలలో ఈ పని మాత్రం సివిల్ సప్లయిస్ అధికారులు చేయడం లేదు. దీంతో సీజ్ చేసిన తర్వాత అక్రమ బియ్యం వ్యాపారులు కోర్టుకు వెళుతున్నారు. అసలు ఇవి రేషన్ బియ్యం కాదని వాదిస్తున్నారు. కోర్టులలో అవి రేషన్ బియ్యమేనని సివిల్ సప్లయిస్ అధికారులు చెప్పలేకపోతున్నారు. దీంతో సివిల్ సప్లయిస్ అధికారుల వాదనలు పనిచేయటం లేదు. అక్రమ బియ్యం వ్యాపారులకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. సీజ్ చేసిన బియ్యాన్ని బ్యాంకు పూచీకత్తుతో వెంటనే విడుదల చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత దర్జాగా ఈ బియ్యాన్ని అక్రమార్కులు సరిహద్దులు దాటించేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 595

స్టెల్లాలో మిస్ రెట్రోషో

పటమట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ మారిస్ స్టెల్లా కళాశాలలో మిస్ రెట్రోషో, ఫ్లవర్ ఎరేంజ్‌మెంట్ షోలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు నలుపు, తెలుపు రంగు వస్త్రధారణతో ర్యాంపుపై నడుస్తూ వయ్యారాలు ఒలికించారు. పూల అలంకరణ పోటీల్లో విద్యార్థినులు పుష్పాలతో నెమలి, పలు రకాల పక్షులను అందంగా తీర్చిదిద్దారు. పూల అలంకరణ పోటీలకు డాక్టర్ వాణి, లత, స్వప్న వున్నంలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బ్యూలా, శిరీష, హేమశ్రీ, పద్మజ, శ్వేత, మల్లేశ్వరిలు పాల్గొన్నారు.

బెంజిసర్కిల్ వద్ద యాంటీ లార్వా ఆపరేషన్

పటమట,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలనలో భాగంగా నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ఆదేశాల మేరకు మలేరియా సిబ్బంది బెంజిసర్కిల్ పరిసరాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. నారా చంద్రబాబునాయుడు కాలనీలో సైడ్ డ్రెయిన్లలో మందులు పిచికారీ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా సిబ్బంది మురుగు కాల్వలో ఫాగింగ్ చేశారు.

గుర్తుతెలియని మృతదేహం

గుణదల,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లుగా గుణదల పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం బీఆర్టీఎస్ రోడ్డులో బ్లూడార్ట్ బిల్డింగ్ సెల్లార్లో లిఫ్ట్ నిర్మాణం కోసం వదిలిన సంపులో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్లుగా స్థానికులు సమాచారం అందించారు. సమాచారం మేరకు గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి మార్చురీకి తరలించారు. స్థానికులు ఎవరూ మృతుడిని గుర్తించలేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లుగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో వి.శ్రీనివాసరావు

గుణదల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని యువత పరిరక్షించాలని, రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు భారత రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కళాశాల నుంచి చుట్టుగుంట వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకిక రాజ్యం లాంటివి అనేక అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రాజ్యాంగాన్ని విధిగా గౌరవించి దేశ ప్రగతికి దోహదపడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, పౌరశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి: ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ బాబు జ్యోతి వెలిగించి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




అంబేద్కర్ కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో వి.శ్రీనివాసరావు, ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జ్యోతి వెలిగిస్తున్న సిద్ధార్థ లా కాలేజ్ ప్రిన్సిపాల్ దివాకర్ బాబు

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్య కిషోర్, డాక్టర్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం: స్థానిక జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో రాజ్యంగ దినోత్సవ కార్యక్రమం సంస్థ ఛైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీపీ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో అమలవుతున్న ఆయా దేశాల రాజ్యాంగాలన్నింటి కంటే మన భారత దేశ రాజ్యాంగం అతిపెద్దదని, బలమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ, సంస్థ సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్

బెజవాడ బార్‌లో ..

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో మంగళవారం భారత జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో ఆదివాసులకు, మహిళలకు, దళితులకు, బహుజనులకు రాజ్యాంగబద్ధంగా సమన్యాయం జరగాలని అన్నారు. బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా) మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల విషయమై బెజవాడ బార్ అసోసియేషన్ తరఫున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. రెండో అదనపు జిల్లా జడ్జి సత్యానంద్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వి.గురునాథం, నరహరిశెట్టి నర్సింహారావు, నామాల కోటేశ్వరరావు, ఎ.కె.బాష, జయలక్ష్మి, క్లాడియా చక్రవర్తి, బార్ కార్యవర్గ సభ్యులు కలతోటి క్రాంతి కుమార్, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



- ఐదవ నెంబరు రోడ్లో ఐటీఐ బస్టాప్ వద్ద చిరువ్యాపారులు సాయంత్రం రోడ్డు ఆక్రమించి బల్లలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.
  -రంగరావు (స్థానికుడు)
- రోడ్డు పక్కన ఆక్రమణలకు పాల్పడిన, ప్రజల జీవన విధానానికి ఇబ్బంది కలిగించే వాటిని వెంటనే తొలగిస్తాం.
  - బి.మోహన్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరం సందర్శన

భారతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఆంధ్రా లయోలా కళాశాల ప్రాంగణం ఎస్-జె కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ట్రైనింగ్) శిక్షా శిబిరాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, సమగ్రశిక్షా శాఖ ఏపీసీ జి. మహేశ్వరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానాణ్యతను పెంచడమే ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ లక్ష్యమని, ఇది క్షేత్ర స్థాయిలో అమలవుతుందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 160 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు.

మహిళలను గౌరవించాలి

మొగల్రాజపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో మహిళలను గౌరవించడం అనేది మన రక్తంలోనే ఉందని, కానీ ఇటీవల సమాజంలో మహిళల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయని డాక్టర్ చందన, డాక్టర్ సుజన ఆవేదన వ్యక్తం చేశారు. ధీర సంస్థ ఆధ్వర్యంలో వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ ఇంట్లో అమ్మ, అక్క, చెల్లిని ఎలా గౌరవిస్తామో అదే విధంగా పరాయి స్త్రీలను కూడా గౌరవించాలని సూచించారు. చుట్టుపక్కల ఎవరైనా అపాయంలో ఉంటే వెంటనే స్పందించి తగిన సహాయం అందించడం, 100, 1098 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలంటే మంచి క్రమశిక్షణ, మర్యాద, వినయం అలవరచుకోవాలని చెప్పారు.

సాంకేతిక సహాయంతో ఫోను గుర్తింపు

ఆటోనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సహాయంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితురాలికి అందజేసినట్లు సీఐ వల్లభనేని పవన్ కిషోర్ తెలిపారు. ఈనెల 3న బెంజిసర్కిల్ సమీపంలో రూ.25వేల ఫోన్‌ను స్టెల్లా కాలేజీ స్టూడెంట్ దమరసింగ్ రుతు పోగొట్టుకుంది. పటమట స్టేషన్లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి ఫోనును గుర్తించామని ఆయన వెల్లడించారు.



మాట్లాడుతున్న ఎస్వీ రాజశేఖరబాబు

అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్

- పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

లబ్బీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వివిధ రకాల సైబర్ నేరాలు జరుగుతున్నాయని, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనేది తమ ప్రధాన ఉద్దేశం అని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోలీసు కమిషనరేట్ పరిధిలో డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలను అరికట్టి ప్రజలందరినీ సైబర్ సిటిజన్స్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో బృహత్తర ప్రణాళికను సిద్ధం చేయడంతో పాటు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమకు తెలిసిన విషయా లను కుటుంబసభ్యులకు, స్నేహితులకు వివరించి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, క్రైమ్ డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, మహేశ్వరరాజు, కృష్ణమూర్తి, రామకృష్ణ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి పాల్గొన్నారు.

లారీలు, భారీ వాహనాల ప్రవేశానికి అనుమతి

పటమట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహానాడు జంక్షన్ నుంచి ఆటోనగర్‌లోకి లారీలు, భారీ వాహనాలకు అనుమతి ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. మహానాడు రోడ్డు జంక్షన్ నుంచి ఆటోనగర్‌లోకి లారీలు, భారీ వాహనాల రాకపోకలపై పోలీసులు విధించిన ఆంక్షలను తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చొరవతో పరిష్కారం అయ్యింది. ది విజయవాడ నోటిఫైడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ పాటుగా ఆటోనగర్‌లోని వివిధ సంఘాల సభ్యులు, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, సీఐలు రామారావు, కిషోర్, రమేష్‌లతో కలిసి అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే గద్దె కార్యాలయంలో మంగళవారం చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంపై అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలకు వెళ్లి వచ్చే వారి వలన ట్రాఫిక్ ఎక్కువ ఉండే సమయంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు లారీలకు, భారీ వాహనాలు బయటకు వెళ్లటానికి అనుమతులు లేవన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు లారీలు, భారీ వాహనాలు బయటకు వెళ్లటానికి ట్రాఫిక్ పోలీసులు అనుమతించారని చెప్పారు. నగరంలోని ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా ట్రాఫిక్ పోలీస్ శాఖ, ఆటోనగర్‌లోకి లారీలు, భారీ వాహనాల రాకపోకల కోసం సడలించిన వేళలను లారీ యజమానులకు, డ్రైవర్లకు, ఆటోనగర్‌లోని అన్ని అసోసియేషన్ల ప్రతినిధులకు తెలియజేసి, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులకు సహకరించాల్సిందిగా గద్దె రామ్మోహన్‌రావు కోరారు.

ఎమ్మెల్యే గద్దె చొరవతో మహానాడు ట్రాఫిక్ సమస్య పరిష్కారం



పోలీసు అధికారులు, ఆటోనగర్ వివిధ అసోసియేషన్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె

ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధిపై దృష్టి

ఆటోనగర్‌లోకి భారీ వాహనాలు, లారీలు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండే ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గద్దె రామ్మోహన్ తెలిపారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సీఆర్‌డీఏ కమిషనర్‌తో చర్చించి ఆటోనగర్‌కు అనుసంధాన రోడ్లను సాధ్యమైనంత వరకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్దుల్ కలామ్, కార్యదర్శి కోటేశ్వరరావు, పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరాచారి, కార్యదర్శి ఖాజా, వాడపల్లి శ్రీరాములు, ఆసీఫ్ భాషా, ముమ్మనేని ప్రసాద్, ఈశ్వర్ పేరేపిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

గుణదల: రెండో డివి జన్లో రూ. 85 లక్షల నిధు లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం డివిజన్లో జరుగు తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ దాసరి గాబ్రియేల్, టీడీపీ నాయకులు సొగసాని కృష్ణ ప్రసాద్, ముమ్మనేని ప్రసాద్, మంతెన దుర్గా ప్రసాద్, వెలిశల సురేష్ బాబు, జి.నాగుల్ మీరా, ఎం.నరేంద్ర, శ్రీ కృష్ణ, గద్దె రమేష్, ఈఈ సామ్రాజ్యం పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

మొగల్రాజపురం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రేషన్ డీలర్ల పట్ల చాలా సానుకూలంగా ఉన్నారని, త్వరలో మీ ఆదాయం పెంచడానికి చర్యలు తీసుకోబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. రవిచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.ఎస్. ప్రసాద్, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల విద్యార్థులు, డాక్టర్లు, అధ్యాపకులు

ఆయుర్వేదంపై అవగాహనకు దేశ్ కా ప్రకృతి పరిక్షణ్ అభియాన్-2024

లబ్బీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో దేశ్ కా ప్రకృతి పరిక్షణ్ అభియాన్-2024 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ.డి.డాక్టర్ సాయి సుధాకర్ తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాలలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి డిసెంబరు 25వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని, దేశ్ కా ప్రకృతి పరిక్షణ్ అభియాన్ పేరుతో ఉన్న ప్రత్యేక యాప్‌ను ప్రధాని ప్రారంభించారని తెలిపారు. ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని, ఆయుర్వేద జీవన విధాన పద్ధతులతో ఆరోగ్యవంతులుగా జీవించాలనేదే ముఖ్య ఉద్దేశమని అన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడు ఈ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల విద్యార్థులు నా సంకల్పం నా ఆరోగ్యం దానికి మూలం ఆయుర్వేదం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల జ్యోతి భాయి, కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయకుమారి, విజయశ్రీ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోం

సీపీఐ నాయకులకు దుర్గారావు హెచ్చరిక

రాణిగారితోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్నాలు పేరిట ప్రజలను సీపీఐ నాయకులు మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేమూరి దుర్గారావు విమర్శించారు. డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18వ డివిజన్‌లో సీపీఐ నాయకుల తీరు ఆ పార్టీని నవ్వుల పాలు చేస్తోందని, డివిజన్‌లో టిడ్కో ఇళ్ల విషయమై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నోరు పెదపని సీపీఐ నాయకులు ఇప్పుడు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా సీపీఐ నాయకుల తీరు మారకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తే తాము కూడా సరైన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు.

ఆల్ ఇండియా వర్సిటీ ఆర్చరీకి ప్రియ వైష్ణవి



ప్రియ వైష్ణవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కల్పన

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఆర్చరీ టోర్నీలో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని బి ప్రియవైష్ణవి(బీఏ, ప్రథమ) మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. వచ్చే నెల 24 నుంచి 27 వరకు కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ టోర్నీకి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ మాధవి, ఫిజికల్ డైరెక్టర్ హేమలు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ పుట్ట రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఈనాడు కాలనీ, ఎస్టీపీ హెచ్‌టి పాయింట్, శ్మశానం వీధి నుంచి రామలింగేశ్వర నగర్ కొండ వరకు, కొల్లిపర వారి వీధి, నిమ్మల వారి వీధి, టాగూర్ వీధి, శివగంగ భవానీ వీధి, కొమ్మా పూర్ణచంద్రరావు వీధి, రాయపాటి రమణమ్మ వీధి, రాయపాటి సత్యయ్య వీధి, సాయిబాబా వీధి, పుట్ట రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళానగర్, నలంద స్కూల్ ఏరియా, బందరు రోడ్డు, మున్సిపల్ ఎంప్లాయి కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వీసాల జారీలో జాప్యం తొలగిస్తాం

● అమెరికన్ కాన్సులేట్


విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమెరికా బిజినెస్, టూరిజం వీసాపై అవగాహన సదస్సు మంగళగిరిలోని ఎఫ్ట్రానిక్స్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి యూఎస్ కాన్సులేట్ (హైదరాబాద్) జనరల్ చీఫ్ రెబికా డ్రేమ్, జెన్నీ సొకోలిస్కి డిప్యూటీ కాన్సులర్, సూపర్‌వైజర్ ఐశ్వర్యరావత్‌తో పాటు విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 40మంది ప్రముఖ పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాన్సులేట్ నిర్వహించే సేవలు, వీసా ప్రాసెసింగ్‌ను రెబికా డ్రేమ్ వివరంగా తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియా, అతి పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాల మధ్య ఆర్థిక, సామాజిక సంబంధాలు బాగా అభివృద్ధి చెందాయన్నారు. అమెరికా నుంచి ఇండియాకు వచ్చేవారి సంఖ్య ప్రస్తుతం 300 శాతం అభివృద్ధి ఉందన్నారు. అమెరికా విడుదల చేసే బీ1, బీ2 వీసాల జారీలో జాప్యం జరుగుతోందని వ్యాపార వేత్తలు కాన్సులేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ జాప్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకొంటున్నామని రెబికా డ్రేమ్ తెలిపారు. హైదరాబాద్ కాన్సులేట్ కార్యాలయంలో గత ఏడాది నుంచి సిబ్బందిని పెంచామని, త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. వీసా కోసం ఇచ్చే సమాచారం నిజాయితీ ఉండాలని, అత్యవసర సమయాల్లో శస్త్రచికిత్స చేయించుకునేందుకు తక్కువ రోజుల్లోనే మంజూరు చేస్తామని జెన్నీ సొకోలిస్కి చెప్పారు. ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ చుక్కపల్లి అవినాష్, ఎఫ్ట్రానిక్స్ ఉపాధ్యక్షుడు దాసరి అన్వేష్, ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి దేవిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి త్రివేణి కళ్లు దానం



ఉంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొరపాటున విషాహారం తిని మృతిచెందిన మండలంలోని ఎలుకపాడు గ్రామానికి చెందిన అజ్మీర త్రివేణి (18) రెండు కళ్లను సోమవారం ఆమె తల్లిదండ్రులు విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు దానం చేశారు. పొలంలో చల్లిన విషపు మందు ఆహారపదార్థాలపై పడటంతో గమనించకుండా ఆ ఆహారాన్ని తిన్న త్రివేణి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనపై ఉంగుటూరు పీఎస్‌లో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదైంది. కాగా త్రివేణి నేత్రాలు దానం చేయటంద్వారా మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించవచ్చునని భావించిన కుటుంబసభ్యులు ఆమె రెండు కళ్లను దానం చేశారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని అజిత్ సింగ్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో కలిసి ఊరెళ్లారు. ముందుగా ఆయన ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ద్వారా వాచ్ పోలీసు రిక్వెస్ట్‌ను నమోదు చేసుకున్నారు. పోలీసులు ఇంటికొచ్చి నలువైపులా సీసీ కెమెరాలు అమర్చారు. తర్వాత ఆయన పని ముగించుకుని ఊరు నుంచి అర్ధరాత్రి ఇంటి కొచ్చారు. తలుపు తాళాలు తీసుకుని లోపలకు వెళ్లారు. ఆయన తాళాలు తీస్తుండగానే పోలీసు కంట్రోల్ రూంలో అలారం మోగింది. పోలీసులకు ఎల్‌హెచ్ఎంఎస్ అలర్ట్ వెళ్లింది. వెంటనే పోలీసులు ఇంటిని చుట్టిముట్టారు. లైట్లు వెలిగి ఉండడంతో లోపల నిజంగా దొంగలున్నారేమోనని భావించారు. పోలీసులు తలుపులు కొట్టగా యజమానికి బయటికొచ్చాడు. తానే ఇంటి యజమానినని కొద్దిసేపటి క్రితమే ఊరు నుంచి వచ్చానన్నారు. ఇది కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన.



పోలీస్ లాక్!

● ప్రజల్లో అవగాహనకు సదస్సులు
● కమిషనరేట్‌కు 100 సీసీ కెమెరాలు

ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా 33వేలు రిక్వెస్ట్‌ల నమోదు


ఆంధ్రజ్యోతి, విజయవాడ: డిసెంబరు నెల వస్తోంది. ఆ నెల మూడోవారం నుంచి సెలవులు మూడ్ వస్తుంది. తర్వాత జనవరిలో సంక్రాంతి సెలవులు. ఇలా ప్రముఖ పండగలు వచ్చినప్పుడు సొంతూళ్లకు వెళ్లడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తారు. ఇక వేసవి సెలవుల్లో విహారయాత్రలకు ప్రణాళికలు వేసుకుంటారు. ఇలాంటి సెలవులను ఆసరాగా చేసుకున్న దొంగల ముఠాలు జిల్లాలోకి అడుగుపెడుతున్నాయి. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని వరుస చోరీలు చేస్తున్నారు. సెలవుల్లోనే పోలీసులకు ఎక్కువగా చోరీల ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలా తాళాలు వేసి ఉన్న ఇళ్ల వైపు దొంగలు చూడకుండా పోలీసులు నిఘా నేత్రాలను అమర్చుతున్నారు. ఒకవేళ ఇంటి గోడ దూకి తాళాలు పగలుగొట్టినా టక్కున దొరికిపోతారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న దొంగల ముఠాను పట్టుకోవడానికి ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఉపయోగిస్తున్నారు. దీనిపై జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 33వేల మంది ఎల్‌హెచ్ఎంఎస్‌లో రిజిస్టర్ అయ్యారు. దీన్ని లక్షకు పెంచాలని పోలీసు అధికారులున్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ రిక్వెస్ట్‌లు వచ్చినప్పుడు అమర్చడానికి 100 సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచారు. ఇంటి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఒక రోజు ముందుగా పోలీసులకు వాచ్ రిక్వెస్ట్ పెట్టాలి. వారం వరకు ఇంటికి ఈ-నిఘా ఉంటుంది. సమయానికి రాలేనప్పుడు పోలీసులకు తెలపాలి. అటువంటప్పుడు 10 రోజుల వరకు నిఘా పెడతారు. ఈ సీసీ కెమెరాలను అమర్చడానికి కమిషనరేట్‌లో ప్రత్యేకంగా టెక్నికల్ టీం పనిచేస్తోంది. మొత్తం రెండు బృందాలు ఇదే పనిలో నిమగ్నమై ఉన్నాయి.

ఎలా నమోదు చేసుకోవాలి.?

- గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్ ఓపెన్ కాగానే రిజిస్టర్, రిక్వెస్ట్ ఫర్ పోలీస్ వాచ్, ఫర్‌గాట్ యూజర్ ఐడీ ఒక దాని కింద ఒకటి ఉంటాయి.
- ముందుగా రిజిస్టర్‌ను క్లిక్ చేసి అందులో వివరాలు పూర్తిచేయాలి.
- పేరు, మొబైల్, జిల్లా, నగరం/పట్టణం, ఇంటి నంబరు, చిరునామా పూర్తి చేయాలి
- తర్వాత గెట్ మై కరెంట్ లొకేషన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే అది అక్షాంశ, రేఖాంశాలను ఆటోమెటిక్‌గా తీసుకుంటుంది.
- రిజిస్టర్‌పై క్లిక్‌చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.
- అనంతరం మొబైల్‌కు ఐడీ నంబర్ వస్తుంది.
- దీన్ని యూజర్ ఐడీగా ఉపయోగించుకోవాలి.
- పోలీసు వాచ్‌కు రిక్వెస్ట్ పంపాలనుకున్నప్పుడు ఈ ఐడీ తప్పనిసరిగా నమోదు చేయాలి. (ఉదాహరణకు ఐడీ ఇలా ఉంటుంది. ఏపీ ఎల్‌హెచ్ఎంఎస్ 000000)
- ఒక పాస్‌వర్డ్‌లా భద్రంగా ఉంచుకోవాలి.

నిఘా రిక్వెస్ట్ ఇలా..!

- యాప్ ఓపెన్ చేయగానే రిజిస్టర్‌కి దిగువన రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌పై క్లిక్ చేయాలి.
- ముందుగా యూజర్ ఐడీ ఉన్న కాలమ్‌లో దాన్ని ఎంటర్ చేయాలి.
- స్టార్ట్ డేట్ అని ఉన్న కాలమ్‌లో ఏ రోజు నుంచి ఊరెళ్తున్నారో నమోదు చేయాలి.
- దిగువన స్టార్ట్ టైమ్ అని ఉంటుంది. ఇందులో ఏ సమయానికి ఇంటికి తాళం వేసుకుని వెళ్తున్నారో నమోదు చేయాలి.
- తర్వాత ఎండ్ డేట్ అన్న కాలమ్‌లో ఎప్పటి వరకు ఇంట్లో ఉండరో తేదీ నమోదు చేయాలి.
- అనంతరం ఎండ్ టైమ్ అని ఉన్న చోట ఏ సమయం వరకు ఉండరో తెలిపాలి.
- వివరాలన్నీ నమోదు చేశాక సబ్‌మిట్ వాచ్ రిక్వెస్ట్‌ను క్లిక్ చేయాలి.
- ఈ ప్రక్రియ పూర్తయ్యాక పోలీసు కంట్రోల్ రూం, పోలీస్‌స్టేషన్‌కు అలర్ట్ వెళ్తుంది.
- ఈ అలర్ట్ అందగానే సీసీఎస్‌లోని టెక్నికల్ సిబ్బంది వచ్చి ఇంటిని పరిశీలించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు.
- ఎవరైనా తలుపులు పగలగొట్టినా, ఇంటి ముందు తచ్చాడినా కంట్రోల్ రూం, పోలీస్ స్టేషన్‌కు వెంటనే అలర్ట్ వెళ్తుంది.
- పీసీఆర్‌లోని సిబ్బంది వైర్‌లెస్ సెట్‌లో ఈ సమాచారం చేరవేస్తారు.
- ఆ ఇంటికి సమీపంలోని పెట్రోలింగ్ సిబ్బందితోపాటు పోలీసు స్టేషన్ క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు.



కందిపప్పు, పంచదార సక్రమంగా అందించాలి

● ప్రభుత్వ విప్ బొండా ఉమ


ఎమ్మెల్యే బొండా ఉమను కలిసిన వేదిక నేతలు

మధురానగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడుతున్నా పేదల కోసం సీఎం చంద్రబాబు లెక్కచేయకుండా ఇస్తున్న కందిపప్పు, పంచదార, బియ్యం వంటి నిత్యావసరాలను ఎండీయూలు ప్రజలకు సకాలంలో, సక్రమంగా చేరేలా చూడాల్సిన బాధ్యత డీలర్లదేనని, డీలర్లు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు హితవు పలికారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉం.శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన్ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఆయనకు డీలర్ల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి ఎమ్మెల్యే బొండా ఉమా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రేషన్ డీలర్ల పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. ఇప్పటికే రూ.400 కోట్లను వెచ్చించి ప్రజలకు కందిపప్పు, పంచదారను పూర్తిస్థాయిలో అందజేస్తున్నారని దాన్ని ఎండీయూలు ప్రజలకు పంపిణీ చేసేలా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రవిచంద్రారెడ్డి, రాష్ట కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.ఎస్. ప్రసాద్, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం

వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ఆయన ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ 75వ ఆమోద దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నేతలు డా.బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం పరిపాలన అంశాలే కాకుండా, స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు, సామాజిక ఆర్థిక భేదాలు, వివక్ష లేకుండా ప్రజలందర్నీ ఒకే దేశంగా కలిపి ఉంచడంలో రాజ్యాంగం కీలక పాత్ర వహిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ నవ భారత నిర్మాత అంబేడ్కర్ ఆశయాలపై పార్టీ అనేక అంశాలను తీసుకుని నడుపుతుందన్నారు. రాబోయే కాలంలో అంబేడ్కర్ ఆశయాలను అమలు చేసి ప్రజలందరి అభివృద్ధికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ఎస్.బేగ్, రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఈస్ట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దేవరపల్లి ఆంజనేయులు, నేతలు మాదిగాని గురునాథం, కాకు మల్లిఖార్జునరావు, కొట్టేటి హనుమంతరావు, ఎం.డి. ఇర్ఫాన్, జి.వి.నరసింహారావు, పరిశపోగు రాజేష్, పామర్తి కిషోర్ బాబు అబీద్ హుస్సేన్, రాధాకృష్ణ, గుడిసె నరేష్, కె.వి.నరసింహారావు పాల్గొన్నారు.

వసంతకు 'అత్యుత్తమ సామాజిక న్యాయ సేవ రత్న' అవార్డు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ధర్నాచౌక్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థలో నూతన సంస్కరణలు రావాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. 'తప్పుడు కేసులు ఎదుర్కోవడం ఎలా' అనే పుస్తకాన్ని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో కలిసి గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించి పుస్తక రచయిత తిప్పనేని రామదాసప్ప నాయుడును అభినందించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన కొన్ని చట్టాలు పౌరుల హక్కులకు భంగం వాటిల్లేలా ఉన్నాయన్నారు. న్యాయస్థానాలకు సైతం అధికారాలను తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం జరగాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతల రమేష్ వసంత నాగేశ్వరరావును లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున 'అత్యుత్తమ సామాజిక న్యాయ సేవ రత్న' అవార్డుతో సత్కరించారు.

రాజ్యాంగం అమలులోకి వచ్చి

నేటికి 75 వసంతాలు

● సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటికి 75 వసంతాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా డాకర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సీపీ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగ సభలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగాన్ని అంగీకరించడం, శాసనం చేసి అమలు చేయడం జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని దేశ ప్రజలతో పాటు తాముూ గౌరవించి అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. దీని వలన సార్వభౌమ్య, సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా దేశ పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావప్రకటన, ధర్మం అనేది సమానంగా అందుతుందన్నారు. ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసులు ఏపీలో పెట్టుబడులు పెట్టాలి

ఖతార్ పర్యటనలో ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ



ఆటోనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రవాసులు ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ పిలుపునిచ్చారు. మూడు రోజుల ఖతార్ పర్యటనలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆంధ్ర వెల్ఫేర్ అసోసియేషన్, టీడీపీ ఖతార్ టీమ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగం వల్లే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానంలో ఏపీని సాంకేతిక, డిజిటల్ రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లున్న దార్శనికుడిగా పేరుగాంచారన్నారు. ఖతార్‌లోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, నిర్వహణపై ప్రేరణ పొందానన్నారు. ఇక్కడ అమలవుతున్న ఉత్తమ పద్ధతులను గమనించి, వాటిని ఏపీలోనూ అమలు చేయాలనే దృఢనిశ్చయంతో ఉన్నానన్నారు.ఈ పర్యటనలో భాగంగా ఖతార్ హిల్స్, బీచులు, మ్యూజియం, సీలైన్ బీచ్ వంటి ప్రదేశాలను సందర్శించారు. అనంతరం టీడీపీ ఖతార్ టీమ్, ఆంధ్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దోహా నుంచి విజయవాడ మధ్య ప్రత్యేక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు వారానికి రెండు, మూడు సార్లు నడిపేలా చూడాలని వినతిపత్రాన్ని అందజేశారు. టీడీపీ ఖతార్ టీమ్, ఆంధ్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి

చెత్త నుంచి కరెంట్, బయోగ్యాస్

● స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి కరెంట్, బయోగ్యాస్ తయారు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. స్టేషన్ నిర్వాహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త నిల్వలను ఎక్కడికక్కడే వదిలివేసిందని మండిపడ్డారు. చెత్త మొత్తం తరలింపు పనులు ముమ్మరంగా చేపట్టామన్నారు. ఒక్క విజయవాడ నగరంలోనే రోజుకు సుమారు 500 నుంచి 600 టన్నుల చెత్తను సేకరించి గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛత విషయంలో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి బిల్వార్చన


రామలింగేశ్వర స్వామికి బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు

విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురు, శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామికి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశదీపం వెలిగించారు. ప్రధాన అర్చకులు జీఆర్వీ సాగర్, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంగా నరసింహారావు ఉచిత ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.భవానీ పాల్గొన్నారు.

వాగేష్‌కు సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు అందజేత



సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు అందుకుంటున్న వాగేష్

విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలోని రామకోటి క్షేత్రంలో జరుగుతున్న సద్గురు సంగీత సభ 31వ వార్షిక సంగీత మహోత్సవాల్లో మూడో రోజు మంగళవారం విఖ్యాత గాత్ర విద్వాంసుడు డాక్టర్ కె.వాగీష్‌కు సభ ఏటా ఇచ్చే సద్గురు సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం చేశారు. సభాధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోఫూరి గౌరీనాథ్ పాల్గొన్నారు. విఖ్యాత హరికథా విద్వాంసులు ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురానన బిరుదు ప్రదానం చేశారు. అనంతరం వాగేష్ గాత్రకచేరీ రక్తిగా సాగింది.

పార్టీ కోసం ఐక్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే బొండా ఉమ


ఎమ్మెల్యే బొండా ఉమను గజమాలతో సత్కరిస్తున్న రవికుమార్, సాదం శ్రీనాథ్

వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మెచ్చి వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరుతున్నారని, ఎన్నికల్లో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 64వ డివిజన్‌లో వైసీపీకి చెందిన సాదం శ్రీనాథ్, మరికొందరు నేతలతో పాటు సుమారు 250 మందికి పైగా వైసీపీ శ్రేణులు డివిజన్ టీడీపీ నేతలు కాకొల్లు రవికుమార్, పొన్నం శేషగిరిరావు (గిరి) నేతృత్వంలో ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం రాత్రి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కండ్రిక బస్టాప్ వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యే వైసీపీ నుంచి వచ్చిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీలో చేరిన వారందరూ పార్టీకి విధేయులుగా పనిచేయాలని సూచించారు. ఇటీవల సంభవించిన వరదల్లో టీడీపీ నేత కె.రవికుమార్ బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. రానున్న రోజుల్లో వైసీపీ నుంచి భారీగా చేరికలు ఉంటాయన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ పార్టీ సభ్యత్వాలు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సాదం శ్రీనాథ్, మరికొందరు నేతలు, సీనియర్ నేతలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.రవికుమార్, శ్రీనాథ్ ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తొలుత పాతపాడు శ్రీకృష్ణ మందిరం నుంచి సుమారు 500 మంది ర్యాలీగా కండ్రిక భవానీ బార్ అండ్ రెస్టారెంట్ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి వేదిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావటంతో కండ్రిక రోడ్డు పార్టీ శ్రేణులతో కిక్కిరిసింది. స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆలిండియా ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నీకి ఏర్పాట్లు

● జాతీయంగా సత్తా చాటుతున్న ఆరు మహిళా టీమ్‌లు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మాజీరావు, సభ్యులు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాలీబాల్ క్రీడను మరింత ప్రాచుర్యంలో తెచ్చేందుకు తొలిసారిగా ఇండోర్ స్టేడియంలో ఆలిండియా ఇన్విటేషన్ ఉమెన్ వాలీబాల్ చాంపియన్‌షిప్ (నాదెళ్ల బసవ పూర్ణయ్య)కు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ మేరకు ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో పోటీలకు సంబంధించిన పోస్టర్లను సభ్యులతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ డిసెంబరు 12 నుంచి 15 వరకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అత్యాధునికంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నీ 12న సాయంత్రం 4 గంటలకు, అర్జున అవార్డీ అరికెపూడి రమణరావు, వాలీబాల్ జాతీయ క్రీడాకారులు సాంబశివరావు, గోపీచంద్‌ల పర్యవేక్షణలో ప్రారంభవుతుందన్నారు. ఈ టోర్నీ లీగ్ పద్ధతిలో జరుగుతుందని, సెంట్రల్ రైల్వేస్, బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, ఐసీఎఫ్ చెన్నై, సౌత్‌సెంట్రల్ రైల్వే, సదరన్ రైల్వేస్ ఆరు జట్లు బరిలో దిగుతున్నాయన్నారు. విజేతలకు జీఆర్‌జీ ట్రస్ట్ కోయంబత్తూరు సమకూర్చిన రూ.2.75 లక్షల ప్రైజ్‌మనీని అందిస్తామని బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ దోనేపూడి దయాకరరావు మాట్లాడుతూ రోజు అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగు మ్యాచ్‌లు జరుగుతాయని, ఈ టోర్నీ అందరూ తిలకించి జయప్రదం చేయాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరావు, సాంబశివరావు, మౌనికారావు, డాక్టర్ దేవేంద్ర పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో తగ్గిన క్రైమ్ రేటు

● జిల్లా ఎస్పీ గంగాధరరావు

ఉంగుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో క్రైమ్ రేటు గతం కంటే బాగా తగ్గిందని, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పటిష్టచర్యలు చేపట్టామని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం రాత్రి మండల కేంద్రమైన ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన పీఎస్ పరిసర ప్రాంతమంతా కలియదిరిగారు. స్టేషన్‌లోని ప్రతిగదిని పరిశీలించి నిర్వహణ విధానాలపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు, మూడేళ్ల కంపారేటివ్ స్టేట్మెంట్, స్టేషన్‌మ్యాప్ పరిశీలించి వాటి సమాచారాన్ని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై యు.గోవిందును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిసెప్షన్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఫిర్యాదుచేయడానికి వచ్చే ప్రజలపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల సమస్యలను సానుకూలంగా విని సామరస్యంగా పరిష్కరించాలన్నారు. మహిళా పోలీసుల విధులపై సూచనలు చేసిన ఎస్పీ ఇప్పటివరకు అవలంబిస్తున్న విధివిధానాలను మరింత మెరుగుపరచుకుని ప్రజలకు సత్వర న్యాయం అందించేలా కృషిచేయాలన్నారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ఎస్సై యు.గోవిందు, ఏఎస్సైలు నాగేశ్వరరావు, సత్తార్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సమస్య ప్రభుత్వాలకు పట్టదా?

- మంత్రిని నిలదీసిన రైతులు
- 48 గంటల్లో ధాన్యం సేకరణ పూర్తి చేస్తాం: మంత్రి మనోహర్


పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను చుట్టుముట్టిన రైతులు

కంకిపాడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'వాతావరణ మార్పుల కారణంగా రైతులు పెద్ద ఎత్తున కోతలు ప్రారంభించారు. దీంతో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధాన్యాన్ని 48 గంటల్లో మిల్లులకు చేర్చేవిధంగా అన్ని చర్యలు చేపడతాం' అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు హామీ ఇచ్చారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్నులో కోతలు కోసి ధాన్యాన్ని రైతులు రోడ్డుపై ఆరబోశారు. ఆ ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి నాలుగు రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలిసిన మంత్రి మంగళవారం అక్కడకు చేరుకున్నారు. మంత్రి రాకతో పెద్ద ఎత్తున రైతులు గుమిగూడారు. రైతు సమస్యలు ప్రభుత్వాలకు పట్టవా? నాలుగు రోజులుగా గోనె సంచులు లేక, వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. దళారుల నుంచి కొనుగోలు చేస్తున్న మిల్లర్లు, రైతుల నుంచి ఎందుకు తీసుకోవడం లేదు? అధికారులు పట్టించుకోవడం లేదు. వాతావరణ మార్పులతో బస్తా ధాన్యాన్ని (76 కేజీల) రూ.1,420కు తెగనమ్ముకోవాల్సి వస్తోంది' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మనోహర్ స్పందిస్తూ... '1262 రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. రవాణా ఇబ్బందులు తలెత్తకుండా జీపీఎస్‌తో ప్రమేయం లేకుండా వాహనాలు సమకూర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మొదటి సీజన్ కాబట్టి కొంతమేరకు సమస్యలు ఉంటాయి. వాటిని అధిగమించేందుకు అన్నివిధాలా చర్యలు చేపడతాం' అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో షారూన్, తహసీల్దార్ భవన్నారాయణ, ఆర్ఐ ఉస్మాన్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

'ఫెంగల్' తుఫాన్?

29, 30 తేదీల్లో చెన్నై వద్ద తీరం దాటుతుందని అంచనా

- నేటి నుంచి ఒకటో తేదీ వరకు భారీవర్షాలు
- ప్రధాన ఓడరేవుల్లో ఒకటో నంబరు హెచ్చరిక
- వరి కోతలపై వాతావరణ శాఖ సూచనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నైరుతి బంగాళాఖాతంలోని వాయుగుండం మంగళవారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది ప్రస్తుతం నాగపట్నానికి 590, చెన్నైకి 800 కి.మీ. దూరంలో దక్షిణ ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి బుధవారానికి తుఫాన్‌గా బలపడనుంది. ఈ తుఫానుకు సౌదీ అరేబియా సూచించిన 'ఫెంగల్' అని పేరు పెట్టనున్నారు. ఇది శ్రీలంక వద్ద తీరం దాటకుండా సముద్రంలోనే పయనించి ఉత్తర తమిళనాడు వైపు వస్తుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈనెల 29వ తేదీ రాత్రి లేదా 30వ తేదీ తెల్లవారుజామున చెన్నై సమీపంలో తీరం దాటుతుందని అంచనా వేసింది. కాగా, తుఫాన్‌గా బలపడిన తరువాత గమనం, తీరం దాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రావల్సి ఉందని ఇస్రో వాతావరణ శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు, 28న నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, బాపట్ల, ప్రకాశం, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈనెల 29 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, బాపట్ల, శ్రీసత్యసాయి, కడప, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈనెల 30న నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, బాపట్ల, ప్రకాశం, శ్రీసత్యసాయి, అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు, వచ్చే నెల ఒకటో తేదీన నెల్లూరు, ప్రకాశం, శ్రీసత్యసాయి, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. మత్స్యకారులు 30వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కోస్తాంధ్రలోని ప్రధాన ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. ఏపీలో వరి, పత్తి రైతులను వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. ఉత్తరకోస్తాలో బుధవారం వరకు కోతలు కోసుకుని కుప్పలు పెట్టుకోవాలని, వీలుకాకపోతే కోతలు వాయిదా వేసుకోవాలని సూచించింది. దక్షిణ కోస్తాలో కోతలు నిలిపివేయాలని సూచించింది. దక్షిణ కోస్తా తీరం వెంట గంటకు 50-70కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సంద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.


నెల్లూరు నగరంలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు

నెల్లూరులో భారీ వర్షం..

తీవ్ర వాయుగుండం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి నెల్లూరు జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

తిరుమల నడక మార్గంలో బిగ్‌బాస్ ఫేం ప్రియాంక ఓవరాక్షన్

- చిరుత కనిపించిందంటూ పరుగులు
- ఆపై ప్రాంక్ అంటూ వెకిలి నవ్వులు.. వీడియో వైరల్
- చర్యలకు సిద్ధమవుతున్న టీటీడీ!



సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వీడియో తంబ్‌నెయిల్

తిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ ఫేం ప్రియాంక మరో వివాదంలో చిక్కుకున్నారు. తన స్నేహితుడితో కలిసి తిరుమల నడక మార్గంలో చేసిన ఓవరాక్షన్ తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రియాంక, నటుడు శివ మరో ఇద్దరితో కలిసి కొద్ది రోజుల కిందట అలిపిరి నడక మార్గంలో తిరుమల వచ్చారు. ఈ సందర్భంగా వీరు చేసిన వీడియో విమర్శలకు దారితీసింది. 'తిరుపతి దారిలో మాపై చిరుతపులి ఎటాక్ చేసింది' అనే హెడ్డింగ్‌తో ప్రియాంక భయంతో ఉన్న ఫొటోను జత చేసిన తంబ్‌నెయిల్‌తో వీడియోను అప్‌లోడ్ చేశారు. భయానక శబ్దాలు, చిరుత కళ్లు కనిపిస్తున్నట్టు ఎడిటింగ్ చేసి వీడియో చూపించారు. చిరుత కనిపించిందంటూ పరుగులు తీసి ఆపై చిరుత లేదంటూ నవ్వడం మొదలుపెట్టారు. దీనిపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి స్పందిస్తూ వారిపై కేసులు పెట్టేలా అధికారులతో మాట్లాడతానన్నారు. ప్రియాంక, శివపై చర్యలు తీసుకునేందుకు టీటీడీ సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

నవ్య | చిత్రజ్యోతి

నింగికెగసిన పాటల కెరటం



'ఊహల పల్లకిలో ఊరేగించనా...' పాట ఇవాళ్టికీ తెలుగు ప్రేక్షకుల నాలుక మీద ఆడుతుంటుంది. 'దేశం మనదే తేజం మనదే...' గీతం ప్రతి జెండా పండుగనాడు తెలుగువారిని పలకరిస్తుంది. 'పాటల పల్లకిలోన చిగురాకుల సవ్వడిలోన నిరంతరం వసంతమే సంగీతం...' అంటూ మనసును ఆహ్లాదపరిచే సాహిత్యమైనా.... 'రాను రానంటూనే సిన్నదో సిన్నదో...' అంటూ హుషారెత్తించే పాటలైనా, 'ఏమైందీ ఈ వేళ ఎదలో ఈ సందడేలా...' లాంటి ప్రణవగీతమైనా, 'ప్రియతమా ఓ ప్రియతమా...' ప్రేమరాగమైనా... ఇలా తెలుగు సినీపాటల పూదోటలో పదికాలాల పాటు నిలిచే కవితాక్షరాలను పండించిన ప్రముఖ గేయ రచయిత కులశేఖర్. ఎన్నో సూపర్‌హిట్ పాటలను అందించిన ఆయన మరణం సినిమాకథను తలపించడం విషాదం.

ప్రముఖ సినీగీత రచయిత తిరుమల పన్నేర్లమూడి కులశేఖర్(53) ఇక లేరు. అమీర్‌పేట రోడ్డుమీద ఓ గుర్తుతెలియని వ్యక్తి కుప్పకూలాడు అంటూ సోమవారం ఉదయం స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికెళ్లిన పంజాగుట్ట పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని, 108 సహాయంతో గాంధీ ఆస్పత్రిలో చేర్పించినట్టు సమాచారం. అదే రోజు రాత్రి చికిత్సపొందుతూ అతను తుదిశ్వాసవిడిచారు. అనామక శవంగానే మార్చురీకి తరలిస్తున్న సమయంలో గాంధీ ఆస్పత్రిలో పనిచేసే ఓ నర్సు ఆయన్ను ప్రముఖ పాటల రచయిత కులశేఖర్‌గా గుర్తించారు. అలా కులశేఖర్ మరణ వార్త వెలుగులోకి వచ్చింది. అంతకు కొన్నినెలలముందు ఆయనకు శస్త్రచికిత్స జరిగినట్టు సమాచారం. వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ అవ్వడంతో మరింత అనారోగ్యానికి లోనయినట్లు స్నేహితులు చెబుతున్నారు. అదే అతని మరణానికి కారణమని వారంతా భావిస్తున్నారు. కులశేఖర్ స్వస్థలం విశాఖపట్నం జిల్లా సింహాచలం. కులశేఖర్ తండ్రి దివంగత టీపీ శ్రీరామచంద్రాచార్యులు ప్రముఖ సంస్కృత పండితుడు, మహామహోపాధ్యాయ బిరుదాంకితుడు. తల్లి రంగనాయకమ్మ ప్రస్తుతం సింహాచలంలో ఉంటున్నారు. కులశేఖర్ భార్య విద్యావతి. వీరి కుమార్తె సౌందర్య లహరి, కుమారుడు సరస్వతి చరణ తేజ. అనారోగ్యకారణంగా కులశేఖర్ కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉండడంతో భార్య ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూ పిల్లల బాధ్యతను నిర్వర్తిస్తున్నారని బంధువుల ద్వారా తెలిసింది. వారంతా మంగళవారం కులశేఖర్ భౌతికకాయాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ వార్త తెలిసిన వెంటనే వైజాగ్‌లోని ముగ్గురు సోదరులు నగరానికి బయలుదేరినట్టు కులశేఖర్ బంధువు గోపాల్ చెప్పారు.

సినీగేయ రచయితగా ప్రస్థానం...

సంగీత, సాహిత్య వాతావరణంలో పుట్టి, పెరిగిన కులశేఖర్ వైజాగ్‌లోని బీవీకే కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కళాశాల రోజుల్లోనే పాటలు రాసి ఎన్నో బహుమతులు అందుకున్నారు. ఈనాడు టెలివిజన్ జర్నలిస్టుగా ఢిల్లీ, చెన్నై తదితర నగరాల్లో కొంతకాలం పనిచేశారు. కులశేఖర్ సాహిత్య సృజనకు మెచ్చిన సిరివెన్నెల సీతారామశాస్త్రి ఆయన్ను తన శిష్యుడిగా ప్రోత్సహించారు. అలా 'చిత్రం' సినిమాతో గేయ రచయితగా తెలుగుచిత్రసీమకు కులశేఖర్ పరిచయమయ్యారు. ఆ తర్వాత తేజ దర్శకత్వంలో సినీసంగీత దర్శకుడిగా ఆర్పీ పట్నాయక్, గీత రచయిత కులశేఖర్‌ది సూపర్‌హిట్ కాంబినేషన్‌గా పేరు పొందింది. ఈ ముగ్గురి కలయికలో వచ్చిన 'చిత్రం', 'జయం', 'నువ్వు నేను' సినిమాలే కాదు పాటలు కూడా అమితాదరణపొందిన సంగతి తెలిసిందే. 'జై', 'మృగారాజు', 'వసంతం', 'ఘర్షణ', 'సంతోషం', 'బొమ్మరిల్లు', 'ఆడవారిమాటలకు అర్థాలే వేరులే', 'అమ్మాయి బావుంది' తదితర సినిమాల్లో వందకుపైగా పాటలు రాశారు. కులశేఖర్ రాసింది రాశిలో తక్కువైనా, వాసిలో మాత్రం ఘనమైనవే అనడంలో అతిశయోక్తిలేదు.

కుంగదీసిన సినిమా...

'ప్రేమలేఖ రాశా' సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. సినీగేయ రచయితగా చేతినిండా అవకాశాలతో ఆకాశంలోని తారాజువ్వలా వెలుగొందుతున్న కులశేఖర్ జీవితం 2013 తర్వాత ఒక్కసారిగా తలకిందులైంది. అందుకు కారణం ఆయన దర్శకత్వం వహించిన సినిమా ఆశించినంతగా ఆడకపోవడమే కులశేఖర్‌ను మానసికంగా కుంగదీసింది అని కొందరు అంటారు. అదే సమయంలో కొన్నాళ్లపాటు ఆయన కోమాలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. కోలుకున్నాక కూడా కొద్దిరోజులు మనుషులను గుర్తుపట్టలేకపోయారు. తర్వాత సాధారణ స్థితికి వచ్చినా, ఇదివరకటిలా పాటలు రాయలేకపోయారని స్నేహితులు చెబుతున్నారు. కాకినాడలోని ఓ దేవాలయంలో శఠగోపం దొంగిలించాడన్న ఆరోపణతో కులశేఖర్ జైలు జీవితాన్ని గడిపారు. అయితే, తనకు ఏ పాపం తెలియదని, గిట్టనివారు తనమీద నేరాన్ని మోపారని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆపై పాటల అవకాశాల కోసం ప్రయత్నించినా, ఫలితంలేకపోయింది. దాంతో మరింత కుంగుబాటుతో బాధపడుతున్న క్రమంలో కుటుంబ సభ్యులకు, స్నేహితులకు దూరమయ్యారు. తనపాటలతో కోట్లమందిని అలరించిన ఆయన ఓ అనామకుడిగా కన్నుమూశారు. కులశేఖర్ అంత్యక్రియలు బుధవారం ఉదయం 10గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరగనున్నాయి. ఆ ఏర్పాట్లను ఆర్పీ పట్నాయక్ దగ్గరుండి చూసుకుంటున్నట్లు సమాచారం.


హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

అనామకుడిగా చనిపోవడం బాధించింది

- ఆర్పీ పట్నాయక్, సంగీత దర్శకుడు

పంజాగుట్ట, హిందీకాలనీలో సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి ఎదురింటిలోని ఒక గదిలో త్రివిక్రమ్, సునీల్, నేను కలిసి ఉంటున్న రోజులవి. అప్పుడే శాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేస్తున్న కులశేఖర్ నాకు పరిచయం అయ్యాడు. అలా ఒకరోజు తను రాసిన రామాయణ గేయకావ్యం 'రామరసవాణి' తీసుకొచ్చి చూపించాడు. అది నాకు బాగా నచ్చింది. అదే సమయంలో తేజగారి 'చిత్రం' సినిమాకు సంగీత దర్శకుడిగా నాకు అవకాశం వచ్చింది. ఆయనకు కులశేఖర్‌ను పరిచయం చేశాను. అంతే! మనోడి శైలి నచ్చి, ఆ సినిమాకు సింగిల్‌కార్డు అవకాశం ఇచ్చారు. అలా తేజగారితో నా అనుబంధం మరింత బలపడడానికి కులశేఖరే ప్రధాన కారణం. ఆ తర్వాత మాది హిట్ కాంబినేషన్‌గా పేరు రావడం తెలిసిందే. కారణం తెలియదుకానీ, కులశేఖర్ మధ్యలో కొన్నాళ్ల పాటు కోమాలో ఉన్నాడు. అనారోగ్యం నుంచి కోలుకున్నా, పాటలు రాయలేకపోయాడు. ఎప్పుడు ఎక్కడికి వెళతాడో కుటుంబ సభ్యులకు కానీ మాకు కానీ తెలిసేది కాదు. అలా మాకు దూరమయ్యాడు. ఏదేమైనా, కులశేఖర్ ఒక గుర్తుతెలియని వ్యక్తిగా చనిపోవడం నన్ను మరింత బాధించింది.

పుష్ప 2 పారితోషికం రూ. 300 కోట్లు




ఇప్పటి వరకూ బాలీవుడ్ హీరోలే పారితోషికం విషయంలో టాప్ అనుకుంటున్న సమయంలో అల్లు అర్జున్ ఈ విషయంలో ప్రస్తుతం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. మంగళవారం ఫోర్బ్స్ ఇండియా మ్యాగజైన్ దేశంలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న టాప్ 10 నటుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 'పుష్ప 2' సినిమా కోసం రూ.300 కోట్లు తీసుకుంటున్న అల్లుఅర్జున్ ప్రథమ స్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. రెండో స్థానంలో తమిళ కథానాయకుడు విజయ్ ఉన్నారు. ఆయన 'లియో', 'గోట్' చిత్రాలతో పాటు ప్రస్తుతం షూటింగ్‌లో ఉన్న 'విజయ్ 69' కోసం రూ. 275 కోట్లు తీసుకున్నారట. మూడో స్థానంలో ఉన్న షారుక్ ఖాన్ 'డంకీ' సినిమాకు రూ.150- 250 కోట్ల పారితోషికం అందుకున్నారు. అలాగే రజనీకాంత్ రూ.150-270 కోట్లు.. ఆమిర్ ఖాన్ రూ.100-275 కోట్లు.. ప్రభాస్ రూ.100-200 కోట్లు.. అజిత్ రూ. 105-165 కోట్లు.. సల్మాన్ రూ.100-150 కోట్లు.. కమల్ హాసన్ రూ. 100-150 కోట్లు.. అక్షయ్ కుమార్ రూ.60-145 కోట్ల పారితోషికంతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఐదేళ్ల ప్రయాణం పూర్తి

అల్లుఅర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో నటిస్తున్న 'పుష్ప 2' (పుష్ప: ద రూల్) చిత్రం షూటింగ్ మంగళవారంతో పూర్తైంది. ఈ విషయాన్ని అల్లుఅర్జున్ సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. "చివరి రోజు షూటింగ్. అద్భుతమైన ఐదేళ్ల 'పుష్ప' ప్రయాణం పూర్తైంది" అని పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ప్రియురాలితో అఖిల్ నిశ్చితార్థం



అక్కినేని అఖిల్‌కి తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో నిశ్చితార్థం జరిగింది. జైనబ్ రవ్జీ.. ఢిల్లీకి చెందిన థియేటర్ ఆర్టిస్ట్, ఇన్‌ఫ్లూయెన్సర్. త్వరలోనే తన కొడుకు ఓ ఇంటివాడు కాబోతున్నాడని నాగార్జున మంగళవారం సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని తెలిపారు. "జైనబ్‌ను మా కోడలిగా ఆహ్వానిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. కాబోయే దంపతులకు మీ ఆశీస్సులు కావాలి" అని పేర్కొన్నారు. అక్కినేని ఇంట జరిగిన ఈ నిశ్చితార్థానికి ఇరువురి కుటుంబ సభ్యులు, అతి కొద్ది సంఖ్యలో అతిథులు పాల్గొన్నారు. కాగా అఖిల్, జైనబ్‌లకు రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాలూ వీరి ప్రేమను అంగీకరించాయి. మరోవైపు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల వివాహం డిసెంబరు 4న జరుగుతున్న సంగతి తెలిసిందే.

ఆ ట్యాగ్స్ మాకే ఎందుకు



ఇటీవలే 'హనీ బన్నీ' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించారు సమంత. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "విడాకులు తీసుకున్న తర్వాత సమాజం కొన్ని ట్యాగ్స్ తగిలిస్తుంది. 'సెకండ్ హ్యాండ్.. యూజ్డ్' ఇలాంటి ట్యాగ్స్ ఎందుకు తగిలిస్తారో అర్థం కాదు. ఆ అమ్మాయిని.. తన కుటుంబాన్ని ఇవి ఎంతో బాధిస్తాయి. కష్టాల్లో ఉన్న ఆ అమ్మాయిని అవి ఎంతో కుంగదీస్తాయి. నా గురించి ఎన్నో అసత్య ప్రచారాలు చేశారు. అవన్నీ అబద్ధాలు కాబట్టి నేను వాటిపై మాట్లాడదల్చుకోలేదు. కష్ట సమయంలో నా స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎంతోమంది నాకు మద్దతుగా నిలిచారు" అని చెప్పారు.

చైనాలో 'మహారాజా' విడుదల




తమిళ సస్పెన్స్ థ్రిల్లర్ 'మహారాజా' చైనాలో ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ చిత్రానికి నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించారు. విజయ్‌సేతుపతి, అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్ కీలక పాత్రల్లో నటించారు. చైనాలో నాలుగేళ్ల తర్వాత విడుదలవుతున్న భారతీయ చిత్రమిది. ఇప్పటికే చైనాలో ప్రీవ్యూ షోస్ వేశారు. వీటికి అక్కడి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా క్లైమాక్స్ ఊహించని మలుపులతో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. చైనీస్ మూవీ రివ్యూ సైట్ 'డౌబన్' ఈ సినిమాకు 8.7/10 రేటింగ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో భారతీయ సినిమాకు ఇంత భారీ రేటింగ్ లభించడం ఇదే తొలిసారి.

పెద్ద సినిమాలు తీస్తా



"రోటీ కపడా రొమాన్స్' దర్శకుడిగా నాకు తొలి చిత్రం. ఇది హిట్ చేసి దర్శకుడిగా నిలబడే ఛాన్స్ ఇస్తే నేను కూడా 'ఆర్ఆర్ఆర్' వంటి భారీ సినిమాలు తీస్తా. అలాంటి కథలు నా దగ్గర ఉన్నాయి' అన్నారు దర్శకుడు విక్రమ్ రెడ్డి. ఆయన దర్శకత్వం వహించిన 'రోటీ కపడా రొమాన్స్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. 'ఇదొక యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. కామెడీ, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో ఉంటుంది. సినిమాలో నాలుగు ప్రేమకథలు ఉంటాయి. నలుగురు యువకుల జీవితాల్లోకి నలుగురు యువతులు వచ్చాక వారి జీవితాలు ఎలా మారిపోతాయో చెప్పే సినిమా ఇది. చివరి పదిహేను నిముషాలు అందరి హృదయాలను హత్తుకుంటాయి' అని చెప్పారు విక్రమ్‌రెడ్డి.

అమరావతిలో గేమ్ చేంజర్



రామచరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్‌చేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. మంగళవారం ధ్యానబుద్ధ సమీపంలోని హరిత వసతిగృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రామ్‌చరణ్‌కు జోడీగా కియారా అద్వాణీ నటిస్తున్నారు. అంజలి, సముద్రఖని, ఎస్.జే సూర్య, శ్రీకాంత్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

రాబిన్‌హుడ్ డ్యూయెట్



నితిన్, శ్రీలీల హీరో హీరోయిన్లుగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూర్చారు. డిసెంబరు 25న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఫస్ట్ సింగిల్-'వన్ మోర్ టైమ్'ని రిలీజ్ చేశారు. ప్రేమ కోసం తన గర్ల్ ఫ్రెండ్‌తో మరో అవకాశం కోరే హీరో గురించిన సాంగ్ ఇది. అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించిన ఈ పాటకు కృష్ణకాంత్ యూత్‌ఫుల్ లిరిక్స్ రాశారు. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రెహమాన్ నాకు తండ్రితో సమానం



రెహమాన్ దంపతుల విడాకుల ప్రకటనకూ.. తనకూ సంబంధం ఉందని వస్తున్న వార్తలపై గిటారిస్ట్ మోహిని దే మరోసారి వివరణచ్చారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. "నాది, రెహమాన్ కూతురుది ఒకే వయసు. ఆయనతో ఎనిమిదిన్నర ఏళ్లుగా కలసి పనిచేస్తున్నాను. ఎన్నో సినిమాలకు మ్యూజిక్ చేశాను. స్టేజ్ షోలలో పాల్గొన్నాను. ఆయన నాకు తండ్రితో సమానం. రెహమాన్ ఒక లెజెండ్. నా జీవితానికి రోల్ మోడల్. ఆయన నన్ను తన కూతురిలాగే చూసేవారు. ఆయనంటే ఎంతో గౌరవం ఉంది. అలాంటి మాపై ఇలాంటి వార్తలు రావడం బాధాకరం. ఇలాంటి సున్నితమైన అంశాల్లో నిందలు వేయడం సరికాదు. అసభ్యకరంగా మాట్లాడటం నేరంగా పరిగణించాలి. నేను ఈ ఆరోపణలన్నింటికీ వివరణ ఇచ్చుకోవాల్సిన పనిలేదు. అలాగే, ఈ వదంతులు నా ప్రశాంతతను పాడు చేయాలనుకోవట్లేదు. దయచేసి ఇకనైనా వీటికి ఫుల్ స్టాప్ పెట్టండి. మా గోప్యతను గౌరవించండి" అని కోరారు.

ఆ ప్రచారం ఆపండి



ఏ.ఆర్.రెహమాన్ సతీమణి సైరా బాను తమ విడాకుల ప్రకటన పట్ల సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారు. "అనారోగ్య సమస్యలతోనే నేను ముంబైకి మకాం మార్చాను. ఏ.ఆర్.రెహమాన్ తీరికలేని షెడ్యూల్స్ వల్ల ఆయన చెన్నైలోనే ఉండాలి. కాబట్టి నేను ఒక్కదాన్నే ముంబైకి రావాల్సి వచ్చింది. మేం అధికారికంగా ఇప్పటివరకూ ఏ విషయాన్నీ ప్రకటించలేదు. ఆయన ఉన్నతమైన వ్యక్తి. దయచేసి ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించే తప్పుడు ప్రచారాలు మానండి" అని కోరారు.

ఎవరి బలమెంత?

గత రికార్డులను బద్దలు కొడుతూ రెండురోజుల పాటు సాగిన ఐపీఎల్ మెగా వేలం క్రికెట్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్‌లు కళ్లు చెదిరే మొత్తాన్ని ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటివరకు ఆడిన జట్లకు గుడ్‌బై చెబుతూ ఈ ఇద్దరితో పాటు పలువురు స్టార్ క్రికెటర్లు కొత్త ఫ్రాంచైజీల తరపున బరిలోకి దిగబోతున్నారు. ఇక 182 మంది ఆటగాళ్లతో మూడేళ్లపాటు ఒప్పందం కుదుర్చుకున్న ఈ పది జట్లు ఎలా తమ టైటిల్ వేటను సాగించనున్నాయో పరిశీలిద్దాం..


డుప్లెసీ

ఢిల్లీ క్యాపిటల్స్

వేలానికి ముందే తమ కెప్టెన్ రిషభ్ పంత్‌ను వది లేసి అందరినీ ఆశ్చర్యపరిచింది ఢిల్లీ జట్టు. నలుగురిని రిటైన్ చేసుకున్న ఈ జట్టు.. స్టార్ ఆటగాడు డుప్లెసీ సహా 19 మందిని వేలంలో తీసుకుంది. ఇక, ఫ్రేజర్ మెక్‌గుర్క్‌తో రాహుల్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. అయితే రాహుల్ స్ట్రయిక్ రేట్ స్థాయికి తగ్గట్టుగా లేదు. స్టార్క్, నటరాజన్‌తో పేస్ బౌలింగ్ పటిష్ఠంగానే ఉంది. అక్షర్, కుల్దీప్‌ల రూపంలో నాణ్యమైన స్పిన్నర్లూ ఉన్నారు. అయితే మిడిలార్డర్‌లో బ్యాకప్ బలహీనంగా ఉంది. గత సీజన్‌లో బెంగళూరు సారథిగా వ్యవహరించిన డుప్లెసీకి.. ఈసారి ఢిల్లీ పగ్గాలు అప్పగించే అవకాశముంది.


వెంకటేశ్ అయ్యర్

కోల్‌కతా నైట్‌రైడర్స్

15 మంది ఆటగాళ్లను తీసుకున్న ఈ జట్టు వెంకటేశ్ అయ్యర్‌పై భారీ మొత్తం వెచ్చించింది. జట్టు మూడో టైటిల్ అందుకునే క్రమంలో అయ్యర్ దూకుడైన బ్యాటింగ్ కీలక భూమిక పోషించనుంది. కెప్టెన్ కూడా అతనే అయ్యే అవకాశం ఉంది. రిటైన్ చేసుకున్న ఆరుగురు ఆటగాళ్లకు తోడు అయ్యర్ కూడా జత కలవడంతో దాదాపు పాత జట్టుతోనే ఆడబోతోంది.

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్

రూ.27 కోట్ల రికార్డు ధరతో తీసుకున్న రిషభ్ పంత్ జట్టు కెప్టెన్ కావడం ఖాయమే. వేలంలో 19 మందిని తీసుకోగా.. మిచెల్ మార్ష్, మార్క్‌రమ్‌తో ఓపెనింగ్ చేయించే అవకాశం ఉంది. అయితే ఈ జోడీ పెద్దగా ఫామ్‌లో లేదు. దీంతో పంత్, పూరన్‌పైనే అధిక భారం పడుతుంది. పేసర్లు మయాంక్, మొహిసిన్‌ల ఫిట్‌నెస్ కీలకం కానుంది.

ముంబై ఇండియన్స్


బౌల్ట్

రిటైన్ చేసుకున్న ఐదుగురు ఆటగాళ్లకే రూ.75 కోట్లు వెచ్చించిన ముంబై తొలి రోజు వేలంలో పెద్దగా సందడి చేయలేదు. చివరి రోజు మాత్రం పేసర్ బౌల్ట్‌పై రూ.12.5 కోట్లు, దీపక్ చాహర్‌పై రూ.9.25 కోట్లు వెచ్చించింది. హిట్టర్ టిమ్ డేవిడ్‌ను వదులుకోవడంతో విల్ జాక్స్‌ను తీసుకుంది. అయితే ఇషాన్ కిషన్ లేకపోవడంతో రోహిత్‌కు జతగా సరైన ఓపెనర్‌ను దించడం కష్టమే. రికెల్టన్‌ను పరిశీలించవచ్చు.

రాజస్థాన్ రాయల్స్

రిటైన్ చేసుకున్న ఆరుగురిలో ఐదుగురు బ్యాటర్లే ఉండడంతో వేలంలో ఈ జట్టు ఎక్కువగా బౌలర్లపై దృష్టి సారించింది. అందుకే ఆర్చర్‌ను రూ.12.5 కోట్లకు తీసుకుంది. కానీ అతడిని తరచూ గాయాలు వెంటాడుతుంటాయి. స్పిన్నర్లు చాహల్, అశ్విన్‌ల స్థానాలను తీక్షణ, హసరంగ భర్తీ చేస్తారు. 13 ఏళ్ల వైభవ్ అరంగేట్రం కష్టమే.

పంజాబ్ కింగ్స్

కేవలం ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను రిటైన్ చేసుకున్న ఈ జట్టు రూ.26.75 కోట్లకు తీసుకున్న శ్రేయా‌స్‌ను కెప్టెన్‌గా చేయవచ్చు. పేసర్లు అర్ష్‌దీప్, ఫెర్గూసన్, జాన్సెన్ ప్రధాన బలం. స్టొయినిస్, మ్యాక్స్‌వెల్ ఆల్‌రౌండర్లుగా ఉపయోగపడతారు. చాహల్, హర్‌ప్రీత్ జట్టు స్పిన్నర్లు.

సన్‌రైజర్స్ హైదరాబాద్


షమి

గత సీజన్‌లో రికార్డు స్కోర్లతో ఆకట్టుకున్న సన్‌రైజర్స్ తమ ప్రధాన ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. దీనికి తోడు ఇషాన్ కిషన్, షమి, హర్షల్ పటేల్, జంపా రావడంతో జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. అదనపు స్పిన్నర్‌గా రాహుల్ చాహర్ ఉన్నాడు.

చెన్నై సూపర్ కింగ్స్

సీఎస్‌కే ఎప్పుడూ తాము వదిలేసిన ఆటగాళ్లనే వేలంలో తీసుకునేందుకు ఇష్టపడుతుంది. ఈసారి కూడా కాన్వే, రచిన్ రవీంద్ర జట్టులోకి వచ్చారు. అలాగే ఆల్‌రౌండర్ సామ్ కర్రాన్, రాహుల్ త్రిపాఠి జట్టుకు ఉపయోగపడే వారే. చివర్లో ధోనీ మెరుపుబ్యాటింగ్‌తో ఆకట్టుకోగలడు. ఇక రవిచంద్రన్ అశ్విన్ చాలాకాలం తర్వాత తిరిగి చెన్నైకి ఆడబోతున్నాడు.

గుజరాత్ టైటాన్స్

వేలంలో 20 మందిని తీసుకున్న టైటాన్స్‌కు బట్లర్, గిల్ రూపంలో స్టార్ ఓపెనర్లు ఉన్నారు. ఇక రబాడ, కొట్జీ, సిరాజ్, ఇషాంత్, ప్రసిద్ధ్‌లతో పేస్ బలగం బావుంది. చివర్లో రాహుల్ తెవాటియా, షారుక్‌లాంటి మెరుపు వీరులున్నా.. మిడిలార్డర్ మాత్రం బలహీనంగా కనిపిస్తోంది.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును బ్యాటింగ్ పవర్ హౌస్‌గా పిలుస్తారు. కానీ బౌలింగ్ అంతంతమాత్రమే. అందుకే వేలంలో హాజెల్‌వుడ్, భువనేశ్వర్‌లను అధిక ధరలకు తీసుకుంది. విరాట్ తిరిగి పగ్గాలు చేపట్టే అవకాశం లేకపోలేదు. లివింగ్‌స్టోన్, బెథెల్, సాల్ట్ రూపంలో ముగ్గురు ఇంగ్లండ్ ఆటగాళ్లున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



హైదరాబాద్ బుడతడు.. ప్రపంచాన్ని జయించాడు

దివిత్‌కు అండర్-8 ప్రపంచ క్యాడెట్స్ చెస్ టైటిల్

మాంటెసిల్‌వానో (ఇటలీ): అండర్-8 ప్రపంచ క్యాడెట్స్ చెస్ చాంపియన్‌షి‌ప్‌ను హైదరాబాద్ బుడతడు ఎ. దివిత్ రెడ్డి సొంతం చేసుకొన్నాడు. ఆడిన 11 రౌండ్లలో తొమ్మిది గెలిచి.. రెండు గేమ్‌లు ఓడిన దివిత్ మొత్తం 9 పాయింట్లు సాధించాడు. మరో భారత ఆటగాడు సాత్విక్ స్వైన్, చైనా క్రీడాకారుడు జిమింగో గుకూడా దివిత్‌తో సమానంగా టాప్‌లో నిలిచారు. కానీ, టైబ్రేకర్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచిన దివిత్ స్వర్ణం సాధించగా.. సాత్విక్ రజతం, జిమింగో కాంస్యం దక్కించుకొన్నారు. కాగా దివిత్ ఖాతాలో 1784 ఫిడే రేటింగ్ పాయింట్లున్నాయి.



వైభవ్ వయసు 13 కాదా?

ఆరోపణల వెల్లువ
పరీక్షకు సిద్ధమన్న తండ్రి

న్యూఢిల్లీ: ఐపీఎల్ వేలంలో 13 ఏళ్లకే కాంట్రాక్ట్ దక్కించుకున్న ఆటగాడిగా బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ రికార్డులకెక్కాడు. కానీ అది అసలు వయస్సు కాదని, అతడికి 15 ఏళ్లు ఉంటాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని అతడి తండ్రి సంజీవ్ తోసిపుచ్చాడు. ఈ విషయంలో తమకెలాంటి భయం లేదని, కావాలంటే పరీక్ష చేయించుకోవచ్చని సవాల్ విసిరాడు. వైభవ్ ఎనిమిదిన్నర ఏళ్ల వయస్సులోనే బీసీసీఐ బోన్ టెస్టుకు హాజరయ్యాడని గుర్తు చేశాడు. అవసరమైతే మరోసారి ఇదే తరహా పరీక్ష చేసుకోవచ్చన్నాడు. మరోవైపు వేలానికి ముందే నాగ్‌పూర్‌లో రాజస్థాన్ జట్టు ట్రయల్స్‌కు వైభవ్ హాజరయ్యాడని చెప్పాడు.

అయూబ్ మెరుపు శతకం

బులవాయో: ఓపెనర్ సాయిమ్ అయూబ్ (62 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 నాటౌట్) శతకంతో చెలరేగడంతో జింబాబ్వేతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 10 వికెట్లతో ఘన విజయం సాధించింది. తొలుత జింబాబ్వే 32.3 ఓవర్లలో 145 పరుగులకు కుప్పకూలింది. అబ్రార్ 4, సల్మాన్ 3 వికెట్లు తీశారు. ఛేదనలో అయూబ్ 53 బంతుల్లోనే శతకం సాధించడంతో పాక్ 18.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 148 రన్స్ చేసి నెగ్గింది. పాక్ వన్డేల చరిత్రలో 53 బంతుల్లో 100 పరుగులు చేసిన ఆటగాళ్లలో అఫ్రీదితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు.

వైదొలిగిన సాత్విక్ జంట

సయ్యద్ మోదీ టోర్నీ

లఖ్‌నవూ: స్వదేశంలో జరుగుతున్న సయ్యద్ మోదీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి చివరి నిమిషంలో తప్పుకొంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సాత్విక్ భుజానికి గాయం కావడంతో ఈ ద్వయం కొంతకాలంగా ఆటకు దూరమైంది. గతవారం చైనా ఓపెన్‌లో పోటీపడి సెమీస్ దాకా చేరింది. అయితే, శరీరాన్ని మరింత ఒత్తిడికి గురి చేయకూడదన్న ఉద్దేశంతోనే సాత్విక్ టోర్నీ నుంచి వైదొలిగినట్టు సమాచారం. ఇక, మంగళవారం మొదలైన ఈ టోర్నీలో సిక్కి/సుమిత్, తనీషా/ధ్రువ్ జోడీలు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రెండో రౌండ్‌కు చేరుకున్నాయి. పీవీ సింధు, లక్ష్య సేన్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి.

పాయింట్ పంచుకున్నారు

లిరెన్-గుకేష్ రెండో రౌండ్ డ్రా
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ తొలి గేమ్ పరాజయం నుంచి భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ దొమ్మరాజు తేరుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో రెండో రౌండ్‌ను నల్ల పావులతో ఆడి డ్రాగా ముగించాడు. దాంతో మంగళవారం జరిగిన ఈ రౌండ్ ద్వారా ఇద్దరికీ చెరో అర పాయింటు లభించింది. అయితే సోమవారంనాటి మొదటి గేమ్‌లో నెగ్గిన చైనా గ్రాండ్‌మాస్టర్ లిరెన్ 1.5-0.5 ఆధిక్యంలో నిలిచాడు. ఇక.. మొదటి గేమ్‌కు పూర్తి భిన్నంగా రెండో గేమ్ సాగింది. తొలి గేమ్‌లో గుకేష్, లిరెన్ దూకుడుగా ఎత్తులు వేశారు. కానీ రెండో గేమ్‌లో గుకేష్, లిరెన్ ఇద్దరూ రిస్క్ తీసుకోకుండా ఆడి కేవలం 23 ఎత్తుల్లోనే డ్రాకు అంగీకరించారు. చెస్‌లో అత్యంత పురాతనమైన ఇటాలియన్ ఓపెనింగ్‌ను లిరెన్ ఎంచుకున్నాడు. ఇక.రెండో గేమ్‌లో 14 ఎత్తుల తర్వాత భారత స్టార్ సమయాభావాన్ని ఎదుర్కొన్నాడు. కానీ తర్వాత పుంజుకోవడంతో గుకేశ్ గేమ్‌ను డ్రా దిశగా మళ్లించగలిగాడు.



బజ్‌రంగ్‌పై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: డోప్ పరీక్షకు మూత్రం నమూనా ఇచ్చేందుకు నిరాకరించిన స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) కొరడా ఝళిపించింది. అతడిని ఏకంగా నాలుగు సంవత్సరాలు సస్పెండ్ చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. జాతీయ జట్టుకు ఎంపిక పోటీల సందర్భంగా..టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజ్‌రంగ్ గత మార్చి 10న డోప్ టెస్టుకు హాజరు కావాల్సి ఉంది. అయితే గడువు దాటిన కిట్లతో తన నమూనాను పరీక్షించే అవకాశముందని ఆందోళన వ్యక్తంజేస్తూ..అందుకు బజ్‌రంగ్ ససేమిరా అన్నాడు. దాంతో గత ఏప్రిల్ 23న నాడా అతడిని ప్రాథమికంగా సస్పెండ్ చేసింది. దరిమిలా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ కూడా పూనియాపై చర్య తీసుకుంది. తన సస్పెన్షన్‌పై నాడా క్రమశిక్షణ ప్యానెల్ వద్ద బజ్‌రంగ్ సవాల్ చేశాడు. విచారణ జరిపిన క్రమశిక్షణ కమిటీ పూనియాను దోషిగా తేల్చింది.

వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు గాయత్రి జోడీ

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ స్టార్ జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. టాప్ ఎనిమిది ర్యాంక్ షట్లర్లు మాత్రమే పోటీపడే ఈ సీజన్ ముగింపు టోర్నీ వచ్చేనెల 11 నుంచి చైనాలో జరగనుంది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన గాయత్రి జంట.. వరల్డ్ టూర్ ఫైనల్స్ కోసం బీడబ్ల్యూఎఫ్ మంగళవారం విడుదలజేసిన తాజా ర్యాంకింగ్స్‌లో మహిళల డబుల్స్‌లో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకొంది. తద్వారా చివరి బెర్త్‌ను ఖరారు చేసుకొని గాయత్రి జంట మెగా టోర్నీకి ఎంపికైంది. ఇక, ఈసారి టూర్ ఫైనల్స్‌కు గాయత్రి జోడీ మినహా మరే భారత షట్లర్ ఎంపికవకపోవడం గమనార్హం.

బిజినెస్

ఎస్సార్ గ్రూప్ అధినేత శశి రూయా కన్నుమూత



ముంబై: ఎస్సార్ గ్రూప్ అధినేత శశికాంత్ రూయా సోమవారం అర్ధరాత్రి ముంబైలో మరణించారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. చాలా కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన చికిత్స అనంతరం అమెరికా నుంచి తిరిగి వచ్చారు. ఆయనకు భార్య మంజు, ఇద్దరు కుమారులు ప్రశాంత్, అన్షుమన్ ఉన్నారు. 1965లో తండ్రి నందకిశోర్ రూయా మార్గదర్శకంలో శశి వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. 1969లో సోదరుడు రవి రూయాతో కలిసి ఎస్సార్ పరిశ్రమను స్థాపించారు. ప్రారంభంలో నిర్మాణ రంగానికే పరిమితమైన ఎస్సార్ కంపెనీని మౌలిక వసతులు, ఇంధనం, మెటల్స్ మైనింగ్, టెక్నాలజీ, సర్వీసు రంగాల్లోకి విస్తరించారు.

ఇన్ఫోసిస్ ఉద్యోగులకు బోనస్

బెంగళూరు: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు మరోసారి తీపి కబురు చెప్పింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికాని (క్యూ2)కి మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. ఇది వారి జీతంలో 85 శాతం వరకు ఉన్నట్టు సమాచారం. నవంబరు నెల జీతంతో పాటు కంపెనీ ఈ బోనస్ చెల్లించనుంది. జూన్ త్రైమాసికానికి చెల్లించిన బోనస్‌తో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. డెలివరీ, సేల్స్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఈ బోనస్ అందుకోనున్నారు.

ఉద్యోగులు ఇంటి నుంచి పని చేస్తున్నారా? లేక ఆఫీసుకు వచ్చి పనిచేస్తున్నారా? అనే విషయంతో సంబంధం లేకుండా కంపెనీ ఈ బోనస్ చెల్లించనుంది. దీనికి తోడు వచ్చే జనవరి నుంచి ఉద్యోగుల జీతాలూ పెంచనున్నట్టు తెలుస్తోంది.



అదానీ గ్రూప్‌నకు మూడీస్, ఫిచ్ రేటింగ్స్ షాక్

పరపతి రేటింగ్ కుదించిన సంస్థలు
'స్థిర' రేటింగ్ నుంచి 'ప్రతికూల' రేటింగ్
కొనసాగిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పతనం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల పరపతి మసకబారుతోంది. అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలకు కూడా ఈ గ్రూప్ కంపెనీల భవిష్యత్‌పై నమ్మకం సన్నగిల్లుతోంది. దీంతో ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలు మూడీస్, ఫిచ్ రేటింగ్స్.. అదానీ గ్రూప్‌లోని ఏడు కంపెనీల పరపతి రేటింగ్‌ను మంగళవారం కుదించాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్ఎల్), అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్)కి చెందిన రెండు అనుబంధ సంస్థలు అదానీ ట్రాన్స్‌మిషన్ స్టెప్-వన్ లిమిటెడ్, అదానీ ట్రాన్స్‌పోర్టేషన్ రెస్ట్రిక్టెడ్ గ్రూప్ 1 (ఏటీఎస్ఎల్ ఆర్‌జీ1), అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ (ఏఈఎంఎల్), అదానీ ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐసీటీపీఎల్) కంపెనీల పరపతి రేటింగ్‌ను 'స్థిర' స్థాయి నుంచి 'ప్రతికూల' స్థాయికి కుదిస్తున్నట్టు మూడీస్ ప్రకటించింది. ఏజీఈఎల్ ఛైర్మన్ గౌతమ్ అదానీతో పాటు కంపెనీకి చెందిన పలువురు సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులపై అమెరికా న్యాయశాఖ, ఎస్ఈసీ అవినీతి కేసులు నమోదు చేయడంతో మూడీస్ ఈ చర్య తీసుకుంది.

నిధుల సమీకరణ కష్టమే

మూడీస్‌తో పాటు మరో అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఫిచ్ రేటింగ్స్'.. అదానీ గ్రూప్ కంపెనీలైన అదానీ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబైల పరపతి రేటింగ్‌ను ప్రతికూల పరిశీలన (నెగిటివ్ వాచ్) జాబితాలో పెట్టింది. నిర్వహణాపరమైన లోపాలు, తాజా ఆరోపణల నేపథ్యంలో నిధుల సమీకరణలో ఏర్పడనున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫిచ్ రేటింగ్స్ ఈ నిర్ణయం తీసుకుంది. మూడీస్, ఫిచ్ రేటింగ్స్ తాజా నిర్ణయాలతో నిధుల సమీకరణ అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్ద సమస్య కానుంది. ఇప్పటికే ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే టోటల్ ఎనర్జీ కంపెనీ అదానీ గ్రూప్ కంపెనీల్లో కొత్త పెట్టుబడులను ఆపేస్తున్నట్టు ప్రకటించింది. ఇది తమపై ఎలాంటి ప్రభావం చూపదని అదానీ గ్రూప్ చెబుతున్నా.. ఆ ప్రభావం తప్పకుండా ఉంటుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

మరిన్ని తిప్పలు

అవినీతి ఆరోపణలు, అభియోగాలు నిజమని తేలినా, పరిస్థితులు మెరుగుపరుచుకోకపోయినా పరపతి రేటింగ్ మరింత కుదించాల్సి వస్తుందని మూడీస్, ఫిచ్ రేటింగ్ సంస్థలు అదానీ గ్రూప్‌ను హెచ్చరించాయి. దీంతో ఈ గండం నుంచి ఎలా గట్టెక్కాలో అదానీ కుటుంబ పెద్దలకు పాలుపోవడం లేదు. పరపతి రేటింగ్ కుదించుకుపోవడంతో ఇతర అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు సమకూర్చుకోవడమూ అదానీ గ్రూప్ కంపెనీలకు పెద్ద సవాల్‌గా మారనుంది. తాజా పరిణామాలు అదానీ గ్రూప్ నిధుల సమీకరణ, కంపెనీల అభివృద్ధిపైనా తప్పక ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

ఆగని షేర్ల పతనం

మరోవైపు స్టాక్ మార్కెట్లో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల పతనం కొనసాగుతోంది. మూడీస్, ఫిచ్ రేటింగ్స్ సంస్థల పరపతి రేటింగ్ కోతలతో ఈ షేర్లు మంగళవారం మరింత నష్టపోయాయి. అమ్మకాల ఒత్తిడితో బీఎస్ఈలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 7.05 శాతం నష్టంతో రూ.899.40 వద్ద, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 4.78 శాతం నష్టంతో రూ.2,149.80 దగ్గర, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు 3.79 శాతం నష్టంతో రూ.601.15 వద్ద ముగిశాయి. గ్రూప్‌లోని మిగతా లిస్టెడ్ కంపెనీలు అదానీ టోటల్ గ్యాస్ 3.5 శాతం, అదానీ పోర్ట్స్ 3.23 శాతం, అదానీ విల్మార్ 2.44 శాతం, అంబుజా సిమెంట్స్ 2.3 శాతం, అదానీ పవర్ 2.04 శాతం, సంఘీ ఇండస్ట్రీస్ 1.91 శాతం, ఏసీసీ 1.37 శాతం, ఎన్‌డీటీవీ 0.09 శాతం నష్టపోయాయి.

29 నుంచి విజయవాడలో బిజినెస్ ఎక్స్‌పో-2024

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, విజయవాడలో ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో-2024 నిర్వహిస్తున్నట్టు చాంబర్ విశాఖ జోన్ ఛైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి తెలిపారు. మంగళవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. కాగా రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 'కనెక్ట్, బిల్డ్ అండ్ గ్రో' నినాదంతో ఏర్పాటుచేస్తున్న ఈ ఎక్స్‌పోకు 20 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ గిరిజన సహకార సంస్థ, ఏపీటీడీసీ, తదితర సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మాన్యుఫ్యాక్చరింగ్, టూరిజం, ఇన్‌ఫ్రా, రెన్యువబుల్ ఎనర్జీ తదితర అంశాలపై సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీనాథ్ చెప్పారు.

బైజూస్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

న్యూఢిల్లీ: ఎడ్యు స్టార్టప్ కంపెనీ బైజూస్‌పై ఉచ్చు బిగుస్తోంది. ఈ కంపెనీ రికార్డులు తనిఖీ చేయాలని ప్రభుత్వం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కంపెనీల రిజిస్ట్రార్ (ఆర్‌ఓసీ)ను కోరినట్టు సమాచారం. కంపెనీ తప్పుడు లెక్కలతో పాటు అక్రమంగా నిధులు దారి మళ్లించిందనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఒకప్పుడు 2,200 కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌తో ఒక వెలుగు వెలిగిన బైజూస్ ఇప్పుడు తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కంపెనీపై ఇప్పటికే అమెరికా, భారత్‌లో దివాలా పిటిషన్లు దాఖలయ్యాయి. కంపెనీ కష్టాలకు ప్రధాన ప్రమోటర్ రవీంద్రన్ కారణమని మదుపరులు ఆరోపిస్తున్నారు.

- టీ90 కంటైనరైజ్డ్ క్రూ గన్నరీ సిమ్యులేటర్ (టీ90 సీజీఎస్)కు పేటెంట్‌ను అందుకున్నట్లు జెన్ టెక్నాలజీస్ వెల్లడించింది. సైన్యం యుద్ధానికి సన్నద్ధంగా ఉండే విధంగా ఈ సిమ్యులేటర్‌ను అడ్వాన్స్‌డ్, ఇన్నోవేటివ్ సిస్టమ్‌తో డిజైన్ చేసినట్లు తెలిపింది.

మార్కెట్లో గ్రావ్‌టాన్ క్వాంటా ఈ-బైక్

ధర రూ.1.20 లక్షలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ గ్రావ్‌టాన్ మోటార్స్ పూర్తిగా దేశీయ పరిజ్ఞానంలో తయారుచేసిన క్వాంటా ఎలక్ట్రిక్ (ఈ)- బైక్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బైక్ ధర రూ.1.20 లక్షలు. ఈ సందర్భంగా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ పరశురామ్ పాకా మాట్లాడుతూ.. ఇది స్కూటర్‌లో ఉండే సౌకర్యాలతో డిజైన్ చేసిన మోటార్ సైకిల్ అని చెప్పారు. లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎంఎఫ్‌పీ) బ్యాటరీలతో నడిచే తొలి విద్యుత్ బైక్ కూడా ఇదేనన్నారు. ఇది ఒకసారి చార్జింగ్‌తో 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించటమే కాకుండా 265 కిలోల బరువు మోయగలుగుతుందని ఆయన చెప్పారు. కాగా బ్యాటరీ జీవితకాలం 80 వేల కిలోమీటర్లని, ఆ తర్వాత పాత బ్యాటరీ అప్పగించి కొత్త బ్యాటరీని రూ.45,000కు తీసుకోవచ్చని ఆయన వెల్లడించారు. చర్లపల్లిలోని తమ ఫ్యాక్టరీ ఏడాదికి 30 వేల బైక్‌ల తయారీ సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. ఈ ఫ్యాక్టరీపై ఇప్పటికి రూ.40 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, భవిష్యత్ అవసరాలను బట్టి మరో రూ.110 కోట్లు కూడా సేకరిస్తామని అన్నారు.

ఓలా నుంచి గిగ్ ఈ-స్కూటర్లు



న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్.. వాణిజ్య వాహనాల విభాగంలోకి ప్రవేశించింది. నగరాల్లోని గిగ్ కార్మికుల అవసరాలకు దీటుగా రెండు వేరియెంట్లలో 'గిగ్' స్కూటర్లు తెచ్చినట్టు కంపెనీ సీఎండీ భవిష్ అగర్వాల్ తెలిపారు. గిగ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.39,999. పట్టణాల్లో తక్కువ దూరం ప్రయాణించే గిగ్ వర్కర్లకు ఇది పనికివస్తుంది. ఎక్కువ దూరం ప్రయాణించే వారి కోసం గిగ్ ప్లస్ స్కూటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ గిగ్ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 112 కిలోమీటర్లు నడుస్తుంది. గంటకు గరిష్ఠంగా 25 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇవి కాకుండా ఎస్1జెడ్ మోడల్ ఈ-స్కూటర్లను కూడా విడుదల చేసింది. ఇందులో ఎస్ 1 జెడ్ ధర రూ.59,999 కాగా ఎస్‌జెడ్ ప్లస్ వేరియెంట్ ధర రూ.64,999.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,240 ▼	70,800 ▼	98,000 ▼
ముంబై	75,690 ▼	69,332 ▼	88,463 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ

హైదరాబాద్	590	విజయవాడ	595
వరంగల్	592	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585

డజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	106
వరంగల్	110	గుంటూరు	106
కరీంనగర్	110	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	92
కర్నూలు	110	నెల్లూరు	92
విశాఖపట్నం	115	అనంతపురం	92
గోదావరి	106		

రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 106 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. చైనా, మెక్సికో, కెనడా దిగుమతులపై అదనపు టారిఫ్‌లు విధిస్తామన్న బెదిరింపుల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడం మన మార్కెట్‌ను ప్రభావితం చేసింది. దీంతో మంగళవారం సెన్సెక్స్ 105.79 పాయింట్లు నష్టపోయి 80,004.06 వద్ద ముగియగా నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయిన ఇతర షేర్లలో అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, మహీంద్రా వంటివి ఉన్నాయి. అయితే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం, మిడ్‌క్యాప్ 0.10 శాతం లాభపడ్డాయి.

29 నుంచి సురక్షా డయాగ్నోస్టిక్ ఇష్యూ : శుక్రవారం పబ్లిక్ ఇష్యూకి వస్తున్న సురక్షా డయాగ్నోస్టిక్ కంపెనీ షేరు ధరల శ్రేణిని రూ.420-441గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.846 కోట్లు సమీకరించాలన్నది కంపెనీ లక్ష్యం. ఇష్యూ శుక్రవారం ప్రారంభమై వచ్చే మంగళవారం (డిసెంబరు 3) ముగుస్తుంది. ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలోనే ఉంటుంది. వచ్చే నెల 6వ తేదీన షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేస్తారు.

బంగారం రూ.1250 డౌన్: ట్రంప్ దెబ్బ బులియన్ మార్కెట్‌పై కూడా కనిపించింది. ఢిల్లీలో 99.9 స్వచ్ఛత గల 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1250 క్షీణించి రూ.78,150కి దిగివచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం ధర కూడా రూ.1,250 క్షీణించి రూ.77,750 వద్ద స్థిరపడింది. వెండి కూడా అదే బాటలో పయనించింది. కిలో రూ.1100 తగ్గి రూ.90,600 పలికింది.

ఎంఎఫ్ లావాదేవీలకు కొత్త మదింపు విధానాలు: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు నిర్వహించే రెపో లావాదేవీలకు నూతన మదింపు విధానాలు ప్రవేశపెట్టాలని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ భావిస్తోంది. దీని కింద మార్క్ టు మార్కెట్ విధానంలో వాటికి విలువ కడతారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఈ కొత్త మదింపు విధానం అమల్లోకి వస్తుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
27 నవంబరు 2024

చిలగడ దుంపలతో ప్రయోజనాలెన్నో!

చలికాలంలో ఎక్కువగా చిలగడ దుంపలు లభిస్తుంటాయి. వీటిని నిప్పులమీద కాల్చుకుని లేదా నీటిలో ఉడికించుకుని తింటూ ఉంటాం. చిలగడ దుంపల్లో అత్యధికంగా ఉండే పీచుపదార్థం, విటమిన్లు, ఇతర పోషకాలు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

రోగనిరోధక శక్తి

- చిలకగడ దుంపల్లో ఎ, సి, బి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శీతాకాలంలో ఎక్కువగా బాధించే శ్లేష్మ సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చిలగడ దుంపలను ఉడికించి పొట్టుతీసి నెయ్యి రాసుకుని తింటే శరీరం వేడిని కోల్పోకుండా ఉంటుంది. దీని నుంచి లభించే మెగ్నీషియం మానసిక ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తుంది.

గుండె

- చిలగడ దుంపల్లో బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సీడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో కలిగే ఇన్‌ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడిలపై ప్రభావవంతంగా పనిచేసి గుండె పనితీరు సక్రమంగా ఉండేలా చేస్తాయి. చిలగడ దుంపలను తరచూ తినడం వల్ల వీటినుంచి లభించే పొటాషియం, మాంగనీస్, పీచుపదార్థాలు పలు కార్డియోవాస్క్యులర్ సమస్యలను నిరోధిస్తాయి.

జీర్ణక్రియ

- చిలగడ దుంపల్లో కరగని పీచుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ప్రేగుల్లో అడ్డంకులను తొలగించి మలబద్ధకం రాకుండా కాపాడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారించి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తాయి.



మధుమేహం

- చిలగడ దుంపల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ నిదానంగా జరిగేలా చేసి శరీరం గ్లూకోజ్‌ను గ్రహించే వేగాన్ని తగ్గిస్తుంది. టైప్- 2 మధుమేహం ఉన్నవారు ప్రతిరోజూ చిలగడ దుంపను తినడం వల్ల రక్తంలో గ్లైకోసిలేటెడ్ హిమోగ్లోబిన్ స్థాయి నియంత్రణలో ఉంటుంది.

బరువు

- చిలగడ దుంపలను తిన్న తరవాత వాటిలోని పిండిపదార్థాలు, పీచు పదార్థాలు కలిసి ఆకలి అనే భావన రాకుండా చేస్తాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి, శరీర బరువు పెరగకుండా ఉంటాయి.

మెదడు

- చిలగడ దుంపల్లోని విటమిన్లు, మినరల్స్, బీటా కెరోటిన్ అన్నీ కలిసి మెదడు పనితీరు సక్రమంగా ఉండేలా చేస్తాయి. మతిమరుపు, తలనొప్పి వంటి న్యూరాన్ సంబంధిత వ్యాధులను నిరోధిస్తాయి. వీటిని తరచూ తినడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, కంటిచూపు మెరుగుపడతాయి.

క్యాన్సర్

- చిలగడ దుంపల్లో ఉండే యాంథోసైనిన్ సమ్మేళనాలు క్యాన్సర్ కణాలతో పోరాడుతాయి. చిలగడ దుంపలను నిప్పుల మీద కాల్చుకుని తింటే అన్నవాహిక, జీర్ణాశయం, గొంతు సంబంధిత క్యాన్సర్లు రాకుండా ఉంటాయి.

చర్మం

- చిలగడ దుంపలను తరచూ తినడం వల్ల చర్మం మీద ఉండే పొరలు తేమతో నిండి వార్ధక్య లక్షణాలు తొందరగా రావు. చలిగాలికి చర్మం పొడిబారకుండా ఉంటుంది. వీటిలోని ఎ, సి విటమిన్లు చర్మానికి సాగే గుణాన్ని, మెరుపుని అందిస్తాయి. ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలని పోగొడతాయి.



మరుగునపడ్డ తెలుగు రాణి

మహారాణి మంగమ్మ... ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? మధురై రాజధానిగా పాలించిన నాయక రాజుల వంశానికి చెందిన ఈ తెలుగు రాణి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తాజాగా ఆమె గురించి... 'మధుర మహారాణి మంగమ్మ' అనే పరిశోధనాత్మక చారిత్రక నవల వెలువడింది. 'ఇందులో 80 శాతం చారిత్రక సత్యాలే' అంటారు ఆ నవలా రచయిత... డాక్టర్ సగిలి సుధారాణి. ఆ విశేషాలను ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

"నేను పుట్టి పెరిగింది తిరుపతిలో. పెళ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చాను. తెలుగు విశ్వవిద్యాలయంలో 'చిత్తూరు జిల్లా మహిళల సంప్రదాయ గేయాలు' అనే అంశంపై పరిశోధన చేశాను. ఆ తర్వాత చెన్నైకు వెళ్లాను. 'ద్రావిడ విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు... 'జానపద మౌఖిక సాహిత్యం' అనే అంశంపై పరిశోధన ప్రారంభించాను. చెన్నైలో ఇళ్లలో పని చేసేవారు, ధారాళంగా తెలుగు మాట్లాడే వాళ్లకు కూడా తెలుగు రాయటం రాదు. రెండు మూడు శాతం మందికి, అది కూడా విశ్వవిద్యాలయాల్లో చదివే వారికి మాత్రమే రాయటం కూడా వస్తుంది. నేను మౌఖికంగా తరతరాలుగా వస్తున్న జానపద సాహిత్యాన్ని సేకరిస్తున్నప్పుడు... అక్కడ అనేక తెలుగు పదాలు ఉన్నాయని తెలిసింది.

ఒక రోజు నేను చెన్నై నుంచి ప్రయాణిస్తుంటే మధ్యలో 'మంగమ్మ సాలై' (మంగమ్మ రోడ్డు) వచ్చింది. ఆ పేరు నన్ను ఆకర్షించింది. రహదారికి 'మంగమ్మ' పేరు ఎందుకు పెట్టారనే ప్రశ్న తలెత్తింది. దానికి సమాధానం వెతికితే... ఆమె నాయకరాజుల సమయంలో ఒక మహారాణి అని, భర్త, కొడుకు, మనవడు రాజ్యాన్ని పాలిస్తున్న సమయంలో ఆమె కీలకమైన పాత్ర పోషించిందనే విషయం తెలిసింది. మరింతగా లోతుకు వెళితే... ఆమె తెలుగు రాణి అని కూడా అర్థమయింది.

ఎన్నో ప్రశ్నలు...

నా పరిశోధన పూర్తి అయిన తర్వాత 'తమిళనాట తెలుగు ప్రజల జానపద విజ్ఞానం' అనే గ్రంథం తీసుకువచ్చాను. దీనికి మంచి ప్రశంసలు లభించాయి. ఈ పుస్తకం చూసిన శ్రీ రంగాచారి అనే పరిశోధకుడు- తనవద్ద ఉన్న ఒక పుస్తకాన్ని పంపించారు. అది మహారాణి మంగమ్మకు సంబంధించిన పుస్తకం. దాన్ని రచయిత్రి రూపాబాయి మోతీలాల్ తెలుగులో రాశారు. 'కట్టబొమ్మన నాయకుడు' పేరిట ఆమె ఒక తెలుగు వార పత్రికలో ధారావాహిక రాశారు. కట్టబొమ్మన తెలుగువాడని ఆమె ఈ ధారావాహికలో నిరూపించారు. మహారాణి మంగమ్మపై రూపాబాయి రాసిన పుస్తకం చదివిన తర్వాత నాలో అనేక రకాల ప్రశ్నలు తలెత్తాయి. వాస్తవానికి ఇప్పుడు భౌగోళిక ప్రాంతాల ఆధారంగా వేర్వేరు రాష్ట్రాలుగా ఏర్పాడ్డాం కానీ ఒకప్పుడు తెలుగువారందరూ కలిసే ఉండేవారు. తెలుగువారు అనేక ప్రాంతాలను పాలించారు కూడా! స్థూలంగా ఆ చరిత్రను విశ్లేషించాలనే ఉత్సుకత ఈ మధ్యకాలంలో తగ్గిపోతోంది. దీనివల్ల చరిత్రలో కీలక భూమికను పోషించినవారు కనుమరుగు అవుతున్నారు. దీన్ని భవిష్యత్తు తరాలవారికి అందించాలనే ఉద్దేశంతో ఆ ప్రతిని పరిష్కరించి 'మధుర మహారాణి మంగమ్మ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను.

ఊహల్లో రాణి కాదు...

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సాధారణంగా మహారాణి మంగమ్మ అనగానే చాలామంది శత్రువులతో యుద్ధం చేసిన వీరనారి అనుకుంటారు. కానీ మంగమ్మ కండ బలం కన్నా బుద్ధి బలాన్ని ఉపయోగించి రాజ్యాన్ని కొనసాగేలా చేసింది. మంగమ్మ భర్త చొక్కనాథ నాయకుడు. కొన్ని పరిస్థితులవల్ల ఆయన చెరసాలలో ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో భర్తకు సాయం చేసి, రాజ్యాన్ని తిరిగి చేజిక్కించుకుంది మంగమ్మ. ఆయన రాజ్యాధికారానికి వచ్చిన కొద్ది రోజులకే చొక్కనాథ నాయకుడు మరణించాడు. అప్పటికి మంగమ్మ గర్భవతి. ఆ నాటి సంప్రదాయమైన సతీసహగమనం చేయకుండా మంగమ్మ కుమారుడికి జన్మనిచ్చింది. రాజమాతగా తన కొడుకు సింహాసనాన్ని అధిష్ఠించేలా చేసింది. దురదృష్టమేమిటంటే... కోడలు గర్భవతిగా ఉన్న సమయంలో కొడుకు కూడా చనిపోతాడు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కోడలు చనిపోతుంది. కానీ తన మనవడికి రాజ్యాన్ని అప్పగించి... అతనికి యుక్త వయస్సు వచ్చే దాకా రాజమాతగా పరిపాలిస్తుంది. ఇలా భర్త, కొడుకు, మనమడి రాజ్యాధికార సమయంలో మంగమ్మ కీలకమైన పాత్ర పోషించింది. నాయకరాజుల వారసత్వం కొనసాగేలా చేసింది. అందుకే ఇప్పటికీ మదురై, తిరుచ్చి, శ్రీరంగం ప్రాంతాల్లో మహారాణి మంగమ్మ గురించి కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇప్పటికీ మంగమ్మ రాయించిన తెలుగు శాసనాలు కూడా ఉన్నాయి.



పేరెందుకు రాలేదు?

'మహారాణి మంగమ్మకు ఇతర రాజుల స్థాయిలో పేరు ఎందుకు రాలేదు' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. బహుశా పురుషాధిక్య చరిత్రలో ఆమెకు సముచిత స్థానం లభించలేదేమో. ఆమె వేయించిన రహదారులు ఇప్పటికీ తమిళనాట ప్రజలు వాడుతున్నారు. ఆమె సమాజహితం కోసం చేసిన పనుల గురించి శాసనాలు ఉన్నాయి. కానీ మౌఖిక చరిత్రలో ఆమె గురించి అనేక అవాస్తవాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆమె అక్రమ సంబంధం పెట్టుకుందని, చేసిన మంచి పనులన్నింటి వెనక వ్యక్తిగత స్వార్థం ఉందనే రీతిలో కథలు ప్రచారంలోకి వచ్చాయి. బహుశా దీనివల్ల ఆమెకు తగినంత ప్రాముఖ్యత లభించి ఉండకపోవచ్చు.

అందుకే తక్కువ...

మన దగ్గర పరిశోధనలు చేసే మహిళలు తక్కువ. దీనికి రెండు కారణాలున్నాయి. వివాహం కాకముందు- యువతులకు కుటుంబ సభ్యుల మద్దతు ఉండాలి. వారు భద్రంగా ఉంటారని తల్లిదండ్రులు నమ్మాలి. మన సమాజంలో అమ్మాయిలు స్వేచ్ఛగా దూర ప్రాంతాలకు వెళ్లటానికి అనుమతులు లభించవు. విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక సాయం చేస్తే, వారు స్వేచ్ఛగా పరిశోధనలు చేసుకోగలుగుతారు. వివాహం అయిన తర్వాత ఇంకొన్ని రకాల సమస్యలు ఎదురవుతాయి. భర్త, పిల్లలు అనేక కుటుంబ బాధ్యతలు ఉంటాయి. అయితే వ్యక్తిగతమైన ఆసక్తి ఉంటే పరిశోధనలు సులభంగానే చేయవచ్చు. దీనికి నేనే నిదర్శనమని చెప్పవచ్చు."

● సివిఎల్ఎన్ ప్రసాద్

సేవకులు అనడం సరికాదు...

తమిళనాడులోని అనేక ప్రాంతాలను తెలుగు రాజులు పాలించారు. వారి సమయంలో రాజభాష తెలుగే. అనేకమంది ప్రజలు తెలుగు మాట్లాడేవారు. ఈ రాజులకు సేవ చేయటానికి తెలుగు ప్రాంతాల నుంచి అనేక మంది తరలి వెళ్లారు. వీరిలో అనేక వృత్తులవారు ఉన్నారు. కాబట్టి తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లి అక్కడి రాజులకు సేవ చేశారనటం సరికాదు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మనం కులాంతర, మతాంతర వివాహాలు విన్నాం. కానీ భాషాంతీకరణ జరిగిందనిపిస్తుంది. అంటే అక్కడ నివసించే తెలుగు ఇంటి పేర్లు కనుమరుగైపోతున్నాయి. సాధారణంగా తెలుగువారు తమ ఇంటి పేరును ముందు పెట్టుకుంటారు. వారి కుటుంబ అస్తిత్వం ఆ ఇంటి పేరు నుంచే వస్తుంది. తమిళులు తమ తండ్రి పేరును తమ పేరు చివరన పెట్టుకుంటారు. ఇలా పేరు పెట్టుకుంటే వారికి కొన్ని సదుపాయాలు లభిస్తాయి. దానితో చాలా మంది తెలుగువారు తమ ఇంటి పేరును వదిలేసి చివరలో తండ్రి పేరు పెట్టుకుంటున్నారు. ఈ లెక్కన చూస్తే తమిళనాడులో తెలుగు వారు చాలా ఎక్కువ మంది ఉంటారు.

మంగమ్మ కథ...

మహారాణి మంగమ్మ 17వ శతాబ్దంలో మధురను పాలించిన తెలుగు రాణి. ఈమె పూర్వీకులు చంద్రగిరికి చెందివారు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరు, మదుర, పుదుక్కోట, సెంజి, మైసూరు పాలకులు స్వతంత్రులయ్యారు. వీరిలో నాయక రాజులు- మదుర, తిరుచ్చి రాజధానులుగా సుమారు 200 సంవత్సరాలు పాలించారు. వీరిలో విశ్వనాథ నాయకుడు, తిరుమలనాయకుడు, చొక్కనాథ నాయకుడు, మహారాణి మంగమ్మ ముఖ్యులు. రాణీ మీనాక్షి కాలంలో నాయకరాజుల పాలన అంతరించిపోయింది. మంగమ్మ గురించి ఆ ప్రాంతాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. 'చిక్క దేవరాయలు (మైసూరు పాలకుడు) లాగా కూడబెట్టి పిసినారిలా జీవించేకన్నా... దానధర్మాలు చేసి మంగమ్మలా బతకాలి' అనే నానుడి ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

చలి కాలంలో చలిని తప్పించుకుంటూ, ఫ్యాషన్‌గా కనిపించే దుస్తులు ఎంచుకోవాలి. తాజా పోకడలకు తగ్గట్టుగా, అందరి ఆదరణ అందుకుంటున్న శీతాకాలానికి తగిన అందమైన దుస్తులు ఇవే...

చలి చంపుతున్న చమక్కులో...



పొడవాటి లెహంగా: పొడవాటి లెహంగాలు ఈ కాలంలో వెచ్చదనాన్ని అందించడంతో పాటు ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి ఆకట్టుకునే రంగులతో కూడిన ఈ లెహంగాలను ఎంచుకోవాలి. వీటికి తగ్గట్టు పాదాలకు చదునైన చెప్పులు ధరించాలి.

జాకెట్: తోలు, నూలు మొదలైన పదార్థాలతో తయారైన జాకెట్ ఎంచుకుంటే ఈ కాలంలో వెచ్చగా, ఆకర్షణీయంగా కనిపించవచ్చు. అయితే ధరించే జాకెట్ భుజాలు దిగిపోకుండా ఉండేలా చూసుకోవాలి. జాకెట్ ఒంటికి హత్తుకుపోయినట్టు ఉన్నప్పుడే చూడముచ్చటగా ఉంటుంది. జాకెట్‌కు సరిజోడుగా బూట్లు బాగుంటాయి.



స్కార్ఫ్: స్కార్ఫ్‌లు చలి నుంచి వెచ్చదనాన్నీ సౌకర్యాన్నీ అందిస్తాయి. కాబట్టి చలి కాలం చున్నీలా స్కార్ఫ్‌ను మెడలో వేలాడదీసుకోవచ్చు. మెడ చుట్టూ చుట్టి ఫ్యాషన్ ట్రెండ్‌నూ సృష్టించవచ్చు.





స్టోల్: ఇది కలకాలం కొనసాగే ఫ్యాషన్. కాబట్టి మందంగా ఉండే ఊలుతో తయారైన స్టోల్ ఎంచుకోవాలి.



స్వెటర్: చలి దుస్తులంటే గుర్తుకొచ్చేవి స్వెటర్లే! అయితే సౌకర్యానికి పెద్ద పీట వేస్తూ, దుస్తుల్లో కలిసిపోయినట్టు కనిపించే స్వెటర్స్ అందుబాటులో ఉంటున్నాయి. అలాంటి వాటిని ఎంచుకుంటే రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించడం ఖాయం.

అతిథిగా వెళ్లి.. ఆర్థిక భరోసా ఇచ్చి

టెకీ ఉద్యోగం... మంచి జీతం... ఆశావహమైన భవిష్యత్తు... అయినా ఏదో వెలితితో ఎంతో సతమతమయ్యారు ప్రతిభా కృష్ణయ్య. జీవితాన్ని అర్థవంతంగా మార్చుకోవడానికి ఆమె చేపట్టిన ప్రయాణం కొన్ని వందల మంది మహిళలకు కొత్త జీవితాన్నిచ్చింది.

"పదేళ్ల క్రితం... జీవితానికి భద్రత ఇస్తున్న ఉద్యోగంతో రాజీ పడాలా? నచ్చినట్టు స్వేచ్ఛగా బతకాలా? ఎటూ తేల్చుకోలేని సందిగ్ధత నన్ను చాలా రోజులు వెంటాడింది. అప్పట్లో... స్వస్థలమైన బెంగళూరులోనే ఒక బహుళజాతి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసేదాన్ని. ఉద్యోగంలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. లక్ష్యాలను పూర్తి చేయడానికి ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చేది. అందరితోనూ కలిసిపోవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం లాంటివి చదువుకుంటున్న రోజుల నుంచీ నాకు అలవాటు. కానీ ఉద్యోగంలో చేరిన తరువాత... ఒంటరితనం పెరిగినట్టు అనిపించేది. దాన్ని తప్పించుకోవడానికి ఒక బడిలో ఉచితంగా లెక్కల పాఠాలు చెప్పేదాన్ని. హఠాత్తుగా అనారోగ్యంతో కొన్నాళ్ళు ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. నా గురించి తీరికగా ఆలోచించుకొనే సమయం దొరికింది. 'జీవితం నుంచి నేను ఏం కోరుకుంటున్నాను? అసలు జీవితానికి అర్థం ఏమిటి? దాన్ని అర్థవంతంగా చేసుకోవాలంటే ఏం చెయ్యాలి?'... ఇవన్నీ నాకు నేను వేసుకున్న ప్రశ్నలు. అప్పటికి నాకు ముప్పై ఏళ్ళు దాటాయి. 'మరో ఇరవయ్యేళ్ళకో, పాతికేళ్ళకో ఉద్యోగం మానేసిన తరువాత... ఇన్నేళ్ళూ ప్రశాంతతను కోల్పోయాననీ, 'ఇదీ నేను చేసిన మంచి పని' అని చెప్పుకొనేది ఒక్కటీ లేదనీ విచారించకూడదు' అనుకున్నాను. నా తమ్ముడితో ఈ విషయాలన్నీ చర్చించాను. "ఉద్యోగం మానేసి ఏం చేస్తావు?" అని అడిగాడు. "ఈ ఒత్తిళ్ళకు దూరంగా... ఏదైనా పల్లెటూర్లో ప్రశాంతంగా ఉండాలని ఉంది" అని చెప్పాను. కొన్ని రోజుల తరువాత... "ఎస్‌బిఐ అందిస్తున్న 'యూత్ ఫర్ ఇండియా ఫెలోషిప్' (వైఐఎఫ్)కు దరఖాస్తు చేసుకో" అంటూ ఒక లింక్‌ను నా తమ్ముడు పంపించాడు. దరఖాస్తు చేశాను. ఫెలోషిప్‌కు ఎంపికయ్యాను. అక్కడి నుంచి నా కొత్త ప్రయాణం ఆరంభమయింది.





నైపుణ్యానికి మెరుగులు...

వైఐఎఫ్ కోసం ఏదైనా ఒక గ్రామీణ ప్రాంతంలో పని చెయ్యాల్సి ఉంటుంది. ఉత్తరాఖండ్‌లోని ఖేతిఖాన్ అనే మారుమూల గ్రామంలో ఉన్న 'బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్'తో కలిసి పనిచేయడానికి నన్ను పంపించారు. అది నాకు పూర్తిగా కొత్త ప్రపంచం. ఒక ఏడాది పాటు స్థానికులతో కలిసి పని చేశాను. వారి భాష నేర్చుకున్నాను. వారి సంస్కృతిని అవగాహన చేసుకున్నాను. ఎంతో ఒత్తిడితో గడిపిన పాత రోజులతో పోలిస్తే... అంతులేని ప్రశాంతత నాలో నెలకొంది. ఆ ప్రాంతం నాకు ఎంతగా నచ్చిందంటే... ప్రాజెక్ట్ పూర్తయ్యాక అక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. గ్రామంలోని మహిళలు నన్ను ఎంతో ఆదరించారు. వారి కష్ట సుఖాలు నాతో చెప్పుకొనేవారు. సొంతంగా ఎంతో కొంత సంపాదించాలనే కోరిక చాలామందిలో ఉంది. కానీ దానికి తగిన అవకాశాలు వారికి లేవు. అందుకోసం ఏదైనా చెయ్యాలనుకున్నాను. హిమాలయ ప్రాంతాల్లోని మహిళలకు కుట్లు, అల్లికల్లో మంచి ప్రతిభ ఉంటుంది. ఇరుగు పొరుగువారితో మాట్లాడుతున్నప్పుడు కూడా ఏదో ఒకటి అల్లుతూనే ఉంటారు. దాన్నే వారికి ఆదాయమార్గంగా మార్చాలనుకున్నాను. కొందరు స్నేహితులతో ఈ సంగతి చర్చించాను. 'హిమాలయన్ బ్లూమ్స్' అనే లాభాపేక్ష లేని సంస్థ ఏర్పాటుకు ఆ విధంగా బీజం పడింది. మహిళల్లో ఉన్న నైపుణ్యానికి మెరుగులు దిద్ది, చక్కటి డిజైన్లతో ఉత్పత్తులు తయారు చేయించి, వాటిని విక్రయించడం, లాభాలను వారికి పంచడం... ఇదీ మా లక్ష్యం.

అన్నీ నిర్వహించేది వారే...

ఏదైనా కొత్త ప్రయత్నం చేపట్టినప్పుడు తొలి రోజుల్లో ఆటంకాలు సహజం. మా విషయంలోనూ అదే జరిగింది. ఎక్కువమంది మహిళలు ఆసక్తి చూపించలేదు. నెల రోజుల ప్రయత్నం తరువాత... కేవలం 12 మంది మహిళలు మాత్రమే మాతో చేరారు. వారికి శిక్షణతో పాటు కావలసిన సామగ్రిని అందజేశాం. ఆ ప్రాంతాల్లో వాటికి పెద్దగా డిమాండ్ ఉండదు. అందుకే బెంగళూరులో ప్రదర్శన ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లోనే మేము తీసుకొచ్చిన ఉత్పత్తులన్నిటినీ అమ్మేశాం. ఇది తెలుసుకొని... మొదట్లో సందేహించిన వారు ముందుకువచ్చారు. ప్రస్తుతం ఖేతిఖాన్, ఆ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 250 మందికి పైగా మహిళలు మా సంస్థలో సభ్యులుగా ఉన్నారు. ఊలుతో స్వెటర్లు, బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు, ఉపకరణాలతో పాటు రాఖీల్లాంటివి కూడా వారు తయారు చేస్తారు. వాటి విక్రయం మన దేశంలోని పలు ప్రాంతాలతోపాటు అమెరికా, యూరప్, జపాన్ దేశాలకు కూడా విస్తరించింది. వివిధ దేశాల్లో మేము ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనలకు మంచి ఆదరణ ఉంది. గ్రామీణ మహిళ స్వావలంబనే ప్రధానంగా... ఇంటర్నెట్ వినియోగం, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్ లాంటి సాఫ్ట్‌వేర్లలో శిక్షణను కూడా మా సంస్థ అందిస్తోంది. ఇప్పుడు 'హిమాలయన్ బ్లూమ్స్' తరఫున మార్కెటింగ్, నిర్వహణ, వినియోగదారులతో సంబంధాలు, కొత్తగా చేరే మహిళలకు శిక్షణ... ఇలా అన్ని వ్యవహారాలను సభ్యులైన మహిళలే నిర్వహిస్తున్నారు. వారి సంపాదన నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుంది. పిల్లల చదువుల కోసం, భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనే నిబంధనను అందరూ పాటిస్తున్నారు. 2014లో... అతిథిగా ఆ ప్రాంతంలో అడుగు పెట్టాను. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక సభ్యురాలినైపోయాను. 'నా జీవితానికి అర్థం ఏమిటి?' అనే ప్రశ్నకు జవాబు దొరికింది."


పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో జరుగుతున్న డయాఫ్రం వాల్ ప్లాట్ ఫాం పనులు

డయాఫ్రం వాల్ ప్లాట్‌ఫాం పనులు ప్రారంభం

పోలవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన డయాఫ్రం వాల్ ప్లాట్‌ఫాం పనులను మంగళవారం జలవనరుల శాఖ అధికారులు ప్రారంభించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నడుమ ఉన్న పాత డయాఫ్రం వాల్‌కు సమీపంలో నూతన వాల్ నిర్మాణం కోసం గైడ్ వాల్ పనులు ఇప్పుడు మొదలయ్యాయి. జనవరిలో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ముందస్తుగా ఈ పనులు ప్రారంభించినట్లు ఈఈ సుధాకర్ తెలిపారు. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నడుమ మట్టి, ఇసుక నాణ్యత పరిశీలన చేపట్టారు.

రాజకీయ ప్రమేయం లేని బదిలీల ప్రక్రియ

▸ చట్టాన్ని రూపొందిస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్సీ అశోక్‌బాబు

విజయవాడ(గవర్నర్‌పేట), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'అవినీతికి ఆస్కారం లేని, రాజకీయ ప్రమేయం లేని ఉపాధ్యాయుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత చట్టం రూపొందిస్తోంది. ఇది ఉపాధ్యాయ వర్గాలకు అత్యంత ప్రయోజనకరం' అని టీడీపీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు తెలిపారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె వాయిదా

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ ఉద్యోగులు తమ సమ్మెను విరమించుకున్నారు. ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుతో మంగళవారం ఉద్యోగుల సంఘం నేతలు చర్చించారు. ఉద్యోగులు ఇచ్చిన సమ్మె నోటీసులోని వివిధ అంశాలపై అంగీకారం కుదరడంతో సమ్మెను వాయిదా వేసినట్లు ప్రకటించారు.

వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీపై పిటిషన్

▸ విచారణ నేటికి వాయిదా

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలలో పెరిగిన 75 సీట్లకు నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులందరికీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించి, సీట్లు భర్తీ చేయాలని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ స్టే వెకేట్ పిటిషన్ దాఖలు చేస్తున్నామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరఫున ఏజీ ఈ మేరకు మంగళవారంతెలిపారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన జస్టిస్ జీనరేందర్, జస్టిస్ ఎం.కిరణ్మయి ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్లుగా న్యాయవాదులు వెంకటేశ్వర్లు, బోస్, రవికుమార్

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో ఏపీఎస్ఆర్టీసీ తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎస్.వెంకటేశ్వర్లు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. అలాగే రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ల స్టాండింగ్ కౌన్సిల్‌గా ఏఎస్‌సీ బోస్ నియమితులయ్యారు. ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్లు (ప్రకాశం, నెల్లూరు జిల్లాలు వినహా ఆంధ్ర ప్రాంతానికి), గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ల తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా పొనకంపల్లి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల వేతనాలకు నిధులు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పని చేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల గౌరవ వేతనాల కోసం రూ.285.9 కోట్లు విడుదల చేస్తూ పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2025 మార్చి వరకు గౌరవ వేతనాలను ఈ నిధుల నుంచి చెల్లించాలని స్పష్టం చేశారు.

నేడు మెగా డీఎస్సీ సిలబస్ విడుదల

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో విడుదల చేయనున్న మెగా డీఎస్సీ సిలబస్‌ను బుధవారం విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో సిలబస్ అప్‌లోడ్ చేస్తామన్నారు. నోటిఫికేషన్ విడుదలయ్యేలోగా అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు సిలబస్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

పీజీసెట్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్ స్పాట్, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియను ఉన్నత విద్యామండలి ప్రారంభించింది. ఈనెల 26 నుంచి 29లోగా అడ్మిషన్లు పూర్తి చేయనున్నట్లు మండలి కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి తెలిపారు.

స్పెక్ట్రో స్కోపీతో మట్టి నమూనాలు: అగ్రి డైరెక్టర్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాలను విశ్లేషణకు దోహదపడే స్పెక్ట్రో స్కోపీ విధానంపై త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. కెన్యాలోని నైరోబీలో ప్రపంచ వ్యవసాయ అటవీ పరిశోధన కేంద్రంలో మట్టి నమూనాల విశ్లేషణకు ఉపయోగిస్తున్న స్పెక్ట్రో స్కోపీ విధానంపై వారం రోజులపాటు ఆయన శిక్షణ పొంది, మంగళవారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన చేస్తూ, రసాయనాలతో పని లేకుండా డ్రై కెమిస్ట్రీ పద్ధతిలో స్పెక్ట్రో స్కోపీ విధానంతో చాలా తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో, ఎక్కువ పరిమాణంలో మట్టి నమూనాలు విశ్లేషించవచ్చని తెలిపారు. ఈ స్పెక్ట్రోస్కోపీ విధానంలో మట్టి నమూనాలను విశ్లేషించడానికి రాష్ట్రంలో రెండు ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు.

రామ్మోహన్‌నాయుడి పీఎస్‌గా శ్రీకేశ్ బాలాజీ

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రైవేట్ సెక్రటరీగా 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శ్రీకేశ్ బాలాజీ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఆయన ప్రస్తుతం సర్వే సెటిల్‌మెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర మంత్రికి ప్రైవేట్ సెక్రటరీగా నియమితులు కావడంతో ఏపీ ప్రభుత్వం ఆయనను రిలీవ్ చేసింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



ఐఏఎల్ కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) 2025 కోర్టు క్యాలెండర్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ మంగళవారం హైకోర్టులోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, ఐఏఎల్ నాయకులు ఎండి షరీఫ్, బోను జయమ్మ, ఈఎస్ ప్రసాద్, చలసాని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

'ఈప్యాక్ ప్రీఫ్యాబ్'.. వెరీ ఫాస్ట్..!



▸ 150 గంటల్లోనే పరిశ్రమ నిర్మాణం పూర్తి

▸ 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు

తడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లక్షన్నర చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో ఒక పరిశ్రమను నిర్మించాలంటే.. రెండు మూడు నెలలు పడుతుంది. పనులు ఎంత వేగంగా చేసినా కనీసం నెల రోజులైనా కావాలి. కానీ.. ప్రముఖ ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్ (పీఈబీ) నిర్మాణ సంస్థ 'ఈప్యాక్ ప్రీఫ్యాబ్' తిరుపతి జిల్లాలోని మాంబట్టు పారిశ్రామిక వాడలో రికార్డు స్థాయిలో 150 గంటల్లోనే ఒక భారీ పరిశ్రమను నిర్మించి ఔరా అనిపించింది. దీంతో భారత్‌లోనే అత్యంత వేగంగా నిర్మాణం పూర్తయిన పరిశ్రమగా ఇది 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. మొత్తం 1,51,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనాన్ని ప్రీ ఫ్యాబ్రికేషన్, పీఈబీ టెక్నాలజీ సాయంతో ప్రణాళికాబద్ధంగా నిర్మించారు. మంగళవారం దీని ప్రారంభం సందర్భంగా 'ఈప్యాక్ ప్రీఫ్యాబ్' ఎండీ సంజయ్ సింఘానియా మాట్లాడుతూ.. పీఈబీ టెక్నాలజీ సాయంతో అత్యంత వేగంగా నిర్మించడం తమ సంస్థ సాధించిన గొప్ప మైలురాయిగా భావిస్తున్నామని చెప్పారు. 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' ఆసియా హెడ్ మనీష్ బైష్ణోయ్ ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టీమ్‌ను సత్కరించి.. వారికి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఈప్యాక్ ప్రీఫ్యాబ్ ఈడీ నిఖిల్ బోత్రా, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.


'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సర్టిఫికెట్ అందుకొంటున్న 'ఈప్యాక్ ప్రీఫ్యాబ్' కంపెనీ ఎండీ, ఈడీ సంజయ్ సింఘానియా, నిఖిల్ బోత్రా

జల్‌జీవన్ మిషన్‌కు నిధులివ్వండి






ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పవన్, పక్కన ఎంపీలు బాలశౌరి తంగెళ్ల ఉదయ్, కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, అశ్వినీ వైష్ణవ్, గజేంద్ర సింగ్ షెకావత్, సీఆర్ పాటిల్‌తో పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు కొళాయి కనెక్షన్లు లేవని, అలాగే 2.27 లక్షల పంపులు పనిచేయడం లేదని, మరో 24 వేల కొళాయిలకు అవసరమైన నీటిని సరఫరా చేయడం లేదని వివరించారు. జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను సాధించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని, దీనికి కేంద్ర సహకారం అవసరమన్నారు.

అంచనా వ్యయం పెంచాలి!

ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో చేపడుతున్న పలు నిర్మాణాలకు అంచనా వ్యయం పెంచడంతో పాటు కొత్త పనులకు అవకాశమివ్వాలని పవన్ కల్యాణ్ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఉపాధి పనుల్లో భాగంగా పీఎం ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించుకోవడానికి వంద రోజుల పని దినాలు అదనంగా కల్పించాలని కోరారు. ఉపాధి నిధులతో శ్మశాన వాటికలు, పంచాయతీ భవనాలకు ప్రహరీల నిర్మాణం, ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రామాల్లో తాగునీటికి అవసరమైన పనులు చేసేందుకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. కరువు జిల్లాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులకు రాష్ట్ర వాటా నిధులను తగ్గించి 90:10 దామాషా ప్రకారం కేటాయింపులు జరపాలని కోరారు.

గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యమివ్వండి

గ్రామీణ రోడ్లను ఆధునికీకరించడానికి పీఎం సడక్ యోజన, ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు, నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులు చేపడుతున్నట్టు ఉపముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో 2,643 గ్రామాలకు అనుసంధాన రోడ్లు నిర్మించాలని గుర్తిస్తే, వాటిలో 'పీఎం గ్రామీణ సడక్' యోజన కింద 413 రోడ్ల నిర్మాణానికి మాత్రమే అనుమతి లభించిందన్నారు. గ్రామీణ సడక్ యోజన-4 కింద గ్రామాల్లోని అంతర్గతదారులు కూడా బాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

ప్రాజెక్టు పూర్తికి గడువు పెంచాలి

ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) రుణంతో చేపట్టిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు గడువును 2026 డిసెంబరు 31 వరకు పొడిగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను పవన్ కల్యాణ్ కోరారు. రుణ ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో కాకుండా ముందస్తు చెల్లింపు పద్ధతిని కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న 70:30 శాతం విధానం నుంచి 90:10లోకి మార్చాలన్నారు.

తక్షణం ఆర్వోబీ..

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన డిప్యూటీ సీఎం.. తన సొంత నియోజకవర్గం పిఠాపురం పరిధిలో సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) అవసరం ఉందని, సత్వరమే దీనిని మంజూరు చేయాలని కోరారు. పిఠాపురంలోని శ్రీపాద వల్లభస్వామి దేవాలయానికి పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 4 ముఖ్యమైన రైళ్లకు పిఠాపురం రైల్వేస్టేషన్లో హాల్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి తిరుపతికి రైలు నడపాలని లాతూర్ ప్రజలు చేసిన విన్నపాన్ని కూడా రైల్వే మంత్రి ముందు ఉంచారు.

ఏపీలో పర్యాటక వర్సిటీ

రాష్ట్రానికి మకుటాయమానంగా నిలిచే పర్యాటక ప్రాజెక్టులకు సహకరించి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను పవన్ కల్యాణ్ కోరారు. కేంద్ర పర్యాటక శాఖ.. స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) ప్యాకేజీ కింద ప్రతిపాదించిన గండికోట, అఖండ గోదావరి, సూర్యలంక బీచ్‌లకు రూ.250 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. 'స్వదేశీ దర్శన్ 2.0' కింద రాష్ట్రం నుంచి 4 ప్రాజెక్టులను ప్రతిపాదించగా 3ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసిందని, అరకు-లంబసింగి ఏకో టూరిజం, అడ్వెంచర్ కేటగిరిలోకి వచ్చే పర్యాటక ప్రాజెక్ట్ గురించి వివరించారు. కేరళ తరహాలో గోదావరి బ్యాక్ వాటర్‌ను ఉపయోగించుకుని కోనసీమ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. 'ప్రసాద్' స్కీమ్‌లో అరసవల్లి, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. అమరావతిలో అత్యాధునిక పర్యాటక భవన్‌కు రూ.80 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ పర్యాటక యూనివర్సిటీని ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు.

పవన్‌కు ఉపరాష్ట్రపతి విందు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంగళవారం సాయంత్రం ఆత్మీయ విందు ఇచ్చారు. జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి తంగెళ్ల ఉదయ్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ కూడా హాజరయ్యారు. ఉపరాష్ట్రపతితో భేటీ కావడం గౌరవంగా భావిస్తున్నట్లు పవన్ 'ఎక్స్'లో తెలిపారు. తనకు సమయమిచ్చినందుకు రుణపడి ఉంటానని, ఆయన చాలా విలువైన సలహాలిచ్చారని పేర్కొన్నారు.

నిధులివ్వండి.. అభివృద్ధి బాట పట్టిస్తాం!

పంచాయతీరాజ్ వ్యవస్థను సమ్మిళితం చేసి ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్ఏ) కింద నిధులు ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు. కేంద్రం నుంచి అందాల్సిన ఈ నిధులు 2021 నుంచి కొన్ని కారణాల రీత్యా రాలేదని తెలిపారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రతన్‌సింగ్‌కు విన్నవించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.215.8 కోట్లను కేటాయించాలని ప్రతిపాదనలు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. దీనికి 40% మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడానికి, బ్యాక్‌లాగ్ నిధులకు సంబంధించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.42.26 కోట్లు ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతిపాదిత నిధుల్లో తొలి విడతగా రూ.107.90 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కి శాశ్వత భవనం లేదని, దాని నిర్మాణానికి రూ.20 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జేసీ వర్సెస్ ఆది


టిప్పర్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

▸ ఫ్లైయాష్ రవాణాపై పంతం

▸ కడప నుంచి తాడిపత్రిలోని సిమెంటు ఫ్యాక్టరీకి తరలింపు

▸ తామే రవాణా చేస్తామన్న జేసీ

▸ అడ్డుకుంటామన్న ఎమ్మెల్యే వర్గం

▸ ఆర్టీపీపీ వద్ద రోజంతా ఉద్రిక్తత

▸ భారీగా మోహరించిన పోలీసులు

కడప, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రి బుగ్గవద్ద ఉన్న ఎల్‌అండ్‌టీ సిమెంట్ ఫ్యాక్టరీకి ఫ్లైయాష్ రవాణా చేసే విషయంలో ఇరువర్గాల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. దీంతో ఆర్టీపీపీ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆర్టీపీపీ ఉద్యోగులు, కార్మికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా, ఫ్లైయాష్ రవాణా విషయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి మధ్య సమస్యలున్నాయని జమ్మలమడుగు డీఎస్పీ వేంకటేశ్వర్లు తెలిపారు.

అసలు ఏం జరిగింది?

ఆర్టీపీపీ నుంచి వెలువడే బూడిదను సిమెంటు పరిశ్రమలో ఉపయోగిస్తారు. దీన్ని సమీపంలోని తాడిపత్రికి తీసుకెళుతుంటారు. జగన్ హయంలో ఈ వ్యవహారాన్ని వైసీపీ నేతలే చూసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జేసీ ప్రభాకర్‌రెడ్డి వాహనాలు ఫ్లైయాష్ రవాణా చేస్తున్నాయి. అయితే, ఈసారి ఆదినారాయణరెడ్డి కుటుంబం ఆర్టీపీపీ నుంచి తాడిపత్రికి తమ వాహనాల్లోనే ఫ్లైయాష్‌ను తరలించాలని పట్టుబడుతోంది. ముఖ్యంగా ఎమ్మెల్యే ఆది వర్గీయుడైన భూపేశ్‌రెడ్డి ఈ విషయంలో దూకుడుగా ఉన్నారు. కానీ, ఈ ప్రతిపాదనకు జేసీ అంగీకరించడం లేదు. దీనిపై ఇరు వర్గాల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. అటు జేసీ, ఇటు ఆది వర్గాలు ఎక్కడా తగ్గలేదు. ఈ వ్యవహారంపై రెండు రోజుల క్రితం చర్చలు జరిగినా అవి విఫలమయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం జేసీ అనుచరులు, టిప్పర్లు, ప్రొక్లైనర్లతో ఆర్టీపీపీ వద్దకు వస్తారని సమాచారం రావడంతో.. వారిని అడ్డుకునేందుకు ఆది వర్గీయులు కూడా సిద్ధం కావడం వివాదానికి దారితీసింది.

మేం సైలెంట్ కాదు!

▸ కడప ఎస్పీకి జేసీ లేఖ

ఫ్లైయాష్ రవాణా వ్యవహారంపై జేసీ ప్రభాకర్ రెడ్డి కడప ఎస్పీకి మంగళవారం లేఖ రాశారు. "అక్టోబరు 15 నుంచి ఆర్టీపీపీ వద్ద చెరువు నుంచి బూడిదను లోడ్ చేయనివ్వకుండా మా వాహనాలను ఆదినారాయణరెడ్డి సోదరుడి కుమారుడు భూపేశ్‌రెడ్డి నిషేధించారు. ఈ విషయమై కడప ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీలకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఈ నెల 23న కడప నుంచి వస్తున్న అన్ని సిమెంటు, ఇసుక లారీలు నిలిపివేశాం. ఎస్పీ అభ్యర్థన మేరకు మళ్లీ అనుమతించాం. మా వాహనాలను మంగళవారం నుంచి లోడింగ్‌కు అనుమతిస్తామని తాడిపత్రి పోలీసులు హామీ ఇచ్చారు. కానీ, ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి మా వాహనాలు ఆర్టీపీపీలో లోడింగ్ అవుతాయి. ఈసారి మా వాహనాలు ఆపితే తేలిగ్గా తీసుకోం. వారు దౌర్జన్యం చేస్తే సైలెంట్‌గా ఉండే రక్తం మాది కాదు. నా ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే దేనికైనా సిద్ధమే" అని అందులో ఎర్కొన్నారు. ఈ విషయమై కడప ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, జేసీ రాసిన లేఖ అందిందని, అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

పారదర్శకత లేని వైసీపీ పాలన

▸ సమోసాల కోసం 9 కోట్ల ఖర్చు.. బాధ్యత లేకుండా వ్యవహరించారు

▸ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

▸ అదానీ-జగన్ వ్యవహారంపై సీఎంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం

▸ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. నేడు ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ

న్యూఢిల్లీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సమోసాల కోసమే గత వైసీపీ ప్రభుత్వం రూ.9 కోట్లు ఖర్చు పెట్టిందని, అసలు బాధ్యత అనేది లేకుండా వ్యవహరించిందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం లేవన్నారు. ఆ ప్రభుత్వం చేసిన తప్పులకు బాధ్యత వహించేలా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూస్తామని పేర్కొన్నారు. మంగళవారం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు పవన్ కల్యాణ్ సమాధానాలిచ్చారు. అదానీ-జగన్ వ్యవహారంపై సీఎం చంద్రబాబుతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్జీవీ వ్యవహారంపై స్పందిస్తూ పోలీసులు వాళ్ల పని చేస్తున్నారని అన్నారు. హోంశాఖ, లా అండ్ ఆర్డర్ తన పరిధిలో లేదని, మీరు అడగాల్సింది ముఖ్యమంత్రిని అని మీడియా ప్రతినిధులతో అన్నారు. ఇబ్బంది పెట్టిన వారిని పట్టుకోవడానికి ఎందుకు తటపటాయిస్తున్నారని ఢిల్లీ మీడియా అడిగిందని సీఎంకి చెబుతానని చెప్పారు.

నేడు ప్రధానితో పవన్ భేటీ

కాగా, పవన్ కల్యాణ్ నేడు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. పార్లమెంటు భవనంలో ఉదయం 11కు మోదీతో సమావేశం అవుతారు. ఆ తర్వాత కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రి భూపిందర్‌తోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది.

పన్ను ఎగవేతలను అరికట్టాలి: ఆర్థిక మంత్రి కేశవ్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులు, అక్రమ వస్తు రవాణా రూపంలో ప్రభుత్వ ఖజానాకు ఏర్పడుతున్న నష్టాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వ్యాపారులు నష్టపోకుండా చూడాలని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన వాణిజ్య పన్నుల శాఖ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మిట్టల్ ఉక్కుకు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రపంచంలోనే ప్రఖ్యాత ఉక్కు తయారీ సంస్థలుగా పేరున్న ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఏఎంఎన్ఎస్‌ఐగా ఏర్పడి జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట, డీఎల్ పురం, వేంపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ గ్రామాల పరిధిలో క్యాప్టివ్ పోర్టు ఆధారిత ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. మొత్తం రూ.1,47,162 కోట్ల భారీ పెట్టుబడితో రెండు దశల్లో దీనిని చేపట్టనున్నారు. 2029 జనవరి నాటికి తొలి దశ, 2033 నాటికి రెండో దశగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 61 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు కంపెనీ సమర్పించిన ప్రతిపాదనల్లో పేర్కొంది. స్టీల్ ప్లాంట్‌తోపాటు క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్‌లకు కలిపి మొత్తం 6,756 ఎకరాల భూమితో ఇతర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ భారీ ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన ఉన్నతాధికారులు.. ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం ముందుకు తీసుకొచ్చారు. అక్కడ సవివరంగా చర్చించిన అనంతరం ఏఎంఎన్ఎస్ఐ సంస్థకు నిర్దిష్టమైన ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని విస్తరించడానికి ఎస్ఐపీబీ సిఫారసు చేసింది. దానిని పరిశీలించిన తర్వాత ఆ సంస్థకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని అందించడానికి పరిపాలనాపరమైన అనుమతినిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

బల్క్ డ్రగ్ పార్క్ భూములు బదలాయింపు

స్టీల్ ప్లాంట్ తొలిదశ కోసం 2,200 ఎకరాల భూమిని కేటాయించాలన్న ఏఎంఎన్ఎస్ఐ వినతికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ కోసం సేకరించిన భూముల్లో సుమారు 700 ఎకరాలను దానికి బదిలీ చేయాలని నిర్ణయించింది (కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత బల్క్ డ్రగ్ పార్క్ కోసం దాదాపు 710 ఎకరాల ప్రత్యామ్నాయ భూములను గుర్తించి కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది). మిగతా భూములను సేకరించి ఇచ్చేందుకు అంగీకరించింది. టౌన్‌షిప్ నిర్మాణం కోసం ఇంకో 440 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా సేకరించేందుకు ఆమోదం తెలిపింది. తొలి దశ సివిల్ వర్క్‌లు పూర్తిచేసి యంత్ర పరికరాలను అమర్చాక.. ఆయా పనుల పురోగతిని బట్టి రెండో దశ ప్రాజెక్టుకు, క్యాప్టివ్ పోర్టుకు భూములు సేకరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29) ప్రకారం.. ఆర్థిక ప్రోత్సాహకాలు, 50 శాతం మూలధన రాయితీ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు, పదేళ్లపాటు నీటి సరఫరా, 15 ఏళ్ల పాటు ఈడీ మినహాయింపు, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, ఇంకా విద్యుత్తు, నీరు, రైలు, రోడ్డు కనెక్టివిటీ, సమీపంలోని క్వారీల వినియోగం, నిబంధనల ప్రకారం ఎన్ఎండీసీతో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ముడి ఖనిజం వినియోగం తదితర ప్రోత్సాహకాలను ప్రతిపాదించింది.

దశలవారీగా ప్రాజెక్టు వివరాలు ఇలా..

అంశం	తొలి దశ	రెండో దశ
ఉత్పత్తి సామర్థ్యం	7.3 ఎంఎంపీటీఏ	10.5 ఎంఎంపీటీఏ
పెట్టుబడి	రూ.55,964 కోట్లు	రూ.80,000 కోట్లు
ప్లాంటేషన్‌కు భూమి	2,200 ఎకరాలు	3,800 ఎకరాలు
టౌన్‌షిప్ కోసం భూమి	440 ఎకరాలు	—
ఉద్యోగాలు, ఉపాధి కల్పన	20,000	35,000
క్యాప్టివ్ పోర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు..		
బల్క్ బెర్త్‌లు	2	4
మల్టీపర్పస్ బెర్త్‌లు	3	6
ఎనర్జీ బెర్త్	-	2
సామర్థ్యం	20.5 ఎంఎంపీటీఏ	128.99 ఎంఎంపీటీఏ
భూమి (రీ క్లెయిమ్డ్)	148.26 ఎకరాలు	168.03 ఎకరాలు (అదనంగా)
పెట్టుబడి	రూ.5,816 కోట్లు	రూ.5,382 కోట్లు
ఉపాధి కల్పన	1,000	5,000
ప్రాజెక్టు పూర్తి గడువు	2029 జనవరి	2033



రాజ్‌భవన్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న గవర్నర్

75వ రాజ్యాంగ దినోత్సవం ఓ మైలురాయి: గవర్నర్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 75వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాజ్యాంగం మన దేశ జాతీయ లక్ష్యాలను సూచించడంతో పాటు ప్రజాస్వామ్య, లౌకికవాదం, సోషలిజం, జాతీయ సమైక్యత, పౌరుల హక్కులు, విధులను తెలియజేస్తుందన్నారు.

హైకోర్టులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

▸▸ ముఖ్య అతిథిగా జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ హాజరు



హైకోర్టులో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ పౌరుల ప్రాథమిక హక్కులను రాజ్యాంగం పరిరక్షిస్తోందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏపీ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సమరయోధుల త్యాగాలను మర్చిపోకూడదన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీహరి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు భారత రాజ్యాంగ పీఠికను చదివి రిజిస్ట్రార్‌లు, హైకోర్టు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సభ్యకార్యదర్శి ఎమ్.బబిత పీఠికను చదివి సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగ ఫలాలు బడుగులకు అందలేదు: యనమల

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయినా ఇప్పటి కీ రాజ్యాంగ ఫలాలు బడుగులకు పూర్తి స్థాయిలో అందలేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన చేశారు. 'ప్రభుత్వాల్లో, ప్రభుత్వ వ్యవస్థల్లో బలహీన వర్గాల వారి పాత్ర నామమాత్రంగానే ఉంటోంది' అని పేర్కొన్నారు.

టీడీపీ ఆఫీసులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జాతి పిత మహాత్మా గాంధీ, మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటాలకు అంజలి ఘటించారు. 'భారత్‌ను సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా నిలపడంలో రాజ్యాంగాన్ని రచించి, అమలు చేసిన నేతల పాత్ర ఎంతో ఉంది. రాజ్యాంగాన్ని ఆమోదింపచేయడంలో అంబేడ్కర్ పాత్ర ఉన్నతమైంది' అని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రులు దేవినేని ఉమా మహేశ్వరరావు, నెట్టెం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై వినతుల వెల్లువ

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించాలంటూ టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. వారి అర్జీలను మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కారానికి కృషి చేశారు.

రాజ్యాంగాన్ని వైసీపీ అగౌరవపరుస్తోంది

▸▸ అసెంబ్లీకి వెళ్లని వాళ్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: షర్మిల



రాజ్యాంగ ప్రతితో పాదయాత్ర చేస్తున్న షర్మిల, కాంగ్రెస్ నేతలు


అమరావతి, విజయవాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి వెళ్లకుండా వైసీపీ రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ పీసీసీ, సిటీ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రరత్న భవన్ నుంచి బందరు రోడ్డులోని అంబేడ్కర్ స్మృతి వనం వరకు పాదయాత్ర జరిగింది. 'శాసనసభ్యులు అసెంబ్లీకి వెళ్లాలని రాజ్యాంగం చెబుతోంది. కానీ, జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదన్న సాకుతో అసెంబ్లీకి వెళ్లడం లేదు. సభకు వెళ్లనివాళ్లు రాజ్యాంగం మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు. 'అదానీని బీజేపీ కాపాడుతోంది. వెంటనే విచారణ కమిటీ వేయాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం' అని షర్మిల అన్నారు.

అమిత్ షాతో డిప్యూటీ స్పీకర్ రఘురామ భేటీ



అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘురామరాజు

న్యూఢిల్లీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు భేటీ అయ్యారు. డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఢిల్లీకి వచ్చిన ఆయన షాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని పరిస్థితులు, అసెంబ్లీ జరుగుతున్న తీరును అమిత్ షా అడిగి తెలుసుకున్నారు. మరోవైపు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో కూడా రఘురామ భేటీ అయ్యారు.



పార్లమెంటులో టీడీపీపీ కార్యాలయం ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ భవనంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ ఎంపీల సమక్షంలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్లమెంటు భవనంలోని మొదటి అంతస్తులో టీడీపీకి కార్యాలయాన్ని స్పీకర్ కేటాయించారు. ప్రధాని, కేంద్ర మంత్రుల ఆఫీసులున్న మొదటి అంతస్తులో ఇది ఉండటం గమనార్హం.

ఐటీలో మేటి



ఐటీశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా ఐటీ పాలసీపై మానవవనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి నారా లోకేశ్ తన అభిప్రాయాలను వెల్లడించారు.

భవిష్యత్ అంతా డీప్ టెక్‌దే

రాజధాని నగరం అమరావతిలో డీప్ టెక్నాలజీ ఐటీ ఐకానిక్ భవనాన్ని నిర్మించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ భవన నిర్మాణానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. యువత భవిష్యత్తు అంతా డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి నూతన టెక్నాలజీలపైనే ఆధారపడి ఉందని చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం డీప్ టెక్నాలజీతో కలుగుతున్న ప్రయోజనాలను అందిపుచ్చుకునేలా ఆ ఐకానిక్ భవనం ఉండాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

2029 నాటికి ఐదు లక్షల వర్క్ స్టేషన్లు

ఐటీ రంగానికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలపై కొత్త ఐటీ పాలసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2029కల్లా రాష్ట్రంలో ఐదు లక్షల వర్క్ స్టేషన్లు, 2034కల్లా పది లక్షల వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని పనిచేయాలన్నారు. కో-వర్కింగ్ స్పేస్‌లు, కార్యాలయాల సముదాయాలు నిర్మాణానికి అవసమైన భూములు సబ్సిడీపై లీజుకివ్వడంతో పాటు సింగిల్ విండో విధానంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. ఐటీ సంస్థలకు ఇండస్ట్రియల్ పవర్ టారిఫ్‌ను అమలు చేయాలని స్పష్టం చేశారు. స్టార్టప్ పాలసీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు రూ. 25 లక్షల వరకు మూలధన సబ్సిడీని ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఐఐటీలతో ఇన్నోవేషన్ అనుసంధానం

అమరావతిలో స్థాపించే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు ఐఐటీలను అనుసంధానం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో ఐదు జోనల్ ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటుపైనా ఈ ఉన్నతస్థాయి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ, దక్షిణాంధ్ర, గోదావరి, ఉత్తరాంధ్ర ఇలా ఐదు ప్రాంతాల్లోనూ జోనల్ హబ్‌లను ఏర్పాటు చేయాలని.. వాటికి ప్రధాన కేంద్రంగా అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. ఆ జోనల్ హబ్‌లకు దేశంలోని 25 ఐఐటీలను అనుసంధానం చేయాలని ఆదేశించారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఐటీ పాలసీ అమలులో భాగంగా నెలవారీ ఉద్యోగ కల్పనే లక్ష్యంగా సమీక్షలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పాలసీ ప్రకటన తర్వాత వర్క్‌స్టేషన్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్లు కూడా గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సహకారంతో రాష్ట్రంలో ఎంతమంది వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నారో గుర్తించాలన్నారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో వర్క్‌స్టేషన్ల ఏర్పాటుపై స్పష్టత వస్తుందన్నారు. వర్క్‌స్టేషన్లకు వచ్చి పని చేసుకునేవారికి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా స్కిల్ అప్‌గ్రేడేషన్ చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో పరిజ్ఞానం ఉండి సరైన స్కిల్స్ లేకపోవడంతో రాణించలేకపోతున్న యువత చాలా మంది ఉన్నారని, వారిలో నైపుణ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని చంద్రబాబు చెప్పారు.

సీట్ల సామర్థ్యం ప్రకారం ఐటీ రాయితీలు

ఐటీ డెవలపర్లలకు కేటగిరీల వారీగా రాయితీలు ఇస్తామని చంద్రబాబు వెల్లడించారు. డెవలపర్లను మూడు కేటగిరీలుగా విభజించి కోవర్కింగ్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్, ఐటీ క్యాంపస్‌లకు వాటి సీట్ల సామర్థ్యం, కార్యాలయ సముదాయం విస్తీర్ణానికి అనుగుణంగా ఆ సబ్సిడీలను ఇస్తామని తెలిపారు. కోవర్కింగ్ స్పేస్‌కు సబ్సిడీ పొందాలంటే కనీసం 100 సీట్ల సామర్థ్యంకానీ.. పదివేల చదరపు అడుగుల కార్యాలయ సముదాయంకానీ కావాలని చెప్పారు. నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్‌లకు పది సీట్ల సామర్థ్యం, లేదా వెయ్యి చదరపు అడుగుల కార్యాలయ సముదాయం ఉండాలన్నారు. ఐటీ క్యాంపస్‌కు పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఏటా రూ. 30 కోట్ల టర్నోవర్ లేదా వంద మందికి ఉద్యోగాలు కల్పించే ఐటీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు తుది ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



టెక్స్‌టైల్ పాలసీపై సమీక్షా సమావేశంలో డిజైన్ క్లాత్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి సవిత

10 వేల కోట్ల పెట్టుబడులు

▸▸ 2 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి

▸▸ ఏపీ టెక్స్‌టైల్ పాలసీలో ప్రధానాంశాలు

▸▸ ముసాయిదాపై చంద్రబాబు సంతృప్తి

▸▸ కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడి

▸▸ ఐదేళ్లలో బిలియన్ డాలర్ల ఎగుమతే లక్ష్యమన్న అధికారులు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు.. పది వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. చేనేత, జౌళిశాఖపై సచివాలయంలో మంత్రి సవిత, ఆ శాఖ అధికారులతో సీఎం సమీక్షించారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తెచ్చేందుకు ఇప్పటికే పది పాలసీలు ప్రకటించామని, వస్త్ర రంగంలో బహుళ ప్రయోజనకరమైన పాలసీకి రూపకల్పన చేయాలని చంద్రబాబు సూచించారు. కొత్త పాలసీలో పెట్టుబడిదారులకు రాయితీలు, నేత, ప్రాసెసింగ్, గార్మెంట్స్ అండ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళలకు కొత్త పాలసీలో మూలధన సబ్సిడీ పెంచి అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ రంగంలోకి వచ్చే పెట్టుబడులు గ్రామస్థాయి నుంచి మహిళలకు ఉపాధి ఇచ్చే విధంగా, 2018-23 పాలసీ కన్నా చాలా మెరుగ్గా ఉండాలన్నారు. నూతన టెక్స్‌టైల్ పాలసీ ముసాయిదాపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు త్వరలో మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చేనేత జౌళిశాఖ అధికారులు మాట్లాడుతూ.. ఐదేళ్లలో బిలియన్ డాలర్ల ఎగుమతే లక్ష్యంగా 2024-29 టెక్స్‌టైల్ పాలసీ ఉందన్నారు. పీపీపీ విధానంలో రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుల అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఫార్మ్‌టూఫ్యాబ్రిక్ ట్యాగ్‌తో రూపొందించిన ఈ విధానంలో రాష్ట్రంలో ఉత్పత్తయ్యే మొత్తం నూలును వస్త్రంగా మార్చడమే లక్ష్యమన్నారు. పెట్టుబడి స్థాయి ని బట్టి సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ, మెగా, అల్ట్రా.. ఇలా ఆరు కేటగిరీలు గా విభజించి గరిష్ఠంగా 10 కోట్ల వరకూ రాయితీ ఇచ్చేలా డ్రాఫ్ట్ రూపొందిందన్నారు.



కడప విమానాశ్రయం

చేసింది సున్నా.. నొక్కింది 165 కోట్లు!

▸▸ జగన్ హయాంలో కడప ఎయిర్‌పోర్టుకు చేసింది శూన్యం

▸▸ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పునరుద్ధరణ

(కడప-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడప. ఐదేళ్లు ఆయన అధికారంలో ఉండడంతో ఈ జిల్లా అభివృద్ధిలో పరుగులు పెట్టి ఉంటుందనేది.. ఇతర జిల్లా వాసులు భావన.! కానీ.. సొంత జిల్లా అభివృద్ధికి జగన్ చేసింది అంతంతమాత్రమే. ఆయన అధికారంలో ఉండగా జిల్లాకో విమానాశ్రయాన్ని తీసుకొస్తానని ఊదరగొట్టారు. కానీ.. సొంత జిల్లాలో విమానాశ్రయాన్నే పట్టించుకోలేదు. పైగా.. ఎన్నికలకు ఏడాది ముందు కడప విమానాశ్రయం అభివృద్ధి పేరుతో రూ.165 కోట్లు మాయం చేయడం, దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం రావడంతో జిల్లాలో ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. కడప ఎయిర్‌పోర్టుకు చేసింది సున్నా.. కొట్టేసింది మాత్రం రూ.165 కోట్లా? అంటూ జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి కడప-హైదరాబాద్ విమాన సర్వీసు ఏడాదిపాటు నిలిచిపోయినా ఆయన పట్టించుకోలేదు. చివరికి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవలే ఆ సర్వీసును పునరుద్ధరించారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో కేంద్రం నిధులతో కొత్తగా టెర్మినల్ నిర్మాణం చేపడుతున్నారు. విమానాశ్రయ భూసేకరణకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.70 కోట్లు చెల్లించింది. ఇది తప్ప ఒక్క పనీ చేపట్టలేదు.

టీడీపీ ప్రభుత్వంలోనే మహర్దశ

కడప విమానాశ్రయం టీడీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధికి నోచుకుంది. విభజిత రాష్ట్రానికి మొదటిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కడప విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు. 2015 జూన్ 7న అప్పటి కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు దీన్ని ప్రారంభించారు. అప్పట్లో ఎయిర్ పెగాస్.. కడప-బెంగళూరు మధ్య వారానికి 3సార్లు సర్వీసు నడిపేది. అనంతరం అవి రద్దయ్యాయి. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచేందుకు 2017లో ఉడాన్ స్కీంను ప్రారంభించారు. దీంతో కడప నుంచి ట్రూజెట్.. కడప-హైదరాబాద్, కడప-విజయవాడ, కడప-చెన్నై, కడప-బెల్గాం సర్వీసులు నడిపింది. ట్రూజెట్ తన సర్వీసులు నిలిపివేసిన తర్వాత ఇండిగో సర్వీసులు నడిచేవి. 2023 నవంబరులో ఇండిగో కూడా కడప-హైదరాబాద్ సర్వీసును నిలిపివేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ గత నెల 27 నుంచి కడప-హైదరాబాద్ మధ్య ఇండిగో సర్వీసులు కొనసాగిస్తోంది. ప్రస్తుతం కడప-హైదరాబాద్, కడప-చెన్నై, కడప-విజయవాడ మధ్య సర్వీసులు ఉన్నాయి. రోజూ సగటున 200 మంది రాకపోకలు సాగిస్తున్నారు.

అధికార దుర్వినియోగం

రాజ్యాంగ ఉల్లంఘనే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయం.. అందరికీ సమానంగా అందాలనేది రాజ్యాంగ లక్ష్యం. ఎంత మంచి రాజ్యాంగం ఉన్నా దానిని అమలు చేస్తున్న వారు మంచివాళ్లు కాకపోతే అది చెడుగా మారుతుందని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. రాజ్యాంగంలోని ఓటు హక్కు ద్వారా మేం ఇక్కడికి వచ్చాం. వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని నెమరు వేసుకోవడం కూడా మర్చిపోతున్నాం. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితులూ ఉత్పన్నమవుతున్నాయి. ఏ నాయకుడైనా అతిగా ప్రవర్తించినా, రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసినా సరిచేసే చేసే శక్తి ఓటర్లకు ఉంది. ఎమర్జెన్సీలాంటి చీకటి రోజులు గత ఐదేళ్లలో మన రాష్ట్రంలోనూ నెలకొన్నాయి. ఒక్కోసారి ఖరీదైన తప్పులు జరుగుతూ ఉంటాయి. వాటి వల్ల కొన్ని తరాలు బాధపడతాయి. రాజ్యాంగాన్ని అతిక్రమించినా, దాని స్ఫూర్తికి వ్యతిరేకంగా వ్యవహరించినా ప్రజలే బుద్ధి చెబుతారు. విధ్వంసానికి గురైన వ్యవస్థల్ని బాగు చేయడానికి సమయం పట్టేట్టు కనిపిస్తోంది. ప్రజల్ని హింసించే శక్తుల్ని, వ్యక్తుల్ని శిక్షించకుండా ముందుకు పోతే సమాజానికే ఇబ్బంది. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ సాగాలి. ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన జీవోలను రహస్యంగా ఉంచారు' అని చంద్రబాబు అన్నారు.

మన లక్ష్యాలు ఇవీ...

"2047 నాటికి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా కేంద్రం 'వికసిత భారత్' ను చేపట్టింది. దానిలో భాగంగా ఏపీలో 'స్వర్ణాంధ్ర 2047' ప్రణాళికను రూపొందించాం. ఆ నాటికి తెలుగు వారు దేశంలోనూ, ప్రపంచంలోనూ మొదటి స్థానంలో ఉండాలన్నదే లక్ష్యం. అదే విధంగా తలసరి ఆదాయంలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉండాలి. ఏపీని సంపన్న, ఆరోగ్య, సంతోషకర రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్య ఆశయం. మనమంతా కలిసికట్టుగా కృషి చేస్తే లక్ష్యాలు సాధించగలం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రముఖులతో కమిటీ ఏర్పాటు

'న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, ప్రజాప్రతినిధులు, బాలల హక్కుల సంఘాల ప్రతినిధులతో కమిటీ వేసి, వారి సూచనల మేరకు పుస్తకం రూపొందించాలని నిర్ణయించాం. ఈ పుస్తకాన్ని పాఠశాల కరిక్యులమ్‌తో అనుసంధానం చేస్తాం. టీచర్లకు అవసరమైన శిక్షణ ఇస్తాం. పెద్ద ఎత్తున గ్రంథాలయాలకు పంపిణీ చేయాలని నిర్ణయించాం. రాబోయే అయిదేళ్లలో ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తేవాలని సీఎం చెప్పారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని కష్టపడుతున్నాం' అని లోకేశ్ అన్నారు. కార్యక్రమం చివరిలో సీఎం చంద్రబాబు సభలో పాల్గొన్న అందరితో రాజ్యాంగ పీఠిక చదివించారు. ఈ వేడుకల్లో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, డోలా బాలవీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్, సవిత, బీసీ జనార్ధనరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ వర్క్ చేయండి

▸▸ సాయంత్రం 6 తర్వాత ఆఫీస్‌లో ఉండొద్దు: చంద్రబాబు

రాజ్యాంగ దినోత్సవ సభలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల గురించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'ఉద్యోగులూ.. హార్డ్ వర్క్ వద్దు, స్మార్ట్ వర్క్ చేయండి. గతంలో ఎక్కువ గంటలు ఆఫీసులో ఉండి పనిచేసే వారు. ఇప్పుడు టెక్నాలజీ కారణంగా ఆ అవసరం లేదు. సాయంత్రం 6 తర్వాత కార్యాలయాల్లో ఉండవద్దనేది నా విధానం. సచివాలయ ఉద్యోగులు సహా ఏ ప్రభుత్వ ఉద్యోగైనా స్మార్ట్ వర్క్ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. నేను కూడా సచివాలయం నుంచి ఆరు గంటలకే ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నా' అని వివరించారు.



రాజ్యాంగం పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తాం: లోకేశ్

'గత ఐదేళ్లలో రాజ్యాంగం విలువ తెలుసుకున్న మొదటి వ్యక్తిని నేను. ఈ పుస్తకం పట్టుకొని పాదయాత్ర చేశాను. ఆర్టికల్ 19 ప్రకారం ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్, ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ గురించి గళమెత్తా' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 'నేను పాదయాత్ర చేసేటప్పుడు నాటి పాలకులు, అధికారులు రాజ్యాంగ నిబంధనలను పాటించలేదు. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునూ ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. దాని ఫలితమే గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'పిల్లల కోసం భారత రాజ్యంగం' పేరుతో ప్రాథమిక హక్కులు, ఇతర అంశాలు, సమరయోధుల చరిత్ర తెలిపే విధంగా పుస్తకాలు రూపొందించి అందించాలని నిర్ణయించాం' అని లోకేశ్ తెలిపారు.

రాచమర్యాదలకు 5 లక్షలు..!

▸▸ బోరుగడ్డకు స్టేషన్‌లో మర్యాదల వ్యవహారం

▸▸ వెలుగులోకి వస్తున్న విస్తుపోయే నిజాలు

▸▸ కీలక అధికారితో 5 లక్షలు పంపిన వైసీపీ నేత

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అందిన రాచమర్యాదల వ్యవహారంలో విస్తుపోయే నిజాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే సీఐ కొంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పంపగా... నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారం అంతటితో ముగిసిందని అంతా భావించారు. కానీ.. పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీస్ అధికారులకు మతిపోయినంత పనైంది. పోలీస్ అధికారులకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టడం వల్లే బోరుగడ్డ అనిల్.. స్టేషన్‌ను తన పిక్నిక్ పాయింట్‌గా మార్చుకున్నా.. అందరూ కళ్లు మూసుకున్నారని దర్యాప్తులో గుర్తించినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక గుంటూరుకు చెందిన వైసీపీ ముఖ్య నేత పైస్థాయిలో చక్రం తిప్పినట్లు తెలిసింది. ఆ వైసీపీ నేతకు అత్యంత సన్నిహితంగా ఉండే ఒక పోలీస్ అధికారి ద్వారా రూ.5లక్షలు పంపినట్లు తెలుస్తోంది. అందులో రూ.2 లక్షలు మరో అధికారికి ఇవ్వగా, మిగిలిన రూ.3 లక్షలు ఎవరికి అందాయనేది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. ఆ అధికారి స్టేషన్‌లో ఉండగా.. ఓ రోజు అర్ధరాత్రి సమయంలో బోరుగడ్డ తనయుడు, ఆయన భార్య, మామ దర్జాగా లోపలికి వచ్చి కూర్చున్నట్లు సీసీ కెమెరా ఫుటేజీల్లో గుర్తించారు. బోరుగడ్డ తన కుమారుడిని అరగంటసేపు ఒడిలో కూర్చోబెట్టుకొని ముద్దాడిన దృశ్యాలు కూడా సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనిల్‌కు కస్టడీలో ఇబ్బందిలేకుండా, నోరు విప్పకుండా చూసేందుకు వైసీపీ అధిష్ఠానం ఈ పని చేసినట్లు తెలిసింది.

వేకువన గుండెపోటుకు నివారణ

▸▸ బాపట్ల ఫార్మకాలజీ ప్రొఫెసర్ ఘనత.. కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు



డాక్టర్ వి.సాయికిషోర్

బాపట్ల రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి.సాయికిషోర్ తన విద్యార్థులతో కలిసి చేసిన పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 25న పేటెంట్ మంజూరు చేసింది. ప్రస్తుత ప్రజల జీవన శైలీలో వస్తున్న మార్పులపై ఆయన పరిశోధన చేశారు. గతంలో 50 సంవత్సరాలకు పైబడిన వ్యక్తుల్లో గుండెపోటు లక్షణాలు కనిపించేవి. ఇప్పుడు 35 సంవత్సరాలు నిండిన వారిలో కూడా కనిపిస్తున్నాయి. గుండెపోటు మరణాలు ఎక్కువ సందర్భాల్లో తెల్లవారు జామున ఆరు గంటల ప్రాంతంలో సంభవిస్తున్నాయి. శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురైనప్పుడు గుండెపోటుకు కారణమైన 'కేటాకోలమైన్' అనే కారకం విడుదల అవుతుంది. సహజంగా ఇది తెల్లవారుజామునే శరీరంలో విడుదలవుతుందన్న విషయాన్ని గమనించారు. దీనిని సమర్థవంతంగా అడ్డుకోవడానికి ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ఔషధాలు సంతృప్తికర ఫలితాలను అందించలేకపోతున్నాయి. ఈ ప్రతికూలతలను అధిగమించి మెరుగైన సత్‌ఫలితాలను అందించడానికి 'సమయ నిర్దేశిత ఔషధ విడుదల విధానం' (క్రోనో ఫార్మాసిటికల్ డ్రగ్ డెలివరి సిస్టమ్)ను ఉపయోగించారు. అందుకోసం హృద్రోగ సమస్యలకు విరివిగా ఉపయోగించే డిల్టియాజమ్ హైడ్రోక్లోరైడ్, ప్రొప్రొనాలోల్ హైడ్రోక్లోరైడ్ మందులను పిల్లెట్ల రూపంలోకి మార్చారు. వాటిని జీరో సైజ్ క్యాప్సూల్స్‌లో నింపారు. దానికి 5 గంటల అనంతరం విడుదలయ్యే విధంగా రూపొందించిన హైడ్రోజెల్ ప్లగ్‌ను అమర్చారు. అలా రూపొందించిన క్యాప్సూల్‌ను రాత్రి భోజనం అనంతరం 9 గంటల సమయంలో స్వీకరించాలి. అది అర్ధరాత్రి 2 గంటలు నుండి ఔషదాన్ని విడుదల చేయటం ఆరంభించి తెల్లవారుజామున 6 గంటల సమయానికి గరిష్ఠ మోతాదులో ప్రతికారకాలను విడుదల చేస్తుంది. అవి గుండెపోటుకు దారితీసే కారకాలను సమర్థవంతంగా నిరోధిస్తాయి. ఈ విధానం అత్యంత ప్రభావశీలకమని ప్రయోగాల్లో నిర్ధారణ అయింది. పేటెంట్ వచ్చిన సందర్భంగా డాక్టర్ వి.సాయికిషోర్‌కు... బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్, కరస్పాండెంట్ కొమ్మినేని పద్మ, తాళ్ల రామకృష్ణ, ప్రిన్సిపాల్ మూర్తి అభినందనలు తెలిపారు.

దేవదాయ అధికారుల కక్షసాధింపు

▸▸ ఓ ఉద్యోగికి 3 నెలలుగా జీతం నిలిపివేత

▸▸ కమిషనర్‌కు లేఖలు రాసినా ఫలితం శూన్యం

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కక్షసాధింపులకు దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం వేదికగా మారింది. అక్రమంగా సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి పొందిన వారికి నిబంధనల ప్రకారం రివర్స్ చేయకుండా మళ్లీ సూపరింటెండెంట్లుగా ఉన్నతాధికారులు పదోన్నతులు కల్పిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రశ్నించిన వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల వ్యవహారంలో ఉన్నతాధికారులకు తప్పిదాలను ఎత్తిచూపినందుకు సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డిని ఉన్నతాధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ రెడ్డికి 3 నెలల నుంచి జీతం ఇవ్వడంలేదు. ఈ వ్యవహారంపై సదరు ఉద్యోగి దేవదాయ శాఖ కమిషనర్‌కు అనేకసార్లు లేఖలు రాసినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా జీతం ఇచ్చేందుకు ఆర్థిక శాఖ అనుమతి కావాలని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అధికారులు, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అనుమతి కావాలని ఆర్థిక శాఖ అధికారులు చెబుతూ జీతం నిలిపివేశారు. రాష్ట్ర విభజన సమయంలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల్లో చేసిన తప్పిదాలను దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం అధికారులు ఇప్పటికీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం చంద్రబాబుతో ఒప్పో ఎండీ ఆరిఫ్ భేటీ

▸▸ సీఎస్ఆర్ కింద రూ.46,10,430 విరాళం అందజేత

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఒప్పో మేనేజింగ్ డైరెక్టర్ తస్లీమ్ ఆరిఫ్ మంగళవారం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద సీఎం సహాయనిధికి 46,10,430ల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ, స్మార్ట్ ఉపకరణాల తయారీ తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

అజ్ఞాతంలోనే రామ్‌గోపాల్‌వర్మ

- గాలిస్తున్న ప్రకాశం పోలీసులు
- హైదరాబాద్, కోయంబత్తూర్‌కు పోలీసు బృందాలు



అమరావతి, ఒంగోలు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకరమైన పోస్టులకు సంబంధించి ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సిన వర్మ.. ఇల్లు వదిలి పరారయ్యారు. అరెస్టుకు భయపడి రెండు రోజులుగా వర్మ అజ్ఞాతంలోనే ఉన్నారు. అంతేకాకుండా పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. షూటింగ్ కోసం కోయంబత్తూరు వెళుతున్నానంటూ అక్కడి విమానాశ్రయంలో తీసిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన వర్మ.. 24వ తేదీ ఉదయం 9.30 వరకు హైదరాబాద్‌లోని తన ఇంట్లోనే ఉన్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్ చూపాయి. తీరా పోలీసులు ఇంటికి వెళ్లేసరికి వర్మ లేరు. దీంతో అతనిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్ వెళ్లిన రెండు పోలీసు బృందాలు అక్కడే మకాం వేశాయి. హైదరాబాద్‌లో ఉన్న ఫామ్‌హౌస్‌లలో పోలీసులు గాలిస్తున్నారు. ఒక బృందం కోయంబత్తూరు వెళ్లింది.

బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణలతో మూడు వేర్వేరు కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు వచ్చాయి. రామ్‌గోపాల్ వర్మ తరఫు న్యాయవాది స్పందిస్తూ పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని, వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో బుధవారం విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.

ఐపీఎస్ అధికారుల బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పోలీసు అధికారులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను హైకోర్టు డిసెంబరు 2కి వాయిదా వేసింది. మంగళవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ ఈరోజు కౌంటర్ దాఖలు చేస్తున్నామని, విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను డిసెంబరు 2కు వాయిదా వేస్తూ ఆరోజు వ్యాజ్యాలపై తుది విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. పిటిషనర్లపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారులు క్రాంతిరాణా తాతా, విశాల్‌గున్ని, విజయవాడ అప్పటి ఏసీపీ హనుమంతురావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు మొండితోక బ్రదర్స్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉండగా కృష్ణా జిల్లా నందిగామలో ఆయన కాన్వాయ్‌పై జరిగిన రాళ్లదాడికి సంబంధించి నందిగామ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మొండితోక అరుణ్‌కుమార్, మొండితోక జగన్‌మోహనరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో తమను పోలీసులు ఇరికించే అవకాశం ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యే ధూళిపాళ్లపై దూషణలు

- నిందితుడు కోర్టులో హాజరు.. రిమాండ్

పొన్నూరుటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా దూషణలకు పాల్పడిన వైసీపీ కార్యకర్త షేక్ గోపిలాల్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది. ధూళిపాళ్ల కుటుంబ సభ్యులకు తెల్లరేషన్ ఉందని, అక్రమంగా భూములు కొన్నారంటూ సోషల్ మీడియాలో నాలుగేళ్ల క్రితం వైసీపీకి చెందినవారు దుష్ప్రచారం చేశారు. దీనిపై అప్పట్లోనే ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీసులు ఈ కేసును పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ కేసులో కదలిక వచ్చింది. రూరల్ ఎస్ఐ గండు కిరణ్ కేసు విచారణను పునఃప్రారంభించి ప్రధాన నిందితుడైన పెదకాకాని మండలానికి చెందిన షేక్ గోపిలాల్‌ను అరెస్టు చేశారు. వైసీపీ నాయకులు చెప్పినందువల్లే అసత్య ప్రచారం చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రోద్బలం ఉన్నట్లు తెలిపాడు. దీంతో ఆయన్ను కూడా నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. మరో 12 మందిని కూడా నిందితుల జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో భయం పట్టి పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

పాపాల పోలీసులు!

- వైసీపీ హయాంలో అడ్డగోలు చర్యలు
- వేధింపులే లక్ష్యంగా సీఐడీ కేసులు
- నాటి అరాచకాలపై నేడు చర్యలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ కళ్లలో ఆనందం కోసం... అడ్డగోలుగా వ్యవహరించారు. 'తాడేపల్లి' ఆదేశాలతో చెలరేగిపోయారు. ఇప్పుడు... ఆ ఫలితాన్ని అనుభవిస్తున్నారు. మొన్నటి దాకా సస్పెన్షన్లు... ఇప్పుడు అరెస్టులు కూడా! ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్, అప్పటి ఎంపీ రఘురామ రాజును అరెస్టు చేసి, కస్టడీలో ఉండగా హింసించిన కేసులో రిటైర్డ్ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఏకంగా ఎంపీపై 'థర్డ్ డిగ్రీ' ప్రయోగించడం బరితెగింపునకు నిదర్శనం. పైగా... తనను కొడుతుండగా వీడియోకాల్ చేసి 'పెద్దలకు' చూపించారని రఘురామ పేర్కొన్నారు. అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ ఒక పోలీసు అధికారి ఏమీ చేయకూడదో అదే చేశారు.. దర్యాప్తు అధికారి ఎలా ఉండకూడదో అలానే ఉన్నారు. రఘురామను హింసించడం మాత్రమే కాదు... వైసీపీ హయాంలో విజయ్‌పాల్ చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. 'జగన్‌కు నచ్చని వారిని జైళ్లో పెట్టు. నోరెత్తితే థర్డ్ డిగ్రీ ప్రయోగించు. సుమోటో కేసులు పెట్టు. మీడియా సంస్థలపైనా దేశద్రోహం కేసులు పెట్టు'... ఇదీ అప్పట్లో సీఐడీ అనుసరించిన సూత్రం. తాడేపల్లి పెద్దలు ఆదేశించడమే ఆలస్యం అన్నట్లు ఆడ, మగ, వృద్ధులు అనే తేడా లేకుండా ఏపీ సీఐడీ పోలీసులు అర్ధరాత్రి లాక్కొచ్చి హింసించారు. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ ఆదేశాలతో వృద్ధురాలు రంగనాయకమ్మ నుంచి టీడీపీ నాయకురాలు గౌతు శిరీష వరకు అనేక మందిని మంగళగిరి సీఐడీ కార్యాలయానికి పిలిపించి పొద్దుపోయేదాకా కూర్చోబెట్టి వేధించారు. సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వర రావునూ వేధించారు. ఈ మొత్తం వ్యవహారంలో సునీల్‌కుమార్‌కు అత్యంత నమ్మకస్తుడైన విజయ్‌పాల్ కీలక పాత్ర పోషించారు.

వేధింపులే లక్ష్యం...

విజయ్ పాల్. పోలీసు శాఖలో ఎస్ఐగా చేరారు. అదనపు ఎస్పీగా రిటైర్ అయ్యారు. ఆయన 'పనితీరు'ను మెచ్చి వైసీపీ సర్కారు 'ఐపీఎస్' ఇవ్వాలని ప్రతిపాదనలు పంపించింది. కానీ... ఆ హోదా దక్కలేదు. సీఐడీలో విజయ్ పాల్ తీరు అత్యంత వివాదాస్పదం. ఎవరిపై కేసు పెట్టాలి.. ఎవరిని చితక బాదాలి.. ఎవరిని పిలిపించి వేధించాలి.. ఇవే ఆయన లక్ష్యాలు! తాడేపల్లి నుంచి సునీల్ కుమార్‌కు వెళ్లిన ఆదేశాలు... విజయ్‌పాల్ ద్వారా అమలయ్యేవి. ఏదో ఒక కేసులో నోటీసులు ఇవ్వడం, 'విచారణ' పేరిట పిలిపించి... గంటలకొద్దీ కూర్చోబెట్టి... వేధించడమే పనిగా పెట్టుకున్నారు. చంద్రబాబు తనయుడు లోకేశ్‌ను ఇలాగే వేధించారు. లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్‌ను బెదిరించారు. ఐ-టీడీపీ ఇన్‌చార్జి చింతకాయల విజయ్‌పై కేసు పెట్టి, ఆయన ఇంట్లోకి చొరబడి మహిళలను, పిల్లలను భయభ్రాంతులను చేశారు. ఆయా కేసులు ఏవీ అరెస్టుల దాకా వెళ్లకపోవడం గమనార్హం.

రఘురామపై దేశద్రోహం కేసు

టీవీ చానల్‌లో జరిగిన చర్చల్లో అప్పటి వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణ రాజు ఒక కులం, మతానికి వ్యతిరేకంగా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారంటూ సీఐడీ ఏకంగా 'దేశద్రోహం' కేసు నమోదు చేసింది. దర్యాప్తు అధికారి... విజయ్‌పాల్! ఈ కేసులో రఘురామను అర్ధరాత్రి హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ముఖానికి ముసుగు వేసి కరడుగట్టిన నేరస్థుడి తరహాలో హింసించారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, గుండెలపై కూర్చుని చంపేంత పని చేశారని రఘురామ అప్పట్లో ఆరోపించారు. ఇంత జరిగినప్పటికీ... రఘురామకు అసలు ఎలాంటి గాయాలూ కాలేదని, ఆయనను కొట్టలేదని పోలీసులు వాదించారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో తప్పుడు సర్టిఫికెట్ ఇప్పించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని సైనిక ఆస్పత్రి వైద్యులు పరీక్షించారు. రఘురామకు గాయాలు నిజమేనని ఆ వైద్యులు ధ్రువీకరించారు.

కూటమి సర్కారు రాగానే...

కస్టడీలో జరిగిన హింసపై కూటమి సర్కారు రాగానే గుంటూరులోని నగరంపాలెం పోలీసు స్టేషన్లో రఘురామరాజు ఫిర్యాదు చేశారు. పీఎస్సార్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, వైఎస్ జగన్ తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో నగరపాలెం పోలీసులు విజయ్ పాల్ తదితరులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసులో విచారణకు విజయ్‌పాల్ ఏమాత్రం సహకరించలేదు. పైగా... 'నీ ర్యాంక్ తక్కువ. నన్ను ప్రశ్నించే స్థాయి లేదు' అంటూ దర్యాప్తు అధికారిని దబాయించారు. దీంతో ప్రభుత్వం ఈ కేసును ప్రకాశం జిల్లా ఎస్పీకి అప్పగించింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు విజయ్‌పాల్ సుప్రీంకోర్టు దాకా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో... విజయ్‌పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ఉద్యోగుల సంఘం నేత.. కేఆర్ సూర్యనారాయణకు క్లీన్‌చిట్

- ఎఫ్ఐఆర్ నుంచి పేరు తొలగింపు

విజయవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణకు పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. ఆయనపై నమోదైన అభియోగాలకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ లేవని నిర్ధారించారు. ఈ విషయాన్ని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తెలియజేశారు. డీలర్లు, ఏజెన్సీలు, ఆడిటర్ల నుంచి భారీగా ముడుపులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారంటూ 2023 జూన్‌లో అప్పటి వైసీపీ ప్రభుత్వం విజయవాడ పటమట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించింది. ఈ కేసులో ఏ-1గా బలిజేపల్లి మెహర్‌కుమార్, ఏ-2గా కొచ్చర్లకోట సంధ్య, ఏ-3గా కావూరి వెంకట చలపతి, ఏ-4గా మరీదు సత్యనారాయణ, ఏ-5గా కాశీభట్ల రామ (కేఆర్) సూర్యనారాయణ పేర్లను చేర్చుతూ వారిపై ఐపీసీ 167, 409, 477(ఎ), 201, 420, 384, 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మెహర్‌కుమార్, సంధ్య, వెంకటచలపతి, సత్యనారాయణ విజయవాడ 1 డివిజన్ ఇంటెలిజెన్స్ విభాగంలో, సూర్యనారాయణ రెవెన్యూ విభాగంలో పనిచేసినప్పుడు జీఎస్టీ చట్టాలను ఉపయోగించుకుని భారీగా వసూళ్లు చేశారని.. దీనివల్ల వాణిజ్య పన్నుల శాఖకు భారీగా నష్టం వాటిల్లిందని అభియోగాలు వచ్చాయని, అంతర్గతంగా నిర్వహించిన విచారణలో అవి నిజమేనని తేలిందని కోర్టుకు వివరించారు. మెహర్‌కుమార్, సంధ్య వెంకటచలపతి, సత్యనారాయణను అప్పటి సెంట్రల్ జోన్ ఏసీపీ భాస్కరరావు, పటమట ఇన్‌స్పెక్టర్ డి.కాశీవిశ్వనాథ్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సూర్యనారాయణ మాత్రం దొరకలేదు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని న్యాయపోరాటం చేశారు. ఆయన పాత్రకు సంబంధించి నాడు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికను పటమట పోలీసులు పరిశీలించారు. అందులో సూర్యనారాయణ పేరు ఎక్కడా ప్రస్తావించలేదని నిర్ధారించారు. దీంతో ఎఫ్ఐఆర్ నుంచి ఆయన పేరును తొలగించారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టుకు తెలియజేశారు.

విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌కు బెయిల్

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌కు మంగళవారం బెయిల్ మంజూరైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేశ్ బెయిల్ మంజూరు చేశారు. బెయిల్ షరతుల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో అయినవిల్లి పోలీసుస్టేషన్‌లో శ్రీకాంత్ సంతకాలు చేయాల్సి ఉంటుంది.

వైఎస్ భారతి పీఏనంటూ బెదిరించిన నిందితుడి అరెస్టు

- అధికారులు, వ్యాపారుల నుంచి గతంలో డబ్బుల వసూళ్లు

భోగాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల పీఏనంటూ గతంలో అధికారులను మోసగించిన కేసులో పసుపులేటి నవీన్ అనే నిందితుడిని మంగళవారం విజయనగరం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. భోగాపురం సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు.. భోగాపురం గ్రామానికి చెందిన పసుపులేటి నవీన్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను వైఎస్ భారతి పీఏనని, మంత్రులు పీఏనని, సీఎంవో నుంచి అని ఫోన్ చేసి రెవెన్యూ అధికారులు, వ్యాపారులు, మైనింగు అధికారులను బెదిరించాడు. వారి నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఈ వ్యవహారంపై బాధితులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 22న కేసు నమోదైంది. ఏలూరులో క్వారీ నిర్వాహకుల నుంచి రూ. 13,00,980, విశాఖలో ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు, అచ్యుతాపురంలో మరో వ్యక్తి నుంచి రూ.25 వేలు నవీన్ వసూలు చేశాడు. దీనిపై ఏలూరు జిల్లా తడికలపూడి, విశాఖ జిల్లా అచ్యుతాపురంలో కూడా కేసు నమోదైంది. గతంలో భోగాపురం తహసీల్దార్లుగా విధులు నిర్వహించిన బంగార్రాజు, శ్యామ్‌ప్రసాద్‌ను కూడా నవీన్ మోసగించాడు. దీనిపై బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

విజయ్‌పాల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. 'తెలియదు... గుర్తులేదు... మరిచిపోయా' అనే సమాధానాలు ఇస్తూ ఆయన విచారణకు సహకరించకుండా మొండికేశారు. మంగళవారం మరోమారు విజయ్‌పాల్‌ను ఒంగోలులోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 దాకా ఈ ప్రక్రియ కొనసాగింది. విచారణ అధికారిగా ఉన్న ఎస్పీ ఏఆర్ దామోదర్ సాయంత్రం 6 గంటలకు స్వయంగా రంగంలోకి దిగారు. రఘురామకృష్ణరాజును అంత మొందించేందుకు కుట్ర పన్నారా? దీని వెనుక ఎవరు ఉన్నారు? కస్టడీలో ఆయనను ఎందుకు హింసించారు? మీరు కొట్టకుంటే ఆయన కాలికి గాయాలు ఎలా అయ్యాయి? ఎవరి ఆదేశాల మేరకు రఘురామను కొట్టారు? కేసు నమోదు చేసిన గంటల వ్యవధిలోనే ఆయనను అరెస్టు చేయడంలో ఆంతర్యం ఏమిటి? కనీసం నోటీసు కూడా ఎందుకు ఇవ్వలేదు? హైదరాబాద్‌లో అరెస్టు చేసిన తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరచకుండా ఎందుకు సీఐడీ కార్యాలయంలో నిర్బంధించారు? నిబంధనలు పాటించకపోవడానికి కారణమేమిటి?



ఒంగోలు తాలూకా స్టేషన్ వద్ద విజయ్‌పాల్

ఇలా అనేక కోణాల్లో విజయ్‌పాల్‌ను ప్రశ్నించారు. కానీ... ఆయన దేనికీ సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. పోలీసులు సేకరించిన ఆధారాలను ఆయన ముందుంచి ప్రశ్నించి... కొంత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. రాత్రి 9 గంటల వరకు విచారణ జరిపిన తర్వాత... ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. విచారణలో పోలీసులు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్పీ కార్యాలయంలో ప్రధాన ద్వారం నుంచి విచారణ జరిపిన గెలాక్సీ భవన్ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోకి ఇతరులెవ్వరూ రాకుండా చర్యలు తీసుకున్నారు.

కోర్టుల్లో చుక్కెదురు

అరెస్టు నుంచి తప్పించుకునేందుకు విజయ్‌పాల్ విశ్వప్రయత్నం చేశారు. హైకోర్టులో ఆయనకు చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించడం గమనార్హం. ముందస్తు బెయిల్ కోసం విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. దీంతో.. ఆయన అరెస్టుకు మార్గం సుగమమైంది.

వీరిపైనే కేసు...

2021 మే నెలలో సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకొని చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలైలో రఘురామ రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరు నగరంపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ ఆంజనేయులు, సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్, అప్పటి సీఎం జగన్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రభావతి, మరి కొంతమందిని నిందితులుగా చేర్చారు.

చెవిరెడ్డిపై పోక్సో కేసు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా.. త్వరలోనే అరెస్టు చేసే అవకాశం
- రోజా, ఎంపీ గురుమూర్తి, భూమన, అభినయ్‌రెడ్డిపైనా ఎఫ్ఐఆర్‌కు చాన్సు?



తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ అవాస్తవ ఆరోపణలతో ఆయన దుష్ప్రచారం చేశారని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వాస్తవానికి ఈనెల 23వ తేదీనే బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయగా.. అదే రోజు కేసు నమోదు చేసినా పోలీసులు వివరాలు బహిర్గతం చేయలేదు. వివరాల్లోకి వెళ్తే.. పదో తరగతి చదువుతున్న దళిత మైనర్ బాలిక ఈనెల 4న స్కూలు నుంచి ఇంటికి వచ్చే దారిలో గాయాలతో పడి ఉండడం సంచలనంగా మారింది. ఆ బాలికపై అత్యాచారం జరిగిందంటూ వైసీపీకి చెందిన మాజీ మంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు హడావుడి చేశారు. అసత్యాలు ప్రచారం చేసి తన బిడ్డ భవిష్యత్‌ను పాడు చేయవద్దని బాలిక తండ్రి వేడుకున్నా లాభం లేకపోయింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం.. బాలికను తొలుత పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అమ్మాయికి చికిత్స చేస్తుండగా ఆ గదిలోకి మండల వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జునరెడ్డి వంద మందికిపైగా అనుచరులతో వచ్చారు. చికిత్స చేయకుండా అడ్డుకున్నారు. బాలికపై అత్యాచారం జరిగిందని, తాము అండగా ఉంటామని హడావుడి చేశారు. కాసేపటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులతో కలసి అక్కడకు చేరుకుని బాలిక తండ్రితో ఏమీ మాట్లాడకుండానే.. అత్యాచారం జరిగినట్లు రాసేయండంటూ ఓ పత్రిక విలేకరికి చెప్పారు. అత్యాచారం జరగలేదని తండ్రి చెబుతున్నా వినిపించుకోలేదు. బాలికను మెరుగైన వైద్యం కోసం అదే రోజు రాత్రి తిరుపతి ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. 5వ తేదీన పోలీసు, రెవెన్యూ అధికారుల ఎదుట ఆ బాలిక తనపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేసింది. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చారు. వారి ప్రకటనల ఆధారంగా బాలికపై అత్యాచారం జరిగిందని ఓ పత్రికలో, వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. తన కుమార్తెను వేధించిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత కూడా వైసీపీ నాయకులు, ఓ పత్రిక, వారికి సంబంధించిన సోషల్ మీడియా వాస్తవాలు తెలుసుకోకుండా తమ పరువు ప్రతిష్ఠలు దెబ్బతీసేలా వ్యవహరించారని బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలతో తమ గ్రామంలో తమ కులానికే చెందిన రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. తాము దళితులమని తెలిసి కూడా తమ వివరాలను బహిర్గతం చేసి సమాజంలో తలెత్తుకోనివ్వకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. మైనర్ బాలిక అని తెలిసినా తన కుమార్తె ఆస్పత్రిలో చిరిగిన బట్టలతో చికిత్స చేయించుకుంటున్న ఫొటోలు తీసి మీడియాలో చూపించడం ద్వారా తమ గోప్యతను దెబ్బతీశారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎర్రావారిపాలెం పోలీసులు కేసు (క్రైమ్ నంబరు 58/2024) నమోదు చేసి ఏ-1గా ఎర్రావారిపాలెం మండలం వైసీపీ కన్వీనర్ దేవపట్ల నాగార్జున రెడ్డి, ఏ-2గా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్లు చేర్చారు. ఎంపీ గురుమూర్తి, రోజా, భూమన, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డిని కూడా నిందితులుగా చేర్చే అవకాశాలు ఉన్నాయి.

పోలీసుల కస్టడీ పిటిషన్ కొట్టేయండి

- కడప కోర్టులో వర్రా న్యాయవాదుల అభ్యర్థన

కడప రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు వేసిన పిటిషన్‌పై మంగళవారం కడప ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదనపు జిల్లా కోర్టు)లో విచారణ జరిగింది. వర్రా రవీంద్రారెడ్డి తరఫున హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, ఇందులో ఎస్పీ, డీఐజీలను ప్రతివాదులుగా చేర్చారని న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కస్టడీ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

పిల్లలకు సొంత వైద్యం

ఇష్టారీతిన యాంటీబయాటిక్స్!

- వైద్యుల పాత చీటీలు, మందుల దుకాణాల్లో తెచ్చి వాడేస్తున్న వైనం

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడడం వల్ల తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో రోగకారక సూక్ష్మజీవుల ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ-ఏఎంఆర్) పెరిగిపోతోంది. ఫలితంగా పిల్లలకు జ్వరం, జలుబు వంటి సమస్యలు వచ్చినా.. ఆస్పత్రుల్లో చేర్చి అధిక డోసులో యాంటీబయాటిక్స్ వాడితే కానీ తగ్గడం లేదు.

ఇటీవలి కాలంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పిల్లల వైద్యుల వద్దకు వచ్చే వారిలో దాదాపు 60 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదో ఒక యాంటీబయాటిక్ మందులు వేసిన వారే ఉంటున్నారు. సొంత వైద్యం, మెడికల్ షాప్‌లో ఇచ్చిన మందుల్ని పిల్లలకు వేసేస్తున్నారు. ఆ మందులతో వైరల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు తగ్గకపోవడంతో పరిస్థితి తీవ్రమవుతోంది. అలాంటి పిల్లల్ని కొన్నిసార్లు ఆస్పత్రిలో చేర్చుకొని హైడోసు మందులు ఇస్తే కానీ జబ్బులు తగ్గడం లేదని వైద్యులు చెబుతున్నారు.

చిన్నారుల ఎదుగుదలపైనా ప్రభావం..

పిల్లలకు వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్లకు ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడేస్తున్నారు. దీనివల్ల పిల్లల్లో ఏఎంఆర్ పెరుగుతోంది. చిన్నారుల ఎదుగుదలపైనా ప్రభావం పడుతోంది. రెండేళ్ల లోపు పిల్లలకు పదేపదే యాంటీబయాటిక్స్ ఇవ్వడం వల్ల వారు బరువు పెరగడం, ఎముకలు అసాధారణ రీతిలో పెరగడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన సెప్సిస్ కేసుల్లో కూడా యాంటీబయాటిక్స్ పనిచేయడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. ముందుముందు సాధారణ ఇన్ఫెక్షన్లు కూడా చికిత్సకు లొంగకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సాధారణ వైరల్ జ్వరాలైతే రోగలక్షణాలను బట్టి చికిత్స చేసి, నయం చేయవచ్చని చెబుతున్నారు. తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలకు త్వరగా నయం కావాలన్న ఆత్రుతలో యాంటీబయాటిక్స్‌ను ఉపయోగిస్తున్నారని అంటున్నారు. కొందరైతే యాంటీబయాటిక్స్ మందులు రాయాలంటూ తమపై ఒత్తిడి చేస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. యాంటీబయాటిక్స్ మితిమీరి వినియోగిస్తే పిల్లల్లో న్యుమోనియా, గ్యాస్ట్రిక్ ఇన్‌ఫెక్షన్లు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్యం కారణంగా పిల్లల్లో తరచూ రోగనిరోధక సమస్యలు తలెత్తుతాయంటున్నారు. చాలా మంది పిల్లలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారని చెప్పారు. జీర్ణాశయ వ్యాధులు, చెవి, ముక్కు సమస్యలకు కారణమవుతాయని, ఇలాంటి సమయాల్లో సొంత వైద్యం వల్ల ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరిస్తున్నారు.

దీర్ఘకాలికంగా వాడితే..

యాంటీబయాటిక్స్ మందులను దీర్ఘకాలికంగా వాడితే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. తరుచూ వినియోగించడం వల్ల ప్రస్తుతమున్న జబ్బులను నయం చేయడం మాట దేవుడెరుగు.. లేనిపోని కొత్త రోగాలను కొని తెచ్చుకునే పరిస్థితి ఎదురవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్ వాడకం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి బ్యాక్టీరియా శక్తిమంతమవుతుందని హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ మందులు వాడేస్తున్నారన్నారు. పిల్లలకు ఓవర్ డోస్ అయితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. పిల్లలకు డాక్టర్లు రాసిన చీటీ ప్రకారం కూడా కొన్ని దుకాణాల్లో మందులు ఇవ్వడం లేదని.. వారికి తెలిసిన మందుల్ని అంటగడుతున్నారని చెబుతున్నారు.



గూగుల్‌లో వెతుకుతున్నారు..

చాలా మంది తల్లిదండ్రులు గూగుల్‌లో వెతుక్కోవడం, పాత చీటీ ఉంటే అవే మందులు తీసుకుని పిల్లలకు వేయడం చేస్తున్నారు. డోసు ఎక్కువ.. తక్కువ తీసుకుంటున్నారు. ఇలా వినియోగించడం వల్ల ఆ మందులు పనిచేయడం లేదు. ఆస్పత్రి ఓపీలో 60 శాతం యాంటీబయాటిక్స్‌ను ముందే తీసుకొని వస్తున్నారు. అలాంటి వారికి డోసు పెంచుతున్నాం. లేకపోతే మందులు మార్చి ఇస్తున్నాం. ఫీవర్ పెరిగితే అడ్మిట్ చేసుకుని ఇంజెక్షన్ల ద్వారా ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలకు సొంత వైద్యం చేయడం చాలా ప్రమాదకరం.

- డాక్టర్ కాంచన్, పీడియాట్రిషన్, కామినేని ఆస్పత్రి

వైద్యులు సూచించిన మేరకే వాడాలి..

పిల్లలైనా, పెద్దలైనా ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడితే ఇబ్బందులు వస్తాయి. ఏ జబ్బుకైనా డాక్టర్లు చెప్పిన మందులు, అదీ సరైన డోసులోనే వేసుకోవాలి. బ్యాక్టీరియాకు మందులు ఇచ్చినప్పుడు కోర్సు ప్రకారం వాడాలి. జబ్బు తగ్గగానే మందులు వాడడం మానేస్తున్నారు. పూర్తి కోర్సును వాడకపోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి తయారు కావడం లేదు. రెండు, మూడు రోజులు వాడి మానేస్తే ఆ తర్వాత మందులు పనిచేయవు. పూర్తిగా వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలి.

- డాక్టర్ రవికుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, నిలోఫర్ ఆస్పత్రి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.